ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య మాటలు తూటాల్లా పేలాయి. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లో ఒకటైన జనసేనలోకి బాలినేని చేరబోయే ముందే ఈ ఇద్దరి నాయకులు మాటలతో మంటలు రేపారు. ఒకరు వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేయగా, మరొకరు విచారించుకోమని ఎప్పుడో చెప్పానని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు జిల్లాలో చర్చనీయాంశమయ్యాయి. శనివారం ప్రారంభమైన ఫ్లెక్సీల రగడ ముగియక ముందే ఆదివారం దామచర్ల మరోసారి బాలినేనిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే బాలినేని తన సహజశైలికి విరుద్ధంగా దామచర్ల వ్యాఖ్యలపై సుతిమెత్తగా వ్యాఖ్యానాలు చేశారు. ఈ ఇద్దరి నేతల మధ్య పోరు మున్ముందు కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలకు కారణమవుతాయేమోనన్న అనుమానాలు మొదలయ్యాయి.


దామచర్ల జనార్దన్, ఎమ్మెల్యే


బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

దామచర్ల వర్సెస్ బాలినేని

తూటాల్లా పేలిన మాటలు

ఫ్లెక్సీల రగడ ముగియకముందే మరో వివాదం

జనసేనలో చేరినా వదలం : దామచర్ల

విచారణకు సిద్ధమని సీఎంకు లేఖ రాశా : బాలినేని

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 2012 నుంచి దామచర్ల జనార్దన్, బాలినేని శ్రీనివాసరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడుతున్నారు. నాలుగు సార్లు టీడీపీ నుంచి దామచర్ల, వైసీపీ నుంచి బాలినేని పోటీ చేయగా చెరో రెండు పర్యాయాలు గెలుపొందారు. ఈ ఇద్దరి మధ్య రాజకీయ వైరం రెండు సంవత్సరాలుగా వ్యక్తిగతంగా కూడా రూపాంతరం చెందింది. ఈనేపథ్యంలో సాధారణ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈనెల 26వ తేదీన ఆయన జనసేనలో చేరనున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమి ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న విషయం విదితమే. దీంతో రానున్న రోజుల్లో జిల్లాలోనూ, ప్రధానంగా ఒంగోలులోనూ ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న చర్చ ప్రజానీకంలో ఆరంభమైంది. ఈదశలో శనివారం జనసేనలో చేరబోతున్న బాలినేనికి స్వాగతం చెబుతూ కొందరు ఫ్లెక్సీలు వేశారు. అందులో జనార్దన్ ఫొటో కూడా పెట్టడంపై తెలుగుదేశం వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆఫ్లెక్సీలను కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. ఆవివాదం పూర్తిగా ముగియక ముందే ఆదివారం దామచర్ల జనార్దన్ తన తాత అయిన మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో బాలినేనిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బాలినేని జనసేనలో చేరినా గతంలో చేసిన అవినీతి వ్యవహారాలను వదలబోమంటూ మండిపడ్డారు. ఆతర్వాత ఒంగోలులో బాలినేని మీడియాతో మాట్లాడుతూ తానూ తగ్గేది లేదన్నట్లు వ్యాఖ్యానాలు చేశారు. దీంతో రానున్న రోజుల్లో కూటమి పార్టీల మధ్య ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనన్న ఆసక్తి ఆరంభమైంది.

మిమ్మల్ని వదలం

- తండ్రీ కొడుకుల అవినీతి వెలికితీస్తాం
- బాలినేనిపై విరుచుకుపడ్డ దామచర్ల

అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ మంత్రి బాలినేని పార్టీలు మారుతున్నారని, ఆయన జనసేనలో చేరినా వదిలే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. ఆదివారం టి.నాయుడుపాలెంలో జరిగిన మాజీ మంత్రి అంజనేయులు వర్ధంతి సభలో జనార్దన్ మాట్లాడారు. అధికారంలో ఉన్నన్ని రోజులూ అందరినీ ఇబ్బందులు పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడి వంద రోజులు గడవకముందే పార్టీ మారుతున్నారంటూ బాలినేనికి దామచర్ల చురకలు వేశారు. 'నేను కానీ, దామచర్ల కుటుంబం కానీ ఒక కమిట్‌మెంట్‌తో ఉంటాం. ఇబ్బందులు వస్తే రాజకీయాలు మానుకుంటామే తప్ప పార్టీలు మారం. బాలినేని జిల్లాను సర్వనాశనం చేశాడు. వైసీపీని భ్రష్టు పట్టించాడు. ఆయన, ఆయన కుమారుడు అనేక అవినీతి, అక్రమ వ్యవహారాలకు పాల్పడ్డారు. ఇప్పుడు పార్టీ మారి జనసేనలో చేరతారట. ఆ పార్టీలో చేరినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. ఆయనను వదిలే ప్రసక్తే లేదు' అని దామచర్ల స్పష్టం చేశారు. 'వైసీపీ ప్రభుత్వంలో ఆయన నాపైన 33 కేసులు పెట్టారు. టీడీపీ శ్రేణులు చాలామందిపై కేసులు పెట్టించారు. ఆయన, ఆయన కుమారుడు చేసిన అవినీతి వ్యవహారాలు చాలా ఉన్నాయి. ఇవేమీ నేను మర్చిపోను. అన్నీ బయటికి తీస్తా. ఆయనకు పవన్ కల్యాణ్ అండ ఉండొచ్చు. అంతమాత్రాన మాపార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదులుతామా?' అని జనార్దన్ అన్నారు. గత ఎన్నికల్లో నాతో కలిసి కూటమి పార్టీల విజయం కోసం పనిచేసిన జనసేన, బీజేపీ వారికి నేను అండగా ఉంటానని, కాపాడుకుంటానని జనార్దన్ ప్రకటించారు.

మీరు విచారించుకోండి

- 15 రోజుల క్రితమే సీఎంకు లేఖ రాశా
- మాజీ మంత్రి బాలినేని

ఒంగోలు (కలెక్టరేట్) : తనపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఎప్పుడైనా సిద్ధమని మాజీ మంత్రి, ఒంగోలు మాజీ శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇదేవిషయమై 15 రోజుల క్రితమే సీఎం చంద్రబాబునాయుడుకు కూడా లేఖ రాశానని తెలిపారు. స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో తనకు ఇబ్బందులు ఉన్నందునే పార్టీ మారుతున్నట్లు తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు తనపై మొదటి నుంచి మంచి అభిప్రాయం ఉందన్నారు. ఆయన సమక్షంలో ఈనెల 26న జనసేనలో చేరుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఒంగోలులో ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటు చేశారో కూడా తనకు తెలియదన్నారు. వాటిలో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫొటోలు ఉన్నాయని తొలగించారన్నారు. ఇకపై జనార్దన్ ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోవాలని మావాళ్లకు చెప్తానని బాలినేని స్పష్టం చేశారు. వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం మొదటిసారిగా ఒంగోలుకు వచ్చిన బాలినేనికి అభిమానులు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో గొర్రెపాటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, వర్ధు శేషయ్యతోపాటు పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు

- రెండేళ్లు నిండిన వారికి స్థానచలనం

ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 22 : రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రెండేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. జిల్లా రిజిస్ట్రార్‌గా నెల్లూరు నుంచి ఎ.ఆంజనేయులును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపేంద్రరావును విశాఖపట్నంకు బదిలీ చేశారు. ఈనెల 20న బాధ్యతలు స్వీకరించిన ఎ.ఆంజనేయులు శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేశారు. ఆదివారం రిజిస్ట్రేషన్ శాఖ గుంటూరు ఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌లు, సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు జరిగాయి. ఒంగోలు జాయింట్ వన్ సబ్ రిజిస్ట్రార్‌గా చిలకలూరిపేటలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు, ఒంగోలు జాయింట్-2గా కావలిలో పనిచేస్తున్న కె.రాంబాబును నియమించారు. సింగరాయకొండలో పనిచేస్తున్న సిహెచ్.శ్రీనివాసరావును సంతనూతలపాడుకు, చీమకుర్తిలో పనిచేస్తున్న వాసుదేవరెడ్డిని కనిగిరికి బదిలీ చేశారు. కనిగిరిలో పనిచేస్తున్న పి.గిరిజను మార్కాపురం జాయింట్-1గా, ఒంగోలు ఆడిట్‌లో ఉన్న విజయలక్ష్మిని మార్కాపురం జాయింట్-2గా స్థానచలనం కల్పించారు. పొదిలికి గుంటూరు జిల్లా నుంచి వి.నీరజ, చీమకుర్తికి మురళీధర్, నెల్లూరు జిల్లా నుంచి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిని అమ్మనబ్రోలుకు బదిలీ చేశారు. అమ్మనబ్రోలులో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను పర్చూరు, అద్దంకిలో పనిచేస్తున్న ఎంటీ శ్రీనివాసరావును దర్శికి స్థానచలనం కల్పించారు. కందుకూరు నుంచి సుభాన్‌బాషాను ఎర్రగొండపాలెం, పొదిలిలో పనిచేస్తున్న ఎన్.ప్రసాద్‌ను ఒంగోలు ఆడిట్ ఆఫీస్‌కు, మార్టూరు సబ్ రిజిస్ట్రార్ ఎం.చినరామకోటయ్యను కందుకూరు, ఇంకొల్లులో పనిచేస్తున్న టి.రామలతను సింగరాయికొండకు బదిలీ చేశారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న నవకుమార్‌ను అద్దంకి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. సీనియర్ అసిస్టెంట్‌ల బదిలీల ప్రక్రియ రాత్రివరకూ కొనసాగుతోంది.

20 ఏళ్ల తర్వాత..

- తల్లిదండ్రుల చెంతకు యువకుడు
- చొరవ తీసుకుని చేర్చిన మార్కాపురం పోలీసులు

లోపలి పేజీల్లో..

వంద రోజుల్లోనే రాక్షస పాలన నుంచి విముక్తి


దివంగత దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, వేదికపై మరో మంత్రి స్వామి, ఎంపీ మాగుంట, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఒంగోలు నగర మేయర్ తదితరులు

విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి

చరిత్ర సృష్టించాం : స్వామి

మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులుకు ఘన నివాళి

టంగుటూరు, సెప్టెంబరు 22: 'వందరోజుల్లో ఏమీ జరగలేదని విమర్శలు చేస్తున్నావు.. పాస్‌పుస్తకాల మీద నీ బొమ్మను తొలగించి, నీరాక్షస పాలన నుంచి ప్రజలను విముక్తులను చేశాం. వెయ్యి రూపాయల పింఛన్ పెంచి ఒకటో తేదీనే ఇసున్నాం.. అధికారంలోకి రాకముందు జనంలో, అధికారంలో వచ్చాక కోటలో బతికిన నీవా మా ప్రభుత్వం గురించి మాట్లాడేది' అని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాజీ సీఎం జగన్‌నుఉద్దేశించి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో జరిగిన మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో గొట్టిపాటి మాట్లాడారు. జగన్ పాలన అంతా కల్తీగానే సాగిందని, ఇప్పుడు ఆ పార్టీ నాయకులతోపాటు కార్యకర్తలు కూడా జగన్‌ను విశ్వసించడం లేదని మండిపడ్డారు. ప్రకృతి విపత్తు వస్తే నీలా మా ముఖ్యమంత్రి కోటలో కూర్చోలేదని, ప్రజలకు కష్టాల్లో తోడుగా నిలిచాడని మంత్రి అన్నారు తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి చరిత్రలో కల్తీ ముఖ్యమంత్రిగా మిగిలిపోయారని గొట్టిపాటి దుయ్యబట్టారు. దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు నిబద్ధత గల నాయకుడని కొనియాడారు. సాంఘిక సంక్షేమశాఖమంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి మాట్లాడుతూ వంద రోజుల పాలనలోనే చరిత్ర సృష్టించిన ఘనత చంద్రబాబుదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటున్నారని అన్నారు. తిరుపతి ప్రసాదాన్ని కూడా కమీషన్ల కోసం కక్కుర్తి పడి జగన్ నాశనం చేశాడని దుయ్యబట్టారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు గొప్ప నాయకుడన్నారు. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు ప్రజలకు గొప్పసేవలు అందించారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని, తన తాతను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో పని చేస్తున్నామన్నారు. కష్టమైనా, విధిలేని పరిస్థితులు వచ్చినా రాజకీయాలనుంచి వైదొలుగుతామేకాని, పార్టీలు మారబోమని అన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య అధ్యక్షతన జరిగిన సభలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాం, ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మంత్రి గొట్టిపాటి మరో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి గ్రామంలో నాలుగున్నర కోట్ల రూపాయలతో మంజూరైన 11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. మల్లవరప్పాడు గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత సీఎం ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలను మంత్రులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

టీడీపీ ఎమ్మెల్యేలకు

అధిష్ఠానం షాక్

- ఏకాభిప్రాయం లేని కీలక పోస్టులకు కొత్త అధికారుల నియామకం
- విడుదలైన ఉత్తర్వులు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలకు అధిష్ఠానం షాకిచ్చింది. వారి మధ్య ఏకాభిప్రాయం కుదరని వివిధ, కీలక ప్రభుత్వ శాఖలకు అధికారుల నియామకం విషయంలో నేరుగా నిర్ణయం తీసుకుంది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఒకటికి రెండు పేర్లను సూచించిన నేపథ్యంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఆదివారం సాయంత్రం విడుదలైన బదిలీల ఉత్తర్వులను పరిశీలిస్తే ఈవిషయం తేటతెల్లమవుతోంది. ఆయా శాఖల జిల్లా అధికారుల పోస్టులకు ఎవరిని నియమించాలన్న అంశంపై జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఒక లేఖను తయారు చేసి అటు ముఖ్యమంత్రికి, ఇటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఇచ్చారు. అయితే అందులో మూడు, నాలుగు శాఖల విషయంలో ఏకాభిప్రాయంతో ముందుకెళ్లలేకపోయారు. ఒక ఎమ్మెల్యే నాయకత్వం వహించి మంత్రి స్వామి మినహా, మిగిలిన శాసనసభ్యులు, ఇన్‌చార్జిల సంతకాలతో డీపీవో, డ్వామా పీడీ, సీఈవో లాంటి మరో ఒక ట్రెండు పోస్టులకు కొందరి అధికారుల పేర్లను సిఫార్సు చేస్తూ అధిష్ఠానానికి లేఖ ఇచ్చారు. మంత్రి స్వామి జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో, డ్వామా పీడీ మరోశాఖ అధికారి విషయంలో ప్రత్యేకంగా పేర్లను సూచించినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు ఇచ్చిన ఆ లేఖల్లో మంత్రి సంతకం లేని వాటిని అధిష్ఠానం పక్కన పెట్టింది. అలాగే మంత్రి పంపిన లేఖల్లో మిగిలిన ఎమ్మెల్యేల సంతకాలు లేవు. దీంతో ఆ నాలుగైదు శాఖలకు వీరు విడివిడిగా సూచించిన వారిని కాకుండా కొత్త వారిని నియమించారు. ప్రధానంగా ఒక సీనియర్ ఎమ్మెల్యే. డ్వామా పీడీ, డీపీవోల నియామకంపై అధిష్ఠానం వద్ద ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయినా పట్టించుకోకుండా విడివిడిగా వచ్చిన ప్రతిపాదనలు పక్కన పెట్టి వేరే అధికారులను ఆపోస్టులకు నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

జడ్పీ సీఈవోగా చిరంజీవి



జిల్లా పరిషత్ సీఈవోగా చిరంజీవి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. ఇక్కడికి డిప్యూటీ సీఈవోగా పావులూరి బాలమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆస్థానంలో ఇక్కడ పనిచేస్తున్న హనుమంతరావును కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. మార్కాపురం డీఎల్‌డీవోగా పనిచేస్తున్న నాగసాయికుమార్‌ను గుంటూరు జిల్లా డీపీవోగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

డ్వామా పీడీగా జోసఫ్‌కుమార్

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా జి.జోసఫ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం గుంటూరు జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. ఏలూరులో డ్వామా డీవీవోగా పనిచేస్తున్న విజయలక్ష్మి అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడి రానున్నారు.

డీఎఫ్‌వోగా రాజశేఖర్‌రావు

జిల్లా ఫారెస్ట్ అధికారిగా కె.రాజశేఖరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కృష్ణా జిల్లాలో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీఎఫ్‌వోగా ఉన్న పి.సునీతను కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. గిద్దలూరు ఫారెస్టు డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు చింతపల్లి డీఎఫ్‌వోగా నియమితులయ్యారు.

డీఆర్‌డీఏ పీడీ బదిలీ

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వసుంధర బదిలీ అయ్యారు. ఆమెను నెల్లూరు డీఎల్‌డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల సమయంలో పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లిన జిల్లాకు చెందిన ఇరువురు అధికారులకు పోస్టింగ్‌లు లభించాయి. ఇక్కడ డీపీవోగా పనిచేసిన జీవీ నారాయణరెడ్డి బాపట్ల డీఎల్‌డీవోగా, జడ్పీ సీఈవోగా పనిచేసిన జాలిరెడ్డి సూళ్లూరుపేట డీఎల్‌డీవోగా నియమితులయ్యారు.

డీపీవోగా వెంకటనాయుడు



ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22 : జిల్లా పంచాయతీ అధికారిగా గొట్టిపాటి వెంకటనాయుడు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. వెంకటనాయుడు ప్రస్తుతం అనంతపురం డ్వామా ఎఫ్‌ఎంగా పనిచేస్తున్నారు. బాపట్ల ఈటీసీలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని కనిగిరి డీఎల్‌డీవోగా నియమించారు.

డ్వామాలో అవినీతిపై విజి'లెన్స్'

- పలు అంశాలపై వివరణ కోరుతూ పీడీకి నోటీసు
- గతంలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన ఈదర మోహన్

ఒంగోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో భారీ అవినీతి చోటుచేసుకున్నదన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో 2019-24 మధ్య కాలంలో డ్వామాలో జరిగిన పలు కీలక పనులు, నియామకాలు, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరణ కోరుతూ ప్రస్తుత డ్వామా పీడీకి ఒంగోలులోని విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారైన అడిషనల్ ఎస్పీ కులశేఖర్ నోటీసు ఇచ్చారు. జిల్లాలో ఆ కాలంలో నాలుగున్నరేళ్లపాటు పీడీగా శీనారెడ్డి పనిచేశారు. ఆ సమయంలో పెద్దఎత్తున అవినీతి, అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి వైసీపీ పెద్దల అండతో శీనారెడ్డి అక్రమాలకు పాల్పడ్డారన్న ప్రచారం సాగింది. ఇదేవిషయాన్ని గత నెలలో పలువురు ప్రభుత్వ పెద్దల దృష్టికి పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ తీసుకెళ్లి విచారణ చేయాలని కోరారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, విజిలెన్స్ ఉన్నతాధికారులతోపాటు రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పంపించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులకు నిర్దిష్ట ఆరోపణలతో మోహన్ ఫిర్యాదు చేశారు. ఆ ఐదేళ్ల కాలంలో డ్వామాలో సుమారు రూ.3,383 కోట్ల మేర నిధులు ఖర్చు చేయగా దాదాపు రూ.500 కోట్లు దుర్వినియోగమైనట్లు ఆయన ఆరోపించారు. అందుకు అప్పటి పీడీ శీనారెడ్డి బాధ్యుడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధానంగా జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు, ఉద్యోగుల నియామకాలు, సోషల్ ఆడిట్ ఫిర్యాదుల పరిష్కారం, వ్యక్తిగతంగా వాహనాలకు అక్రమంగా బిల్లులు డ్రా చేయడం తదితర దాదాపు 20 అంశాలను ఆయన పేర్కొన్నారు. ఆ సంస్థలో పనిచేసిన మరో ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు కూడా అలాగే ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.


డ్వామాలో అవినీతిపై విచారణ కోరుతూ మంత్రి డాక్టర్ స్వామికి ఫిర్యాదు చేస్తున్న మోహన్(ఫైల్)

కాగా మోహన్ తొలుత పురందేశ్వరికి ఇచ్చిన ఫిర్యాదును ఆపార్టీ తరఫున పరిశీలన కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపారు. మంత్రి స్వామి తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ, చర్యలు కోరుతూ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ రాయడమేకాక స్వయంగా దాన్ని ఆయనకు ఇచ్చారు. మోహన్ ఇచ్చిన ఫిర్యాదు కాపీని ఎమ్మెల్యే జనార్దన్ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అందజేసి విచారణ కోరారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ విభాగం ఈ అంశంపై దృష్టి సారించింది. జిల్లాలో డ్వామా పరిధిలో 2019-24 మధ్య నిధుల వినియోగం, చేసిన ప్రధాన పనులు, చెల్లింపులు, సిబ్బంది నియామకాలు తదితర అంశాల పరిశీలనకు నిర్ణయించుకున్న విజిలెన్స్‌శాఖ సంబంధిత వివరాలను అందజేయాలని ప్రస్తుత డ్వామా పీడీని కోరారు.



గోపూజలో పాల్గొన్న జయంత్‌బాబు, బదరీనారాయణ తదితరులు

మల్లవరంలో గోశాల ప్రారంభం

మద్దిపాడు, సెప్టెంబరు 22: మల్లవరం శ్రీవేంకటేశ్వర ఆలయానికి అనుసంధానంగా ఆదివారం గోశాలను ప్రారంభించారు. ఆలయ కమిటీ ఐదో వార్షికోత్సవం పురస్కరించుకుని గోశాలను ఏర్పాటు చేయగా టీడీపీ మండలాధ్యక్షుడు మండవ జయంత్‌బాబు దంపతులు, చలువాది బదరీ నారాయణ దంపతులు ముఖ్యఅతిథులుగా హాజరై గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు కావూరి వాసు, అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, కోశాధికారి మన్నం శ్రీనివాస్, సభ్యులు ముప్పవరపు ధనలక్ష్మి, కారుమూడి చిన్న వెంకటేశ్వర్లు, చుండూరి చలపతిరావు, రావూరి నరసింహారావు, తేళ్ల సుబ్బారావు, పల్లకి రామసుబ్బారెడ్డి, గంటా శ్రీనివాసరావు, చందోలు సుబ్బారావు, ఆలయ ఈవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పీడీసీసీబీ స్టాఫ్ యూనియన్ నూతన కమిటీ



నూతన కమిటీ సభ్యులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22 : ప్రకాశం జిల్లా కోఆపరేటివ్ బ్యాంక్స్ (పీడీసీసీబీ) ఎంప్లాయిస్ అసోసియేషన్ అనుబంధంగా పనిచేస్తున్న స్టాఫ్ యూనియన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. ఆదివారం ఒంగోలు నగరం కర్నూలురోడ్‌లోని ఓ హోటల్‌లో యూనియన్ సర్వ సభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీ, ఉద్యోగోన్నతులలో ఎదురవుతున్న సమస్యల పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. అనంతరం ఫౌండర్ ప్రెసిడెంట్‌గా ఎస్.హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.ప్రశాంతలక్ష్మి, వి.ఏడు కొండలునాయక్, సంయుక్త కార్యదర్శిగా ఎం.రామకృష్ణ, కోశాధికారిగా పి.చైతన్య, డైరెక్టర్లుగా పి.రజనీకుమారి, జి.వెంకటేశ్వర్లు, ఎ.ప్రసన్నకోటేశ్వరి, సీహెచ్.లావణ్య, కాకా రవీంద్రప్రసాద్, పి.సుస్మిత ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా జిల్లా నుంచి అట్ల శ్రీను ప్రతిపాదించగా, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.నాగార్జునరెడ్డి ప్రతిపాదించారు, సమావేశంలో ప్రధానకార్యదర్శి సనక గోపీనాథ్, ముఖ్య సలహాదారు బోగాది శ్యామ్‌ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీని సభ్యులు అభినందించారు.

ఉద్యోగాలకు 109 మంది విద్యార్థినులు



ఎంపికైన విద్యార్థినులతో ప్రిన్సిపాల్ కల్యాణి

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22 : దామచర్ల ఆంజనేయులు ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం తూర్పునాయుడుపాలెంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు తమ సత్తా చాటారు. కళాశాల విద్యార్థినులు 117మంది జాబ్‌మేళాలో పాల్గొనగా 109మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. విద్యార్థినులు ప్రముఖ కంపెనీల నుంచి ఆఫర్ లెటర్లు అందుకున్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కల్యాణి, జేఏసీ మెంటార్ సురేష్ కుమార్ తదితరులు అభినందించారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి

మద్దిపాడు, సెప్టెంబరు 22: ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని తగ్గించాలని పంచాయతీ కార్యదర్శి ఆశాలక్ష్మి కోరారు. ఆదివారం మద్దిపాడు సచివాలయం సమీపంలో ప్లాస్టిక్ ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్లాస్టిక్ కవర్లు కాకుండా జూటు సంచులను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్ తీర్పును

పునఃసమీక్షించాలి

రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటిషన్ వేయాలి

మాలమహాసభ అధ్యక్షుడు వెంకట్రావు డిమాండ్



నాయకులతో కలిసి అభివాదం చేస్తున్న వెంకట్రావు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 22: ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్ తీర్పుకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో ఇంప్లీడ్ పిటీషన్ దాఖలు చేయాలని మాలమహాసభ జాతీయ అధ్యక్షుడు మల్లెల వెంకట్రావు డిమాండ్ చేశారు. ఆదివారం ఒంగోలులోని అంబేడ్కర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్ వ్యతిరేక సభలో ఆయన ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు వైసీపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టుల వైఖరిని ఖండించారు. రిజర్వేషన్‌కు తూట్లు పొడిచే విధంగా ఉన్న తీర్పును తప్పు పట్టారు. అధికారపార్టీలో ఉన్న మాల ఎంపీలు, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు వివరించి వర్గీకరణ ప్రయత్నాలను నిలిపి వేయించాలని కోరారు. రిజర్వేషన్లు కాపాడుకునేందుకు 35 ఆర్టికల్ 341 కు క్లాజ్ 3ను చేర్చి ప్రభుత్వాలు, న్యాయస్థానాలు జోక్యం చేసుకోకుండా రాజ్యాంగ సవరణ తేవాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ ఉర్దూ సెంట్రల్ యూనివర్శిటీ ప్రొఫెసర్ జీవీ.రత్నాకర్ మాట్లాడుతూ రిజర్వేషన్లు తొలిగించే కుట్రలో భాగమే క్రీమిలేయర్ తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అంబేడ్కర్ కల్పించిన హక్కును కాపాడుకునేందుకు అందరూ ఐక్యం కావాలని ఆయన పిలుపునిచ్చారు. దళిత సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాలమహానాడు అధ్యక్షుడు దాసరి శివాజీ, దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు, నాయకులు అంబడి కొండలరావు, ఉద్యోగ సంఘం నాయకులు టి.అశోక్, గోపి, జైజనంపార్టీ అధ్యక్షుడు రవిశంకర్, దండేల క్రిష్ణ, దారా అంజయ్య, నూకతోటి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పది పొట్టేళ్ల అపహరణ

పెద్దదోర్నాల, సెప్టెంబరు 22: పొట్టేళ్ల దొడ్డిలో నుంచి పది పొట్టేళ్లను అపహరించుకుపోయిన ఘటన దోర్నాలలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో శనివారం రాత్రి జరిగింది. బాధితుడు గుమ్మా ఎల్లయ్యకు చెందిన దొడ్డిలో ఉన్న పొట్టేళ్లను దుండగులు వాహనంలో అపహరించుకుపోయినట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రహదారులు గోతులమయం

మరమ్మతుల నిర్వహణలో మీనమేషాలు ● ప్రయాణికుల అవస్థలు ● పట్టించుకోని అధికారులు



రామతీర్థం సమీపాన గోతులమయమైన రాష్ట్ర రహదారి



అధ్వానంగా ఉన్న చీమకుర్తి-కంభంపాడు రోడ్డు

చీమకుర్తి, సెప్టెంబరు 22: చీమకుర్తి మండలంలో అనునిత్యం రద్దీగా ఉండే రహదారులు గోతులమయంగా మారాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకోక ఐదేళ్ల పాటు వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు పాలయ్యారు. అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గోతులమయమైన రహదారులకు మరమ్మతులు నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నా తీవ్ర జాప్యంతో గోతులతో కూడిన రహదారుల్లో ప్రయాణం నరకప్రాయంగా మారుతోంది. రాష్ట్రంలో అత్యంత రద్దీ ఉన్న రహదారుల్లో ఒకటిగా ఉన్న ఒంగోలు నుంచి కర్నూల్ రహదారి ఉంది. పశ్చిమ ప్రకాశంకు ముఖ ద్వారంగా ఉన్న చీమకుర్తి నుంచి మర్రిచెట్లపాలెం మధ్య ఉన్న కర్నూల్‌రోడ్డు గుంతలమయమై రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఈ ప్రాంతంలో ప్రపంచప్రఖ్యాతిగాంచిన గెలాక్సీ గ్రానైట్ పరిశ్రమ విస్తరించి ఉంది. దీంతో ఇక్కడ రహదారిపై భారీ వాహనాలు తిరుగాడటం, కొండ ప్రాంతం నుంచి ప్రవహించిన వర్షపు నీరు రహదారిపై నిలిచిపోతుండటంతో రోడ్డు ఛిద్రమైపోతోంది. ఏడాది క్రితం గ్రానైట్ ఫ్యాక్టరీ ఓనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. ఈ ప్రాంతంలో రహదారికి శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపడితేనే ఫలితం ఉంటుందని గుర్తించిన ఆర్అండ్‌బీ అధికారులు అంచనాలు తయారు చేశారు. ఇటీవల కలెక్టర్ తమీమ్ అన్సారియా గోతులమయమై అధ్వాన్నస్థితికి చేరుకున్న ఈ ప్రాంతంలోని రహదారిని పరిశీలించారు. సత్వరమే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అయినా సంబంధిత అధికారుల్లో ఇంత వరకు చలనం లేదు. మరమ్మతులు చేపట్టటంలో మీనమేషాలు లెక్కిస్తుండటంతో వాహనదారులకు సమస్యగా మారింది. వర్షం పడితే గోతుల్లో నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. తరచుగా ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు సైతం ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఉన్నాయి.

అదేవిధంగా మండలంలోని చీమకుర్తి నుంచి కంభంపాడు గ్రామానికి క్వారీల మధ్య నుంచి వెళ్లే రహదారి సైతం గోతులమయమై వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు. తక్షణమే గోతులమయమైన రహదారులకు శాశ్వత ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టూవీలర్ మెకానిక్‌ల సంక్షేమానికి కృషి

● ఎమ్మెల్యే దామచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు(కార్పొరేషన్), సెప్టెంబరు 22: టూవీలర్ మెకానిక్‌ల సంక్షేమానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. ఆదివారం ఒంగోలులోని ఓ హోటల్‌లో జరిగిన టూవీలర్ మెకానిక్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి దామచర్ల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆధునిక కంప్యూటర్ కాలంలోనూ చేతివృత్తినే ఆధారంగా జీవిస్తున్న లక్షలాది మంది మెకానిక్‌లకు అవసరమైన ప్రభుత్వ పథకాలు అందిస్తామని తెలిపారు. ఇటీవల విజయవాడలో వరదల కారణంగా వేలాది వాహనాలు నీట మునిగి చెడిపోతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పిలుపుతో అక్కడకు వెళ్లి తమంతుగా సేవలు అందించిన ప్రతి మెకానిక్‌కు కృతజ్ఞతలు తెలిపారన్నారు. అలాగే వారికి అవసరమైన కమ్యూనిటీ హాలు, ఇళ్ల స్థలాలు, పించను సదుపాయం, వైద్య సౌకర్యం అందించి అండగా ఉంటామని చెప్పారు. కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా అవసరమైన పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ కార్మికుల కోసం తాను అన్ని వేళలా అండగా ఉంటానని చెప్పారు. యూనియన్ అధ్యక్షులు దాయనేని ధర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, టీడీపీ నేత కామేపల్లి శ్రీనివాసరావు, ఐటీసీ కాంట్రాక్టర్ మండవ మురళీకృష్ణ, యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఆసిఫ్‌ఆలీ, యూనియన్ ప్రతినిధులు కోటిపల్లి మోహన్, చిన్ని, నబి, గండుబోయిన రామకృష్ణ, జానీ, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలను పరిష్కరించాలి ● వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి శేఖర్ డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: ఎన్నికల ముందు టీడీపీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో ఆదివారం వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు ఎస్‌డీ. మౌలాలి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్‌సిక్స్ పథకాలతో పాటు అనేక హామీలను కూటమి ప్రభుత్వం ఇచ్చిందన్నారు. వాటన్నింటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు అన్ని హక్కులు కల్పించాలన్నారు. ఇప్పటికే పేదల దగ్గర ఉన్న 15 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతమయ్యాయని, భూ సమస్యలు రోజురోజుకు అధికమవుతున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు అనేక ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని ప్రభుత్వం పరిశీలించి పేదలకు ఇళ్ల స్థలాలకు ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడుసెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల స్థలాలు ఇవ్వడంతో పాటు ఐదు లక్షల వ్యయంతో గృహ నిర్మాణం చేపట్టాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర స్థాయి సిబ్బందిపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు రాజకీయ వత్తిళ్లకు గురిచేసి వారి ఉద్యోగ భద్రతకు రక్షణ లేకుండా చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, ఉప ప్రధానకార్యదర్శి ఆర్.వెంకట్రావు, విజయ, రామారావు, ఆర్.లక్ష్మి, పి.ప్రభాకర్, జె.కోటేశ్వరరావు, గద్దల రవి, దాసరి శేఖర్‌బాబు, కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు. కాగా వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణ సదస్సు ను నవంబరులో కనిగిరిలో నిర్వహించాలని తీర్మానించారు.

సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యం

● ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు మంజుల



సభలో ప్రసంగిస్తున్న మంజుల

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే శరణ్యమని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల ఉద్ఘాటించారు. ఏపీటీఎఫ్‌కు జిల్లా, రాష్ట్ర స్థాయిలో విశేషసేవలు అందించి ఉద్యోగవిరమణ చేసిన నాయకుల అభినందన సభ ఆదివారం ఒంగోలులోని రంగాభవన్‌లో జిల్లా అధ్యక్షుడు వాకా జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మంజుల మాట్లాడుతూ ఏపీటీఎఫ్ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో పనిచేసిన కార్యకర్తలు, నాయకులను అభినందించడం మన బాధ్యతన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన టి.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.గురునాథశర్మ, బి.రఘుబాబు, ఎస్‌వీ.సత్యనారాయణ, యోహాన్‌రెడ్డి, టి.అంజిరెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ ప్రధానసంపాదకుడు ఎస్‌కే.జిలాని, జిల్లా ప్రధానకార్యదర్శి డి.శ్రీనివాసులు, ఐ.విజయసారథి, ఎంవీ.కృష్ణయ్య, టి.సుబ్బారావు, బి.శేషారావు, తిరుమల, హనుమంతరావు, నాయబ్ రసూల్, పి.శేఖర్‌రెడ్డి, మల్లికార్జునరావు, ప్రసాద్, ఖాదర్‌బాషా, నారాయణరెడ్డి, జేవీఆర్, శ్రీనివాసరావు, పి.రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని నిమజ్జనోత్సవాలు



విగ్రహ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్లో) ట్రాక్టర్‌పై గణేషుడి ప్రతిమ



రాఘవేంద్రకాలనీలో వినాయకుడి ఊరేగింపులో అశేష భక్తజనం

సంతనూతలపాడు, సెప్టెంబరు 22: సంతనూతలపాడులో ఆవులవారి బజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహాన్ని 15 రోజుల పూజల అనంతరం శనివారం రాత్రి లడ్డూపాట నిర్వహించి ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పూజా కార్యక్రమాలు నిర్వహించగా భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. అనంతరం స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. పాటకచేరీని నిర్వహించారు. భక్తుల సందడి మధ్య గణేషుడి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు.

ఉప్పుగుండూరులో..

నాగులుప్పలపాడు: వినాయక చవితి సందర్భంగా ఉప్పుగుండూరు గ్రామంలోని రాఘవేంద్రకాలనీలో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయకస్వామిని ఆదివారం నిమజ్జనానికి తరలించారు. గత 15 రోజులుగా రాఘవేంద్రకాలనీ వాసులు గణనాథునికి విశిష్టపూజలు నిర్వహించి గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అత్యంత కోలాహలంగా డీజే సందడితో యువకులు, కాలనీవాసులు పెద్దఎత్తున పాల్గొని పెదగంజాం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు. అన్నప్రసాద వితరణ జరిగింది.

అలరించిన సంగీత విభావరి

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 22: శ్రీవాసవి మెలోడీస్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఒంగోలులోని సీవీఎన్ రీడింగ్ రూములో ఏర్పాటుచేసిన సినీ సంగీత విభావరి ప్రేక్షకులను విశేషంగా అలరించింది. ఈ సందర్భంగా ముందుగా ఘంటసాల వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి గాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొనసాగిన సంగీత విభావరిలో గాయకులు ఆలపాటి అశోక్, రంగనాథం, సీహెచ్.రామకోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, బాలాజీ, శివప్రసాద్, స్వర్ణలత, లక్ష్మీతులసి, శైలజా రాజేష్ పలు గీతాలను శ్రావ్యంగా ఆలపించారు. కీబోర్డుపై రవి, ప్యాడ్స్ సురేష్, జాజ్ మోహన్ వాద్య సహకారాన్ని అందజేయగా గాయకులు అప్పిశెట్టి రత్తయ్య, గుర్రం కృష్ణలు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు.



నివాళులర్పిస్తున్న గాయకులు

అవీ..ఇవీ..

పోలీసుల అదుపులో ఇరువురు నిందితులు

ఒంగోలు(క్రైం), సెప్టెంబరు 22: గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒంగోలులోని ఆర్యవైశ్య నాయకుడు సుబ్బారావు గుప్తాపై దాడి చేసిన కేసులో వైసీపీ నాయకులు సుభానీ, సైదాలను వన్‌టౌన్ పోలీసులు ఆదివారం అదుపులోకి తీసుకున్నారు. గతంలో సుబ్బారావు గుప్తాపై గుంటూరులోని ఓ లాడ్జిలో దాడి చేసిన వీడియో వైరల్ అయింది. అప్పట్లో కేసు నమోదు చేసిన పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో పెండింగ్ లో ఉన్న కేసులను సమీక్ష చేసిన పోలీసులు ఇరువురు నిందితులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కాగా సుభానీపై అనేక కేసులు పెండింగ్‌లో ఉన్నాయి.

28 వరకు ఓపెన్ స్కూలు అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22: ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 28వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చని డీఈవో డి.సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 30 వరకు అడ్మిషన్లు పొందవచ్చని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు. ఓపెన్ స్కూలు సొసైటీ స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్లు ఈ విషయాన్ని గమనించి ఈ ఏడాది అడ్మిషన సంఖ్య పెంచాలని ఆయన కోరారు.

ఊరచెరువును ఆధునికీకరించాలి



ఊరచెరువును సందర్శించిన సీపీఎం ప్రతినిధులు

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: ఒంగోలు నగరంలోని ఊరచెరువును ఆధునికీకరణ చేయాలని సీపీఎం నాయకులు కోరారు. పార్టీ బండ్లమిట్ట శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సీపీఎం ప్రతినిధులు జి.రమేష్, నరసింహారావు, మారెళ్ళ సుబ్బారావు, కె.విశ్వసేన్, టి.భక్తసింగ్‌రాజు సందర్శించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరచెరువులో చెత్తను డంప్ చేస్తున్నారని, దానివల్ల చుట్టుపక్కల ఉన్న ప్రజలకు దుర్గంధం వ్యాపించి దోమలు పెరుగుతున్నాయని చెప్పారు. మార్కెట్‌కు వచ్చే ప్రజలు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీని నివారణ కోసం ఊరచెరువును అభివృద్ధి చేయాలని, మంచినీటి చెరువుగా మార్చాలని కోరారు. చెరువు చుట్టూ ఏడు ఎకరాల్లో వాకింగ్‌ట్రాక్, పిల్లల పార్కు ఏర్పాటు చేయాలని చెప్పారు. అక్రమాలను తొలగించేందుకు హైదరాబాద్‌లోని హైడ్రా తరహాలో వ్యవస్థను ఏర్పాటు చేసి చెరువులు, కుంటల భూములను కాపాడాలని వారు కోరారు.

కళాశాలల స్థాయి క్రీడాకారుల ఎంపిక షెడ్యూల్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22 : ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల ఆటల పోటీలకు 19 సంవత్సరాల లోపు బాల, బాలికల ఎంపిక షెడ్యూల్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 సెక్రటరీ ఈదర చింపారెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈనెల 24,25 తేదీల్లో సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం పది గంటలకు యోగా, ఫెన్సింగ్, చెస్, బాక్సింగ్, జూడో, కరాటే, జిమ్నాస్టిక్స్, బీచ్‌వాలీబాల్ ఎంపికలు శంకరరావు ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. అలాగే 26న కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అథ్లెటిక్స్, 27న హాకీ, హ్యాండ్‌బాల్, 28న క్రికెట్ క్రీడాకారుల ఎంపికల టి.సుబ్బారావు పర్యవేక్షణలో జరుగుతాయి. ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కళాశాలలో ఈనెల 27న మోడ్రన్ పెంటాదిలక్స్, రబ్బీ, 28న సాఫ్టబాల్, షూటింగ్, 29న బేస్‌బాల్, రీజనింగ్ పోటీలు చంద్రశేఖర్, బి.సుబ్బారావుల ఆధ్వర్యంలో జరుగుతాయి. 30న ప్రభుత్వ జూనియర్ కళాశాల సింగరాయకొండలో కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, తైక్వాండో పోటీలు జరుగుతాయి. ఖోఖో పోటీలు బాలురకు ఎంఎస్ఆర్ కళాశాలల పంగులూరులో సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో, బాలికలకు కనిగిరి ఎంఎస్ఆర్ కళాశాలలో కాశీ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. మిగిలిన ఆటల పోటీలు ఈనెల 31న ఒంగోలులోని ఏబీఎం కళాశాలలో జరుగుతాయని, వివరాలకు 9440621579, 9848125706 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

స్వచ్ఛతా హి సేవలో క్విస్ విద్యార్థులు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22: ఒంగోలులోని క్విస్ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రధానమంత్రి మోదీ విజన్ ప్రకారం కొత్తపట్నం బీచ్‌లో ఆదివారం స్వచ్ఛతాహి సేవలో పాల్గొన్నారు. సుమారు 30 మంది విద్యార్థులు బీచ్‌ను శుభ్రం చేయడంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ డాక్టర్ నిడమానూరి సూర్యకళ్యాణ్‌చక్రవర్తి, ప్రిన్సిపాల్ వైవీ.హనుమంతరావు అభినందించారు.

పేస్ ఆధ్వర్యంలో..

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా అంతర్జాతీయ కోస్టల్ క్లీనింగ్ డేను పురస్కరించుకొని ఒంగోలులోని పేస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కొత్తపట్నం బీచ్‌ను శుభ్రంచేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీచ్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘం అధ్యక్షుడు తిరుమలరావు, సర్పంచ్ ఆనందరావు పాల్గొన్నారు. కాగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపాల్ జీవీకే.మూర్తి అభినందించారు.

టెక్నాలజీ అందిపుచ్చుకుంటేనే అభివృద్ధి : వీసీ

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22: టెక్నాలజీని అందిపుచ్చుకుంటేనే అభివృద్ధి చెందుతారని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్స్‌లర్ డీవీఆర్.మూర్తి పేర్కొన్నారు. అసోసియేషన్ ఆఫ్ అండ్ టీచర్స్ సంస్థకు 10 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఆదివారం ఒంగోలులోని యూనివర్శిటీలో నూతన విద్యా విధానం- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అనే అంశంపై జిల్లా స్థాయి సదస్సు అసోసియేషన్ గౌరవసలహాదారు డాక్టర్ నూకతోటి రవికుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మూర్తి మాట్లాడుతూ నూతన విద్యావిధానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు తమ సబ్జెక్టుల్లో పట్టు, సాంకేతికతను పెంచుకున్నప్పుడే ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోగలరని చెప్పారు. కార్యక్రమంలో శ్రీహర్షిణి విద్యాసంస్థల చైర్మన్ గోరంట్ల రవికుమార్, డాక్టర్ గీతారావు, చెంచురామయ్య, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు టి.గోపాల్‌రెడ్డి, టీఎస్ఎస్.సింగ్ పలు కళాశాలల సెక్రటరీలు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. అనంతరం 37 మందితో నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

క్వారీల్లో ప్రమాదాలను నివారించాలి



మాట్లాడుతున్న సుబ్బారావు

చీమకుర్తి, సెప్టెంబరు 22: క్వారీల్లో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుని కార్మికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు కోరారు. చీమకుర్తిలో గ్రానైట్ కార్మికుల మహాసభ ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ క్వారీ ఓనర్లు కార్మికుల వేతనాలు పెంచి అగ్రిమెంట్లు కుదుర్చుకోవాలని డిమాండ్ చేశారు. కాగా రామ్‌నగర్ శాఖ కార్యదర్శిగా సీహెచ్.కొండయ్య, గ్రానైట్ వర్కర్స్ కార్యదర్శిగా ఓబులేసు ఎన్నికయ్యారు. ముందుగా జెండా ఎగురవేసి సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పూసపాటి వెంకట్రావు, పల్లాపల్లి ఆంజనేయులు, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మరావుకు పురస్కారం ప్రదానం



పురస్కారం అందుకుంటున్న అంకమ్మరావు

ఒంగోలు(కల్చరల్), సెప్టెంబరు 22: ఒంగోలుకు చెందిన సాహితీవేత్త, కళామిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావును చీరాల సహజ సాహితీ సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థ ఆదివారం పడవల లక్ష్మణ స్వామి స్ఫూర్తి పురస్కారంతో ఘనంగా సన్మానించింది. కోడూరి ఏకాంబరేశ్వర బాబు అధ్యక్షతన జరిగిన సభకు బండారుపల్లి హేమంత్‌కుమార్ ముఖ్య అతిథిగా, పోలుదాసు రామకృష్ణ, అంగలకుదిటి నాగవీరభద్రాచారి, చందలూరి బాలవెంకటేశ్వరరావు తదితరులు అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రకాశం జిల్లా సాహిత్యరంగంలో అంకమ్మరావు చేస్తున్న సేవలు అనిర్వచనీయమని అన్నారు. చీరాల లయన్ కాకరపర్తి వెంకటేశ్వర్లు సభా ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలోని పలువురు ప్రముఖ సాహితీవేత్తలు పాల్గొన్నారు.

అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు : ఎస్ఐ

మద్దిపాడు, సెప్టెంబరు 22: గ్రామాల్లో అల్లర్లు సృష్టిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ శివరామయ్య హెచ్చరించారు. ఆదివారం మద్దిపాడు పోలీస్‌స్టేషన్లో రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రౌడీషీట్ నమోదైన ప్రతి ఒక్కరూ ప్రవర్తనను మార్చుకొని ప్రజలతో మమేకం కావాలన్నారు. మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని, మంచి ప్రవర్తన కలిగి ఉంటే రౌడీషీట్ తొలగించేందుకు తన వంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పారు.

ఆదర్శనేత ఆంజనేయులు

- మాజీ మంత్రి దామచర్ల వర్ధంతిలో మంత్రులు గొట్టిపాటి, డోలా
- తూర్పునాయుడుపాలెంలో వైద్య శిబిరం, జాబ్‌మేళా నిర్వహణ



మర్రపాడులో ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాల ఆవిష్కరణలో నేతలు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 22 : దివంగత మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు 17వ వర్ధంతి కార్యక్రమాలు కొండపి, ఒంగోలు నియోజకవర్గాల్లో టీడీపీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగాయి. అంజనేయులు చేసిన సేవలను ఆ పార్టీ నాయకులు కొనియాడారు. ఆయన ఆదర్శాలను వివరించారు. ఆయన విగ్రహాలకు నివాళి అర్పించారు. పలుచోట్ల సేవాకార్యక్రమాలు చేపట్టారు. తూర్పునాయుడుపాలెంలో జాబ్‌మేళా, వైద్యశిబిరం నిర్వహించారు.

మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు అందరికీ ఆదర్శప్రాయుడు అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఒంగోలులో టీడీపీ కార్యాలయంలో జరిగిన వర్ధంతి కార్యక్రమానికి గొట్టిపాటి రవికుమార్ హాజరై మాట్లాడారు. విద్యాదాతగా, రాజకీయవేత్తగా, వ్యాపారవేత్తగా పెద్దాయన ఆంజనేయులు ప్రజల మనిషిగా గుర్తింపు పొందారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ తన రాజకీయాలకు స్ఫూర్తి తాత ఆంజనేయులు అని వివరించారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా మచ్చలేని రాజకీయనేతగా ముందుకు సాగుతానని చెప్పారు. స్థానిక ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద, బాపూజీ కాంప్లెక్స్ వద్ద గల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, మేయర్ గంగాడ సుజాత తదితరులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో పాల్గొన్న యువత



ఒంగోలులోని టీడీపీ కార్యాలయంలో ఆంజనేయులు విగ్రహానికి నివాళి

తూర్పు నాయుడుపాలెంలో జాబ్‌మేళా

కొండపి/టంగుటూరు : ఆంజనేయులు వర్ధంతి సందర్భంగా టంగుటూరు మండలంలోని తూర్పు నాయుడు పాలెంలో జాబ్‌మేళా నిర్వహించారు. 1800 మంది హాజరుకాగా 705 మందికి వివిధ కంపెనీలు ఉద్యోగ నియామకాలు అందించారు. జాబ్‌మేళాను టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రారంభించారు. మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

వైద్య, రక్తదాన శిబిరాలు

టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఒంగోలు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు చేశారు. రోగులకు అవసరమైన బీపీ, షుగర్, ఈసీజీ, వైద్య పరీక్షలు చేసి ఉచితంగా చేసి మందులు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో 41 మంది రక్తదానం చేశారు.

ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు నివాళి

మర్రిపూడి : స్థానిక బస్టాండ్ కూడలిలోని ఎన్టీఆర్, దామచర్ల విగ్రహాలకు టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీడీపీ నాయకులు యర్రమోతు శ్రీనివాసులు, రేగుల వీరనారాయణ, చేరెడ్డి నర్సారెడ్డి, తుళ్లూరి నరసింహారావ్, గొంటు హనుమారెడ్డి, కొణిదెన మోహన్‌రావ్, బాలనరసయ్య వై.వెంకటరెడ్డి, పుల్లారెడ్డి, గురిజాల రాజేష్, హనోక్, గురుబ్రహ్మం, గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గుండ్లసముద్రం ఏడుకొండలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మర్రిపూడిలో దామచర్ల విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు



చీపురు పట్టలేం.. చెత్త ఎత్తలేం..

- వైట్‌కాలర్ ఉద్యోగులుగా కొందరు పారిశుధ్య కార్మికులు
- మున్సిపల్ కమిషనర్ ఆదేశాలు బేఖాతరు

ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 22 : ఒంగోలు నగరంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు కమిషనరు డాక్టర్ వెంకటేశ్వరరావు తీసుకున్న నిర్ణయానికి భిన్నంగా పలువురు పారిశుధ్యం కార్మికులు చీపురు పట్టలేమంటూ, చెత్త ఎత్తలేమంటూ విధులకు డుమ్మా కొట్టారు. వైసీపీ హయంలో శానిటరీ కార్మికులుగా ఉద్యోగాల్లో చేరిన పలువురు.. చీపురు పట్టకుండా మేస్త్రీగా పెత్తనం చేస్తూ వైట్ కాలర్ ఉద్యోగులుగా చెలామణి అయ్యారు. ఆప్కాస్, కొవిడ్ విభాగాల కింద సుమారు 650 మందికిపైగా ఉద్యోగాల్లో చేరగా 300 మందికి వరకూ చీపురు పట్టకుండా మేస్త్రీలుగా జీతాలు తీసుకుంటున్నారు. దీనిపై ప్రత్యేక దృష్టి సారించిన కమిషనరు మేస్త్రీ వ్యవస్థను రద్దు చేశారు. ఇకపై ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిందేనని హెచ్చరించారు. నగరంలో పారిశుధ్యం మెరుగు కోసం ప్రతి ఒక్కరు కార్మికుడుగా కొనసాగాలని హెచ్చరించారు. ఇన్నాళ్లు పనిచేయకుండా పెత్తనానికే పరిమితమైన పలువురు విధులకు డుమ్మా కొట్టారు. తమకు తోచిన విధంగా సిఫారసుల దారిపట్టారు. ఎక్కువ మంది ఒక డిప్యూటీ మేయర్ అండతో పని చేయకుండా పెత్తనం చేస్తున్నారు. వారిలో 20 మంది ఆయనకు వ్యక్తిగత సహాయకులుగా కొనసాగుతున్నారు.

అందరూ పనిచేయాలన్నా లెక్కలేదు

ఆదివారం నుంచి అందరూ పనిచేయాలన్న కమిషనరు ఆదేశాలను లెక్క చేయకుండా పనులకు పోకుండా ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. కొందరు.. కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. మరికొందరు తమను పనిలో చేర్పిన డిప్యూటీ మేయర్ వద్దకు చేరి, పనిచేయలేమని చెప్పారు. దీంతో ఇప్పటివరకు కార్మికులుగా కొన్నేళ్లుగా పనిచేస్తున్న కార్మికులే పారిశుధ్య పనులు చేపట్టారు. మరో వందమందికిపైగా పురుషులు, మహిళలు, కార్పొరేషన్ కార్యాలయంలో అనధికర అటెండర్లుగా కొనసాగుతుండగా, వారిని కూడా పారిశుధ్య పనులకు పంపుతారనే ముందస్తు ఆలోచనతో తమదైని శైలిలో సిఫారసుల కోసం పరుగులు పెడుతున్నారు. దీనిపై కమిషనరు స్పష్టమైన నిర్ణయంతో ఉన్నారు. నగర సుందరీకరణకు అందరూ పనికి వెళ్లాల్సిందేనని తేల్చి చెప్పారు. పేరుకు కార్మికులుగా విధుల్లో చేరి, పనిచేయమంటే కుదరదని, అలా చేయలేనివారు ఇంటికెళ్ళొచ్చని తేల్చి చెప్పారు. సిఫారసులకు తావులేదని, కచ్చితంగా ప్రతి కార్మికుడు పనిచేయాల్సిందేనని కమిషనరు స్పష్టం చేశారు.

రెండు దశాబ్దాల తర్వాత.. కుటుంబం చెంతకు

చొరవచూపిన పోలీసులు



శ్రీహరిని శేషమ్మకు అప్పగిస్తున్న పోలీసు

మార్కాపురం, సెప్టెంబరు 22: అతను రెండు దశాబ్దాల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వీధుల్లో తిరుగుతూ జీవనం సాగించాడు. గమ్యంలేని జీవితాన్ని గడిపాడు.. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న అతడిని పోలీసులు విచారించారు. వివరాలు తెలపడంతో చొరవ తీసుకుని అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామానికి చెందిన సుందరశెట్టి కోటేశ్వరరావు, శేషమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చివరివాడు శ్రీహరి. వ్యవసాయాధారిత కుటుంబం వారిది. అందరూ కలిసి పనిచేస్తేనే ఇల్లు గడిచేది. 20 ఏళ్ల క్రితం శ్రీహరి తన 15 ఏళ్ల వయసులో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కూలి పనులు చేసుకుంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తిరిగాడు. ఎక్కడ పని దొరికితే అక్కడికెళ్లి కడుపు నింపుకునేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం శ్రీహరి అతని సహచరుడు కేశవతో కలిసి పూటుగా మద్యం సేవించి తిరుపతి నుంచి గుంటూరు వెళ్లే రైలు ఎక్కాడు. శనివారం తెల్లవారుజామున మార్కాపురం రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడ నుంచి ఎస్టేట్‌కు వచ్చి మద్యం దుకాణం వద్ద ఇద్దరూ మద్యం సేవించి అనుమానస్పదంగా తిరుగుతున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగతనాలకు పాల్పడుతున్న వాళ్లేమోనని అనుమానించి పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. భయపడిన శ్రీహరి అతని చిరునామా చెప్పాడు. పట్టణ ఎస్సై సైదుబాబు సింగరాయకొండ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడి పోలీసులు సోమరాజుపల్లి వెళ్లి విషయాన్ని తెలిపారు. తల్లి శేషమ్మ సంతోషించి మార్కాపురం వచ్చింది. అతను తన కుమారుడే అని 20 ఏళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని తెలియజేసింది. ఆమె పూచికత్తు మేరకు శ్రీహరిని పోలీసులు ఆమెతో పంపించారు. తన కుమారుడిని అప్పజెప్పిన పోలీసులకు శ్రీహరి తల్లి, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

తాగునీటి కోసం ధర్నా

పెద్దదోర్నాల, సెప్టెంబరు 22: తమ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని ఐనముక్కల గ్రామం ఎస్సీ కాలనీవాసులు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం ఖాళీబిందెలతో ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డుపై ఖాళీబిందెలతో నినాదాలు చేశారు. కాలనీలోని బోరులోని మోటారు మరమ్మతులకు గురైందని, ట్యాంకర్లతో సరిపడా నీటిని ఇవ్వడం లేదని వాపోయారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పంచాయతీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వెంటనే ట్యాంకరులను ఏర్పాటు చేస్తామని విద్యుత్తు సరఫరా మధ్యాహ్నం 12 గంటలకు ఉండడం వల్ల ఆలస్యమయిందని చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

శిథిలావస్థలో శింగరకొండపాలెం ఎత్తిపోతల

గత టీడీపీ ప్రభుత్వంలో రూ.70 లక్షలతో మరమ్మతులు

- వైసీపీ హయాంలో మూలనపడ్డ పథకం
- 3వేల ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం

భవనాసి చెరువులో పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నా... టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.70 లక్షలతో మరమ్మతులు చేసినా... వైసీపీ హయాంలో ప్రభుత్వం నిర్వహణను గాలికి వదిలేసింది. దీంతో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. 3 వేల ఎకరాల్లో ఆయకట్టుకు సాగునీరు ప్రశ్నార్థకమైంది.



మూలనపడ్డ శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం

అద్దంకి, సెప్టెంబరు 22 : సుమారు 4 దశాబ్దాల కిందట టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున ఎత్తిపోతల పథకాల నిర్మాణం జరిగిన సమయంలో అద్దంకి మండలంలోని శింగర కొండపాలెం సమీపంలో భవనాసి చెరువు నీరు ఆధారంగా శింగరకొండ పాలెం ఎత్తిపోతల నిర్మాణం జరిగింది. అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం, కలవకూరు, బొమ్మనంపాడు, గోపాలపురం, అద్దంకి రైతులకు చెందిన సుమారు 3,229 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా జరిగే విధంగా ఎత్తిపోతల పథకం నిర్మించారు. అద్దంకి మేజర్ కాలువ చివర భూములకు నీటి తడుల కోసం ఎత్తిపోతలను రూపొందించారు. దీని నుంచి అద్దంకి మేజర్ కాలువ వరకు భూమిలో పైప్‌లైన్‌లు వేశారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.70 లక్షలు వెచ్చించి మోటార్‌ల మరమ్మతులు, ఎక్కువ కెపాసిటీతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు నీటి సరఫరా జరిగింది. పలు సందర్భాల్లో ఎత్తిపోతల మోటార్‌లు మరమ్మతులకు గురికావడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికావడంతో కొంత కాలం మూలన పడింది.

మంత్రి గొట్టిపాటి దృష్టిసారించాలని..

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించడంతో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులలో ఆశలు చిగురించాయి. భవనాసి చెరువు రిజర్వాయర్‌గా మారే క్రమంలో ఎత్తిపోతల పథకం మోటార్‌లు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో పునఃనిర్మాణ చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రవికుమార్ మంత్రిగా ఉండడంతో ప్రత్యేక దృష్టి సారించి శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



దట్టంగా ఉన్న చెట్లు

చిట్టడవిని తలపించేలా..

అనంతరం జగన్‌రెడ్డి పాలనలో దీని నిర్వహణపై పూర్తి నిర్లక్ష్యం వహించడంతో మూలన పడింది. దీంతో గత నాలుగైదు సంవత్సరాలుగా నీటి విడుదల జరగకుండా నిరుపయోగంగా మారింది. ఎత్తిపోతల పథకం ప్రాంతం మొత్తం చిట్టడవిని తలపించేలా మారింది. పైప్‌లైన్‌లు కూడా దెబ్బతిని ఉండడంతో నీటి సరఫరా కూడా అంతంతమాత్రంగా మారింది.

ఎంపీడీవోల బదిలీలు

- 16 మంది ఇక్కడకు రాక
- ఇతర జిల్లాలకు 16 మంది

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 22 : ఉద్యోగోన్నతులపై పనిచేస్తున్న ఎంపీడీవోల బదిలీలు షురూ అయ్యాయి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లాకు చెందిన 16 మంది ఎంపీడీవోలను ఇక్కడికి, ఇక్కడ పనిచేస్తున్న ఇతర జిల్లాలకు చెందిన 16 మందిని వారి పాత జిల్లాలకు బదిలీలు చేస్తూ పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎనిమిది నెలల క్రితం అప్పటి ప్రభుత్వం ఉద్యోగోన్నతులపై ఎంపీడీవోలుగా పలువురిని ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను అంతర్ జిల్లాలకు స్థానచలనం కల్పించేందుకు అవకాశం కల్పించింది. జిల్లా నుంచి 16 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. వారిలో గుంటూరు జిల్లాకు 11 మందిని, నెల్లూరు జిల్లాకు నలుగురిని, కృష్ణా జిల్లాకు ఒకరిని బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు 16 మంది బదిలీపై వస్తున్నారు. వారిలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఆరుగురు చొప్పున, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విజయనగరం, చిత్తూరు జిల్లాల నుంచి ఒక్కొక్కరు జిల్లాకు రానున్నారు.

జిల్లాకు వచ్చే ఎంపీడీవోలు వీరే

చక్రపాణి ప్రసాద్, రంగనాయకులు, టీవీరభద్రాచారి, వై.మహాలక్ష్మి, ఎం.శ్రీదేవి, పి.శివ సుబ్రహ్మణ్యం, డి.ఈశ్వరమ్మ, వి.జ్యోతి, జి.శ్రీనివాసరావు, ఎం.రాజేష్‌బాబు, బి.సింగయ్య, ఎం.రంగ సుబ్బారాయుడు, బి.శ్రీనివాసులు, జి.జ్యోతిర్మయి, ఎస్‌కే మహ్మద్ అక్బర్‌జావీద్, ఎల్.కృష్ణమూర్తి జిల్లాకు రానున్నారు. ఇక్కడి జిల్లా పరిషత్‌లో జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత వారికి మండలాల్లో పోస్టింగ్‌లు ఇస్తారు.

శ్రీవేణికి శాలివాహన విశిష్ట పురస్కారం



పురస్కారం అందుకుంటున్న శ్రీవేణి

కొండపి : మండలంలోని దేవిరెడ్డి పాలెం ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ఉప్పుటూరి శ్రీవేణికి హైదరాబాద్‌కు చెందిన శాలివాహన చారిటబుల్ ట్రస్టు వారు విశిష్ట ప్రతిభ పురస్కారాన్ని ఆదివారం అందజేశారు. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో విద్యారంగంలో శ్రీవేణి చేసిన కృషిని కొనియాడుతూ ట్రస్టు సభ్యులు పురస్కారాన్ని అందించారు.

జూడో పోటీలకు కామేపల్లి విద్యార్థులు



జూడోకు ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

జరుగుమల్లి (కొండపి) : రాష్ట్రస్థాయి జూడో పోటీలకు కామేపల్లి జడ్పీ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. అండర్-14, 17 విభాగాల్లో జిల్లా స్థాయిలో జూడో పోటీలు ఇటీవల పాకలలో జరిగాయి. కామేపల్లి జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.అభిషేక్, ఎం.కార్తీక్, కె.బాలచరణ్, ఎం.పాల్‌రాజ్ ఉత్తమ ప్రతిభ కనపరిచి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచారు. వారిని స్కూల్ హెచ్‌ఎం ఎల్.అనురాధ, స్కూల్ పీడీ నర్రా కోటేశ్వరరావు, స్కూల్ కమిటీ చైర్మన్ పూర్ణచంద్రరావు అభినందించారు.

కొండపి ప్రాంతంలో మోస్తరు వర్షం

కొండపి : కొండపి ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. కొండపి, జరుగుమల్లి, టంగుటూరు మండలాల్లోని పలు గ్రామాల్లో వర్షం పడింది. కురిసిన వర్షం పొగాకు నారు మడులకు ఊపిరి పోసిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు.



హమ్మయ్యా..!

- నగరంలో సాయంత్రం జోరువాన
- ఉక్కపోతల నుంచి ఉపశమనం



ఒంగోలు (కార్పొరేషన్), సెప్టెంబరు 22 : వేసవి కాలం ముగిసినా గత పదిహేను రోజులుగా సెకండ్ సమ్మర్‌ని తలపిస్తున్న మండుటెండలు.. ఉక్కపోతలతో అల్లాడిన నగర ప్రజలకు ఉపశమనం లభించింది. ఆదివారం సాయంత్రం ఒంగోలులో గంటసేపు కురిసిన వర్షానికి ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం పూట భానుడు భగ భగలాడగా, సాయంత్రానికి మబ్బులు కమ్మి, గంటసేపు వాన కురవడంతో నగరం చల్లబడింది. అయితే డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో కురిసిన వానకు మురుగు నీరుతోడై రోడ్లపై ప్రవహించాయి. చాలా రోజులత తర్వాత కురిసిన గాలివానకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది.

చిత్తడిగా రహదారులు

గంటసేపు ఎడతెరిపి లేకుండా ముసురుతో కూడిన వర్షంతో నగరంలోని లోతట్టు ప్రాంతాలు అస్తవ్యస్తంగా మారాయి. వెంకటేశ్వర కాలనీ, బలరాం కాలనీ, బిలాల్ నగర్, కరుణా మిలటరీ కాలనీ, బాలినేని భరత్ కాలనీ, ఇందిరాకాలనీ, గుర్రజంజాషవా కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, ప్రగతి కాలనీ, చినమల్లేశ్వర కాలనీలతోపాటు నగరంలోని కర్నూలు రోడ్డు, నెల్లూరు బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్ ఆవరణం, స్టేషన్ రోడ్, పలు ప్రాంతాల్లో రహదారులపై వర్షపు నీరు ఏరులై పారగా, మురుగునీటి పారుదల వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో వాన నీటికి తోడు, మురుగునీరు రోడ్లపై ఏరులై పారింది. ధారావారితోట, జర్నలిస్ట్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, రాజీవ్ గృహకల్ప, భాగ్యనగర్, హౌసింగ్ బోర్డు కాలనీల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో రైతులకు మేలు

- బేస్తవారపేటలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహణ
- పొదిలిలో కరపత్రాలు విడుదల చేసిన కమిషనర్

బేస్తవారపేట, సెప్టెంబరు 22 : గత వైసీపీ భూకబ్జా పాలకులు అమలు చేసిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి రైతులకు మంచి చేసిన ప్రభుత్వం ఎన్డీయే అని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా మూడవ రోజు బేస్తవారపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావేదికలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడారు. ఎన్నికల ముందు నారా చంద్రబాబు నాయుడు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారమే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్లు తెలిపారు. ఇదే విధంగా పేదవాడి కడుపు నింపే అన్న క్యాంటీన్లను ప్రారంభించడం హర్షనీయమన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పంచాయతీల అభివృద్ధికి నిధులు మంజూరు చేసి అందులో భాగంగా బేస్తవాటపేట మండలానికి రూ.2.50 కోట్లు బేస్తవారపేట పంచాయతీకి రూ.93 లక్షలు నిధులు మంజూరు చేసిన ఘతన పవన్‌కల్యాణ్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పార్వతి, తహసీల్దార్ జితేంద్ర, బుద్దుల ప్రేమానంద్, దూదెకుల సైదులు, పూనూరు భూపాల్‌రెడ్డి, సోరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అన్న క్యాంటీన్ నిర్వహణకు విరాళం

గిద్దలూరు టౌన్ : పట్టణంలోని పెద్ద కూరగాయల మార్కెట్ యూనియన్ తరఫున అన్న క్యాంటీన్‌కు రూ.15వేల విరాళాన్ని ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో షేక్ ఖాజాహుస్సేన్, యాసం రాముడు, షేక్ రసూల్, అనప శ్రీను, సుభాని, లక్ష్మి, సావిత్రమ్మ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనే కూటమి ప్రభుత్వం

పొదిలి : వందరోజుల కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో విశ్వాసం పెరిగిందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక రెండవ సచివాలయంలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వందరోజుల్లో కూటమి ప్రభుత్వం చేసిన మంచిపనులు, సంక్షేమ పథకాల గురించి సచివాయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి విచారించాలన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో ప్రజాపాలన వందరోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకొందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనకు పెద్దఎత్తున ప్రజలు జేజేలు పలుకుతున్నారన్నారు. చంద్రబాబునాయుడు అంటే ఒక బ్రాండని అందుకు నిదర్శనమే ఇటీవల విజయవాడ బుడమేరు ముంపు గ్రామాల్లో రేయింబవళ్ళు పర్యటించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్న ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మీగడ ఓబులరెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజలు విసిగిపోయారని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఊపిరిపీల్చుకున్నారన్నారు. వందరోజుల్లో గతంలో ఏ ప్రభుత్వం చేయని పనులు చేశారని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు పాలనలో ప్రజలకు ఒక భరోసా ఉంటుందన్నారు. పట్టణాధ్యక్షుడు ఖుద్దూస్ మాట్లాడుతూ కూటమిని ప్రజలు ఆశీర్వదించారని అందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి వందరోజుల్లో గతంలో ఎన్నడు లేని విధంగా ప్రజలకు పాలన అందించారన్నారు. 'ఇది మంచి ప్రభుత్వం' బ్రోచర్లను పంపిణీ చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. రాష్ట్రాభివృద్దే ముఖ్యమంత్రి ఆశయమని ఆయన అన్నారు. ముస్లిం మైనారిటీ నాయకులు రసూల్ మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలంటే చంద్రబాబునాయుడు సారథ్యంలో పాలన ఉండాలని అందుకు మనందరం సహకరించాలన్నారు. వందరోజుల పాలనలో ప్రజలు టీడీపీ పాలనపై ఆశలు పెంచుకున్న నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశ్యంలో మెగా డీఎస్సీని ప్రకటించాడన్నారు. దీపావళి నుంచి మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందించామన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావ్, వీఆర్‌వో యాకోబు తదితర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



పొదిలిలో కరపత్రాలు విడుదల చేస్తున్న కమిషనర్

నూతన కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 22: అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మార్కాపురం నియోజకవర్గ నూతన కార్యవర్గాన్ని స్థానిక సంఘ కార్యాలయంలో ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షులుగా ఇట్టా రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా బుక్కె శ్రీనివాసనాయక్, కోశాధికారిగా ఎం.శ్రీనివాస నాయక్, ఉపాధ్యక్షులు ఎం.మహేష్‌నాయక్, ఎస్.ప్రసాద్, సహాయ కార్యదర్శిగా, ఎం.వీరాంజినాయక్, కె.రాజానాయక్, ప్రాంతీయ సమన్వయకర్తగా జె.నాగయ్యలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైౖ సంఘం ప్రధాన కార్యదర్శి బుక్కె శ్రీనివాసనాయక్ మాట్లాడారు. గిరిజన ఉద్యోగుల శ్రేయస్సు, సంక్షేమం కోసం, అలాగే వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 29న ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో జరిగే సంఘం సర్వసభ్య సమావేశానికి జిల్లాలోని గిరిజన ఉపాధ్యాయ, ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు. నూతన కార్యవర్గం ఎంపికలో రాష్ట్ర నాయకులు డాక్టర్ బాలాజీనాయక్, డాక్టర్ బి.లక్ష్మనాయక్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ జి.ధర్మానాయక్‌లు పాల్గొన్నారు. నూతన కమిటీకి పలువురు ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

సమాజ సేవే మానవతా స్వచ్ఛంద సంస్థ లక్ష్యం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న వనజాక్షి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 22: సమాజ సేవే లక్ష్యంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని ఆ సంస్థ జిల్లా కన్వీనర్ గుంటక వనజాక్షి అన్నారు. ఆ సంస్థ నూతన కమిటీ ఎన్నిక ఆదివారం స్థానిక శుభం కల్యాణ మండపంలో పట్టణ అధ్యక్షులు ఎస్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన వనజాక్షి మాట్లాడుతూ.. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థలో రాష్ట్రంలో ఇప్పటి వరకు 70,000 మంది పైగా సభ్యులు ఉన్నారన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆర్థిక సాయం అందించడంతో పాటు విద్యార్థులకు నైతిక విలువలు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ బోధనతో పాటు పేదలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. నూతన కమిటీ మరింత సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో సెక్రటరీ గుంటక చెన్నారెడ్డి, ఉపాధ్యక్షులు ఆర్‌కేజీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మార్కాపురం శాఖ అధ్యక్షులుగా వెలిశెట్టి చలమయ్య, ఉపాధ్యక్షులుగా సీహెచ్ సుబ్బారావు, కార్యదర్శిగా గుంటక చెన్నారెడ్డి, సహాయ కార్యదర్శిగా రావిక్రింది కిరణ్, అవేర్‌నెస్ సెక్రటరీగా కొణిజేటి రమేష్, విద్యాకార్యదర్శిగా నారాయణం లావణ్య, హెల్త్ మెడికల్ సెక్రటరీగా కంచర్ల చెన్నకృష్ణగౌడ్, ఎమర్జెన్సీ సర్వీసెస్ సెక్రటరీగా నటుకుల వెంకటకృష్ణ, కోశాధికారిగా గంగిశెట్టి కిరణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీని పలువురు అభినందించారు.

పది పొట్టేళ్ల అపహరణ

పెద్దదోర్నాల, సెప్టెంబరు 22: పొట్టేళ్ల దొడ్డిలో నుంచి పది పొట్టేళ్లను అపహరించుకు పోయిన ఘటన దోర్నాలలోని అయ్యప్పస్వామి దేవాలయం సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకొంది. బాధితుడు గుమ్మా ఎల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం, తాను పొటేళ్ల మందను పగలు మేతకు తీసుకు వెళ్లి తిరిగి రాత్రి వేళ ఆ దొడ్డిలో చేరుస్తామన్నారు. అక్కడే కావలి కాస్తామని చెప్పాడు. ఈ క్రమంలో శనివారం కూడా ఆ దొడ్డిలోకి చేర్చామన్నారు. అర్ధరాత్రి వానజల్లు పడడంతో కావలి లేకుండా ఇంటికి వెళ్లామన్నారు. ఉదయం రాగానే దొడ్డి వద్ద వాహనం తిరిగిన జాడలు కనిపించాయన్నారు. అనుమానం వచ్చి మందను పరిశీలించామన్నారు. 99కి గాను 88జీవాలు మాత్రమే ఉన్నాయన్నారు. పది జీవాలు అపహరించుకుపోయినట్లు గుర్తించి పోలీసుస్టేషనులో పిర్యాధు చేసినట్లు తెలిపాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

- కేసు నమోదు చేసిన పోలీసులు

ఎర్రగొండపాలెం(పుల్లలచెరువు),సెప్టెంబరు 22: వ్యవసాయ బోర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి రాగి తీగను చోరీ చేసిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకొంది. పోలీసులు వివరాల ప్రకారం, మండలంలోని బోయలపల్లి గ్రామానికి చెందిన పాలగుడు కాశీరావు అనే రైతుపొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండుగులు శనివారం రాత్రి ధ్వంసం చేసి రాగి తీగను తీసుకెళ్లారని స్థానికులు తెలిపారు. ఆదివారం విద్యుత్ ఏఈ అల్లూరయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరాప్తు చేస్తున్నట్లు ఎర్రగొండపాలెం ఎస్‌ఐ పి.చౌడయ్య తెలిపారు.

28 వరకు ఓపెన్ స్కూలు అడ్మిషన్లు

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22: ఏపీ ఓపెన్ స్కూలు సొసైటీలో పదో తరగతి, ఇంటర్ కోర్సుల్లో ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 28వ తేదీ వరకు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా ప్రవేశాలు పొందవచ్చని డీఈవో డి.సుభద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 30 వరకు అడ్మిషన్లు పొందవచ్చని ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ కె.శివకుమార్ తెలిపారు. ఓపెన్ స్కూలు సొసైటీ స్టడీ సెంటర్ల కో ఆర్డినేటర్లు ఈ విషయాన్ని గమనించి ఈ ఏడాది అడ్మిషన సంఖ్య పెంచాలని ఆయన కోరారు.

తాగునీటి సమస్యను పరిష్కరించరూ!

- జాతీయ రహదారిపై ఐనముక్కుల ఎస్సీ కాలనీ వాసుల నిరసన

పెద్దదోర్నాల, సెప్టెంబరు 22: తమ కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని మండలంలోని ఐనముక్కుల గ్రామం ఎస్సీ కాలనీవాసులు కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై ఆదివారం ఖాళీబిందెలతో ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలో కొద్దిరోజులుగా తాగునీటి ఇబ్బంది నెలకొంది. దీంతో రోడ్డుపై ఖాళీబిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీలోని బోరులోని మోటారు మరమ్మతులకు గురైందని, ట్యాంకర్లతో సరిపడా నీటిని ఇవ్వడం లేదని నివాసితులు ఆరోపిస్తున్నారు. అసలే వ్యవసాయ పనుల కాలం నీటితో చాలా ఇబ్బందులు పడుతున్నా మని ప్రభుత్వం, ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించాలని, నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ క్రమంలో వాహనాల రాకపోకలు కొద్దిసేపు నిలిచిపోయాయి. సమాచారం తెలుసుకున్న పంచాయతీ అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని వెంటనే ట్యాంకరులను ఏర్పాటు చేస్తామని విద్యుత్తు సరఫరా మధ్యాహ్నం 12 గంటలకు ఉండడం వల్ల ఆలస్యమయిందని చెప్పారు. దీంతో ఆందోళన విరమించారు. దీంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.



నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

హిందీని ప్రతి ఒక్కరూ నేర్చుకోవాలి

హెచ్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మహబూబ్‌ఖాన్

కంభం, సెప్టెంబరు 22 : భారత దేశంలో అధికారికంగా మొదటి స్థానం, ప్రపంచంలో 3వ స్థానంలో ఉన్న హిందీ భాషపై ప్రతి పౌరుడు పట్టు సాధించాలని హెచ్‌టీయూ రాష్ట్ర గౌరవాధ్యక్షులు మహబూబ్‌ఖాన్ తెలిపారు. ఆదివారం కంభంలోని మన్సన్ హాలులో ఏర్పాటు చేసిన మూడు మండలాల హిందీ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహబూబ్ ఖాన్ మాట్లాడారు. నేడు జరిగే హిందీదినోత్సవ వేడుకలను జిల్లాస్థాయిలో కంభంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి వచ్చిన హిందీ ఉపాధ్యాయులు హిందీ భాష గొప్పదనం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. మాతృభాషతో పాటు హిందీని నేర్చుకుంటే దేశంలో, ప్రపంచంలో ఎక్కడైనా మనుగడ సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు పి.అబ్దుల్ సత్తార్, కాశయ్య, హెచ్‌టీయూ జిల్లా అధ్యక్షులు షేక్ సుభాని, జిల్లా గౌరవాధ్యక్షులు ఎం.పిచ్చయ్య, మార్కాపురం డివిజన్ అధ్యక్షులు షాకీర్‌వలి, సభ్యులు భాస్కర్, సనావుల్లా, సునీల్, బాలాజీ, నారాయణరెడ్డి, పిచ్చిరెడ్డి, హిందీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహబూబ్‌ఖాన్

వరద బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ

కంభం, సెప్టెంబరు 22 : పట్టణానికి చెందిన స్పందించే హృదయాలు చారిటబుల్ ట్రస్టు పలువురి ఆర్థిక సహకారంతో ఆదివారం విజయవాడలోని సితార సెంటర్, కండ్రిగ, బుడమేరు ప్రాంతం, ప్రకాశ్‌నగర్, రాజీవ్ నగర్ ప్రాంతాలలో ఎక్కువగా నష్టపోయిన 125 వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులను స్పందించే హృదయాలు తరఫున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ పులి శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ వరద బాధితులకు సాయం అందించేందుకు ఏర్పాటు చేసిన నిధికి ముఖపుస్తక మిత్రులు, లయన్స్‌క్లబ్ సభ్యులు దాదాపు 72 మంది 85,249 రూపాయలు విరాళంగా అందచేశారన్నారు. ఈ డబ్బుతో నిత్యావసర సరుకులు సబ్బులు, పచ్చళ్ళు, పేస్టులు, గోదుమపిండి, రవ్వ తదితర 19 రకాల వస్తువులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లెక్చరర్ కొత్తపల్లి నాగజ్యోతి, జెకెవెల్‌నెస్ సెంటర్ పూర్ణ, రూప్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

రెండు దశాబ్దాల తర్వాత తల్లిదండ్రుల చెంతకు

చొరవ చూపిన మార్కాపురం పోలీసులు

మార్కాపురం, సెప్టెంబరు 22: 'రెండు దశాబ్దాల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. వీధుల్లో తిరుగుతూ జీవనం సాగించాడు. గమ్యంలేని జీవితాన్ని గడిపాడు.' ఈ క్రమంలో అనుమానస్పదంగా తిరుగుతున్నట్లు గుర్తించిన పోలీసులు అతని గురించి విచారించారు. తల్లిదండ్రుల వివరాలు తెలపడంతో చొరవ తీసుకున్న పోలీసులు అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే సింగరాయకొండ మండలం సోమరాజుపల్లి గ్రామానికి చెందిన సుందరశెట్టి కోటేశ్వరరావు, శేషమ్మ దంపతులకు ముగ్గురు సంతానం. వారిలో చివరివాడు శ్రీహరి. వ్యవసాయాధారిత కుటుంబం వారిది. అందరూ కలిసి పనిచేస్తేనే కుటుంబం గడిచేది. సుమారు 20 ఏళ్ల క్రితం 15 ఏళ్ల వయసులో శ్రీహరి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అప్పటి నుంచి కూలీ పనులు చేసుకుంటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తిరిగాడు. ఎక్కడ పనిదొరికితే అక్కడ చేసుకోవడం కడుపు నింపుకోవడం చేసేవాడు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం శ్రీహరి అతని సహచరుడు కేశవతో కలిసి పూటుగా మద్యం సేవించి తిరుపతి నుంచి గుంటూరు వెళ్లే రైలు ఎక్కారు. శనివారం తెల్లవారుజామున మార్కాపురం రైల్వే స్టేషన్‌లో దిగారు. అక్కడ నుంచి ఎస్టేట్‌కు వచ్చి మద్యందుకాణం వద్ద మద్యం సేవించి అనుమానస్పదంగా తిరుగుతున్నారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొంగతనాలకు పాల్పడుతున్న వాళ్లేమోనని అనుమానించి పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లి విచారించారు. భయపడిన శ్రీహరి అతని చిరునామాను తెలియజేశాడు. పట్టణ ఎస్సై సైదుబాబు సింగరాయకొండ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అక్కడి పోలీసులు సోమరాజుపల్లి వెళ్లి విషయాన్ని తెలియజేశారు. తల్లి శేషమ్మ సంతోషించి మార్కాపురం వచ్చింది. అతను తన కుమారుడే అని 20 ఏళ్ల క్రితం ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని తెలియజేసింది. ఆమె పూచికత్తు మేరకు శ్రీహరిని పోలీసులు పంపించారు. తన కుమారున్ని అప్పజెప్పిన మార్కాపురం పోలీసులకు శ్రీహరి తల్లి, బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.



శ్రీహరిని శేషమ్మకు అప్పగిస్తున్న పోలీసులు

కళాశాలల స్థాయి క్రీడాకారుల ఎంపిక షెడ్యూల్

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22 : ఉమ్మడి జిల్లాలోని జూనియర్ కళాశాలల ఆటల పోటీలకు 19 సంవత్సరాలలోపు బాల, బాలికల ఎంపిక షెడ్యూల్‌ను స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 సెక్రటరీ ఈదర చింపారెడ్డి ఆదివారం ప్రకటించారు. ఈనెల 24, 25 తేదీల్లో సింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం పది గంటలకు యోగ, ఫెన్సింగ్, చెస్, బాక్సింగ్, జూడో, కరాటే, జిమ్నాస్టిక్స్, బీచ్ వాలీబాల్ ఎంపికలు శంకరరావు ఆధ్వర్యంలో జరుగుతాయన్నా రు. అలాగే 26న కందుకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అథ్లెటిక్స్, 27న హాకీ, హ్యాండ్‌బాల్, 28న క్రికెట్ క్రీడాకారుల ఎంపికల టి.సుబ్బారావు పర్యవేక్షణలో జరుగుతాయి. ఒంగోలులోని ఏబీఎం జూనియర్ కళాశాలలో ఈనెల 27న మో డ్రన్ పెంటాదిలక్స్, రబ్బీ, 28న సాఫ్ట్‌బాల్, షూటింగ్, 29న బేస్‌బాల్, రీజనింగ్ పో టీలు చంద్రశేఖర్, బి.సుబ్బారావుల ఆధ్వర్యంలో జరుగుతాయి. 30న ప్రభుత్వ జూనియర్ కళాశాల సింగరాయకొండలో కబడ్డీ, వాలీబాల్, షటిల్, బ్యాడ్మింటన్, టెన్ని కాయిట్, తైక్వాండో పోటీలు జరుగుతాయి. ఖోఖో పోటీలు బాలురకు ఎంఎస్‌ఆర్ కళాశాలల పంగులూరులో సీతారామిరెడ్డి ఆధ్వర్యంలో, బాలికలకు కనిగిరి ఎంఎస్ ఆర్ కళాశాలలో కాశీ విశ్వనాథరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. మిగిలిన ఆటల పోటీలు ఈనెల 31న ఒంగోలులోని ఏబీఎం కళాశాలలో జరుగుతాయని, వివరా లకు 9440621579, 9848125706 సెల్‌నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

అవీ..ఇవీ..

25న చెకుముకి టాలెంట్ టెస్టు

కంభం, సెప్టెంబరు 22 : అర్ధవీడు మండలం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ సహకారంతో 25న నిర్వహిస్తున్న చెకుముకి సైన్స్ సంబరాల కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొనాలని జేవీవీ మండల నాయకులు తిరుపతిరెడ్డి కోరారు. 8, 9, 10 తరగతులు విద్యార్థులకు చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూఢనమ్మకాలు తొలగించి శాస్త్రీయ ఆలోచనలు, విజ్ఞానాన్ని పెంపొందించేందుకు సైన్స్ సంబరాలు ఉపయోగ పడతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు మల్లికార్జునరావు, కేశిరెడ్డి, నరసయ్య, రాజగోపాల్‌రెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టడీమెటీరియల్ అందజేత

గిద్దలూరు, సెప్టెంబరు 22 : మండలంలోని పొదలకొండపల్లి గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న డాక్టర్ మొర్రి పిచ్చయ్య తన వార్షిక వేతనంలో 20 శాతం డబ్బులను విద్యాభివృద్ధికి వెచ్చిస్తున్నారు. ఇందులో భాగంగా గిద్దలూరు, అంబవరం, బేస్తవారపేట, ముండ్లపాడు, కే.ఎస్.పల్లి, అనుమలవీడు, యడవల్లి, పొదలకొండపల్లి గ్రామాలలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ అందజేశారు. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్ష రాసేందుకు ఇతర పోటీ పరీక్షలు రాసేందుకు ఈ మెటీరియల్స్ ఎంతగానో ఉపయోగపడతాయని పిచ్చయ్య పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మురుగునీటి కాలువలను శుభ్రంచేయాలి

గిద్దలూరు, సెప్టెంబరు 22 : పట్టణంలోని పీఆర్‌కాలనీలో 4వ లైన్ ప్రాంతంలో మురికినీటి కాలువలను శుభ్రం చేయాలని, ఆప్రాంత ప్రజలు కోరుతున్నారు. కాలువల్లో చెత్తాచెదారం పేరుకు పోయిందని, దోమల వృద్ధితో జ్వరాలు వస్తున్నాయని, దుర్వాసన వెదజల్లుతోందని, ఆప్రాంతవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లోని చెత్తాచెదారాన్ని తీసి కాలువల వెంట ఉన్న చిల్లకంపను తొలగించి దోమల నివారణ మందులను పిచికారి చేయాలని మున్సిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 22: మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. మహిళలు పొంగళ్లు వండి నైవేద్యం సమర్పించి నాగులపుట్టలో పాలుపోశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



విశేష అలంకరణలో పోలేరమ్మ

నిత్యావసర వస్తువుల పంపిణీ



నిత్యావసరాలు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

గిద్దలూరు, సెప్టెంబరు 22 : సంజీవిని అనాథాశ్రమానికి యువ ప్రగతిపథం స్వచ్ఛంద సేవాసంస్థ నిత్యావసర వస్తువులను అందించింది. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షులు వేణుగోపాల్, సభ్యులు రత్నం, కాశయ్య, భార్గవ్, తదితరులతోపాటు ఆశ్రమం నిర్వాహకులు రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆటల పోటీలలో విజేతలు



విజేతలైన విద్యార్థులు

గిద్దలూరు, సెప్టెంబరు 22 : నియోజకవర్గ స్థాయిలో జరిగిన పాఠశాల ఆటల పోటీలు ఘనంగా ముగిశాయి. గేమ్స్ చైర్‌పర్సన్ అనురాధ, కో-ఆర్డినేటర్లు స్వర్ణ శ్రీనివాసరెడ్డి, గుర్రం శోభన్‌బాబులు విజేతలకు ప్రకటించారు. అండర్-14 చెస్ బాలుర విభాగంలో కార్తీక్, ఆదికేశవ, వాలీబాల్‌లో కొమరోలు, గిద్దలూరు మండలాల జట్లు విన్నర్, రన్నర్‌గా నిలిచాయి. ఖోఖోలో గిరిజన పాఠశాల, బేస్తవారపేట మండల జట్లు విన్నర్, రన్నర్‌గా నిలిచింది. అండర్-17 విభాగంలో సైతం గిరిజన పాఠశాల, బేస్తవారపేట మండల జట్లు విన్నర్, రన్నర్‌గా నిలిచాయి. యోగాలో మైకేల్, ధనుష్ తొలి 2 స్థానాలు పొందారు. బాలికల విభాగంలోని అండర్-14 చెస్‌లో వైష్ణవి, అండర్-17 విభాగంలో ఇందు విజేతలుగా నిలిచారు. బ్యాడ్మింటన్ అండర్-14లో కంభం మండలం, అండర్-17లో బేస్తవారపేట మండల జట్లు విజేతలుగా నిలిచినట్లు పేర్కొన్నారు.

కంభంలో మళ్లీ పెరిగిన మట్కా

జూదం మాయలో రోడ్డున పడుతున్న కుటుంబాలు

కంభం, సెప్టెంబరు 22 : కంభంలో మట్కా మహమ్మారి పురివిప్పి నాట్యమాడుతోంది. మట్కా మాయలోపడి పలువురు రోజువారి కూలీలు పగలంతా కష్టపడి సంపాదించిన సొమ్మును మట్కా ఆటలో పందెం కాస్తూ జేబులు గుల్ల చేసుకుంటున్నారు. రెక్కాడితే గాని డొక్కాడని పలు పేద కుటుంబాలు ఈ జూదం మాయలోపడి రోడ్డున పడుతున్నాయి. కంభం లో ఆర్టీసీ బస్టాండ్, జుమ్మామసీదు కూడలి, వై.జంక్షన్, కందులాపురం కూడలిలో సాయంత్రం అయ్యే సమయానికి పలువురు రోజు కూలీలు, మధ్యతరగతి వారు మట్కా నెంబర్లపై వందలు, వేలు పందెం కాస్తున్నారు! ఈ రోజు పలానా నంబరు వస్తుందని తాము వేసిన నెంబరు వస్తే ఒకటికి పదింతలు డబ్బు వస్తుందనే పిచ్చినమ్మకంతో పందేలు వేస్తున్నారు. రాత్రి 10 గంటల తరు వాత ముంబాయి నుంచి డబ్బులు కట్టించుకున్న వారికి ఈ రోజు పలానా నంబరు వచ్చిందని సమాచారం తెలుపుతాడు. వంద మందిలో ఒకరికో ఇద్దరికో ఆ నంబరు ఉంటుం ది. మిగిలిన వారు మరుసటి రోజు ఎలాగైనా గెలువాలని మరలా డబ్బులు కాస్తుంటారు. మట్కా ఎక్కువగా టీస్టాల్స్ వద్ద బహిరంగంగా కాస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా పోలీసులు పేదల కుటుంబాలు రోడ్డున పడేసే మట్కాపై ఉక్కుపాదం మోపాలని కోరుతున్నారు.

ఎస్సై వివరణ

ఈవిషయంపై కంభం ఎస్సై నరసింహారావును వివరణ కోరగా మట్కా జూదం ఆడే ప్రదేశాలను గుర్తించి దాడులు చేయడమేకాక మట్కా ఆడించే నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పీడీసీసీబీ స్టాఫ్ యూనియన్ నూతన కమిటీ

ఒంగోలు(విద్య), సెప్టెంబరు 22 : ప్రకాశం జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్స్ (పీడీసీసీబీ) ఎంప్లాయిస్ అసోసియేషన్ అనుబంధంగా పనిచేస్తున్న స్టాఫ్ యూనియన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. నగరంలోని కర్నూలురోడ్‌లో ఓ హోటల్‌లో యూనియన్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షులు టి.వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ ఉద్యోగుల బదిలీ, ఉద్యోగోన్నతులలో ఎదురవుతున్న సమస్యల పరిష్కరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఫౌండర్ ప్రెసిడెంట్‌గా ఎస్.హరిబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జి.ప్రశాంతలక్ష్మి, వి.ఏడుకొండలునాయక్, సంయుక్త కార్యదర్శిగా ఎం.రామకృష్ణ, కోశాధికారిగా పి.చైతన్య, డైరెక్టర్లుగా పి.రజనీకుమారి, జి.వెంకటేశ్వర్లు, ఎ.ప్రసన్నకోటేశ్వరి, సీహెచ్.లావణ్య, కాకా రవీంద్రప్రసాద్, పి.సుస్మిత ఎన్నికయ్యారు. రాష్ట్ర అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా జిల్లా నుంచి అట్ల శ్రీను ప్రతిపాదించగా, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.నాగార్జునరెడ్డి ప్రతిపాదించారు. సమావేశంలో ప్రధానకార్యదర్శి సనక గోపీనాథ్, ముఖ్య సలహాదారు బోగాది శ్యామ్‌ప్రసాద్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 22: తిరుమల లడ్డూ తయారీలో స్వామి భక్తుల మనోభావాలు దెబ్బతీసే విధంగా గత ప్రభుత్వం నాణ్యత రహితంగా నెయ్యి కల్తీచేసిన వ్యవహారంలో బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వ్యవహరించిన తీరుకు నిరసనగా బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం పామూరులోని సత్యదేవుని దేవస్థానం నుంచి మమ్మీడాడీ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా రమణయ్య మాట్లాడుతూ శ్రీవారి సన్నిధిలోనే లడ్డూ తయారిలో ఉపయోగించే నెయ్యిలో కొవ్వు పదార్థాలతో కూడిన నూనెను ఉపయోగించి హిందువుల మనోభావాలను దెబ్బతీస్తూ కించపరుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జె.చినసుబ్బయ్య, కేవీ సుబ్బారావు, కె.హరగోపాల్, పి.శివ, టీడీపీ నాయకులు ఉప్పలపాటి హరిబాబు, పందిటి హరీష్, గుత్తి మహేష్, భజరంగ్‌దళ్ సభ్యులు జె.నరేష్ బి.సురేష్, ఎం.రాఘవ, బి.రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

'హిందువుల మనోభావాలను దెబ్బతీశారు'

దొనకొండ, సెప్టెంబరు 22: హిందువుల మనోభావాలను దెబ్బతీసేవిధంగా శ్రీవెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో అపవిత్ర పదార్థాలు కలపడం క్షమించరాని నేరమని ఆనంద ఆశ్రమ ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పేర్కొన్నారు. ఈ తప్పిదం ఎవరైతే చేశారో వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పవిత్రమైన తిరుమల లడ్డూ తయారీలో అపవిత్ర పదార్థాలు వినియోగించటం క్షమించరాని నేరమని టీడీపీ సీనియర్ నాయకుడు, రిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ మల్లికార్జునశర్మ పేర్కొన్నారు. దీనిపై వెంటనే సీబీఐ విచారణ చేపట్టి దోషులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

13,400 ఎకరాల్లో పంట నమోదు

దొనకొండ, సెప్టెంబరు 22: మండలంలో 4500 మంది రైతులు 13,400 ఎకరాల్లో సాగుచేసిన పత్తి, కంది, పొగాకు, మిర్చి పంటలను నమోదు చేయించుకున్నారని మండల వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. పంట నమోదుకు ఆదివారం తుది గడువు కావటంతో నమోదు కార్యక్రమం చేపట్టినట్టు చెప్పారు. ఖరీఫ్‌లో పంట నమోదు చేయించుకున్న రైతులందరూ తప్పనిసరిగా ఈకెవైసీ చేయించుకోవాలన్నారు.

దర్శి నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు చేపట్టాలి

దర్శి, సెప్టెంబరు 22: దర్శి నియోజకవర్గ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం నిధులు విడుదల చేసి అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు కంకణాల ఆంజనేయులు సూచించారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొనకొండను పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధిచేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఇంటింటికి కొళాయి పథకం పనులను చేపట్టి ప్రజలకు రక్షిత మంచినీరు అందించాలని కోరారు. నియోజకవర్గంలో ఇటీవలకాలంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయ పార్టీలు ప్రజలను రెచ్చగొట్టకుండా సమన్వయం పాటించాలన్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు యు.నారాయణ, కె.అనీల్, ఆంజనేయులు ఈ.నాగేశ్వరరావు, కర్నా హనుమయ్య, షేక్ ఖాలేబాషా తదితరులు పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

పామూరు, సెప్టెంబరు 22: జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేయాలని వరికూటి నాగరాజు అన్నారు. మండంలోని పడమరకట్టకిందపల్లి గ్రామంలో దరిశి ఏడుకొండలు అధ్యక్షతన మార్గం శ్రీను ఆధ్వర్యంలో ఆదివారం జండా ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న నాగరాజు జనసేన పార్టీ జండాను ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వై.రహీముల్లా, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రమణయ్య, తదితరులు పాల్గొన్నా రు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 22: గర్భిణులు, బాలింతలు పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూపర్‌వైజర్ ఎంపీఎస్ పార్వతి సూచించారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో పోషకాహార మాసోత్సవాల సందర్భంగా ఆదివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పార్వతి మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో సరఫరా చేసే పోషకపదార్థాలతో పాటు చిరుధాన్యాలు, పండ్లు, కూరగాయలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు బసవమ్మ, చంద్రకళ, రత్తమ్మ పాల్గొన్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

» టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



ముండ్లమూరు: కెల్లంపల్లిలో జరిగిన గ్రామ సభలో మాట్లాడుతున్న గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, సెప్టెంబరు 22: రాష్ట్రంలో ప్రజారంజక పాలన సాగుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆదివారం మండలంలోని కెల్లంపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం రామాలయం వద్ద జరిగిన సభకు ఎంపీటీసీ కుంటా ఏగేశ్వరి అధ్యక్షత వహించారు. డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎన్నో సంక్షేమ ఫలాలను అందజేస్తుందన్నారు. రాష్ట్రం ఆర్థిక లోటులో ఉన్నా ఎన్నికల ముందు పేద ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్ పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. రానున్న ఐదు సంవత్సరాల్లో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అభివృద్ధిలో దర్శిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. దర్శిలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించు కోలేదని డాక్టర్ లక్ష్మి ధ్వజమెత్తారు. కేవలం వారి నాయకులు బాగు పడ్డారే తప్పా రాష్ట్రంలో ఏ ఒక్క గ్రామాన్ని అభివృద్ధి చేసిన పాపాన పోలేదన్నారు. వంద రోజుల టీడీపీ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ముఖ్యంగా రైతులకు సంబంధించి టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేసినట్టు చెప్పారు. అనంతరం డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత సాగర్ దంపతులను శ్రీనివాస నగర్‌కు చెందిన యువ నాయకుడు టి.ఇంద్రసేనారెడ్డి, మాజీ సర్పంచ్ నిడమానూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భారీ గజమాలతో సత్కరించారు. ముందుగా గ్రామంలో కుంటా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నారపశెట్టి పాపారావు, మండల ప్రత్యేకాధికారి రమణ, ఎంపీడీవో ఆర్.జనార్దన్, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కుంటా ఏయోగేశ్వరి, వరగాని పౌలు, సోమేపల్లి శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ కట్టా భావన, వేముల సర్పంచ్ గజ్జల సుబ్బారెడ్డి, వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామంలో పాఠశాల భవనాన్ని మరమ్మతులు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఈసందర్భంగా సర్పంచ్ బత్తుల కృష్ణకుమారి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర దృష్టికి తీసుకొచ్చారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలు ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. అంతర్గత రహదారులు అధ్వానంగా ఉన్నాయని చెప్పారు. పంట పొలాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ఏఈ మోహన్‌రెడ్డిని పిలిచి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ప్రభుత్వం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేసారు.

కార్యక్రమంలో తహసీల్దార్ డి.మంజునాథరెడ్డి, ఎంపీడీవో రామచంద్రరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బోయిళ్ల నారాయణరెడ్డి, తోడేటి గోపి, రమణయ్య, శ్యామలమ్మ, శ్రీరాం పద్మావతి, తోడేటి అల్లురయ్య ఎస్సీ మాలకొండయ్య, తదితరులు పాల్గొన్నారు.



పామూరు: రేగులచెలకలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సీఎస్‌పురం(పామూరు) సెప్టెంబరు 22: ప్రజాసంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. ఆదివారం సీఎస్‌పురం మండలం రేగులచెలక గ్రామంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల్లోని సమస్యలను ఎప్పుడుకప్పుడు తెలుసుకుంటూ పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వందరోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. త్వరలో డీఎస్సీ ద్వారా ఉద్యోగ కల్పన, ఉచిత గ్యాస్ సిలెండర్లు అందజేస్తామన్నారు.

నేడు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి పర్యటన

కనిగిరి, సెప్టెంబరు 22: నియోజకవర్గంలోని పలు మండలాల్లో విద్యుత్ శాఖామంతి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పర్యటించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర క్యాంపు కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 11గంటలకు కనిగిరి పట్టణ సమీపంలోని అర్బన్ కాలనీలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు.

అనంతరం పామూరులో సీసీ రోడ్డు, వెలి గండ్ల మండలం నాగిరెడ్డిపల్లిలో పీహెచ్‌సీ, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, సచివాలయం, ఆర్‌బీకే సెంటర్, బస్‌స్టేషన్ ప్రారంభించనున్నారు. సాయంత్ర నాలుగు గంటలకు స్థానిక అమరావతి గ్రౌండ్‌లో ప్రజాదర్బార్ కార్యక్రమంలో పాల్గొననున్నట్టు పేర్కొన్నారు.

మంత్రి పర్యటనను విజయవంతం చేయాలి

వెలిగండ్ల: మండలంలో సోమ వారం జరిగే మంత్రి గొట్టిపాటి పర్యటనను విజయ వంతం చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహా రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలో ఆయన పర్యటించారు. నాగిరెడ్డిపల్లిలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు పీహెచ్‌సీ మంత్రి ప్రారంభి స్తారని డాక్టర్ ఉగ్ర చెప్పారు. వెలిగండ్లలో మధ్యాహ్నం రెండు గంటలకు సీసీ రోడ్లు, సచివాలయం, రైతు సేవా కేంద్రాలను ప్రారంభిస్తారని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ముత్తిరెడ్డి, దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, శ్యామల కాశిరెడ్డి, కేలం ఇంద్రభూపాల్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

కనిగిరి, సెప్టెంబరు 22: ప్రతిఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని మున్సిపల్ చైర్మన్ గఫార్ అన్నారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం మున్సిపల్, అటవీ శాఖలు, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా గఫార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని సూచించారు. వ్యర్థాలను సైడు కాల్వల్లో, రోడ్లపై వేయకుండా మున్సిపాల్టీ చెత్త వాహనాల్లో మాత్రమే వేయాలని కోరారు. ప్రతిఒక్కరూ ఏకత్రాటిగా కదలినప్పుడే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందన్నారు. ప్రతిఒక్కరూ మైదానాలు, ఖాళీ ప్రదేశాలు, ఇంటి పరిసరాల్లో మొక్కలు నాటి సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. స్వచ్ఛమైన గాలి ఆరోగ్యానికి మేలు చేస్తుందన్నారు. అది మొక్కల పెంపకంతోనే సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చెన్నకేశవులు, అటవీశాఖ అధికారులు ఎస్.నరసింహం, బీట్ ఆఫీసర్ ఎం.సునీల్‌కుమార్, గుడ్‌హెల్ప్ రమేష్, మున్సిపల్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

బోయపాటికి ఎమ్మెల్యే ఉగ్ర నివాళి

పీసీపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని మారెళ్లకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బోయపాటి సుబ్బారావు గుండెపోటుతో శనివారం మృతిచెం దాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆ దివారం గ్రామానికి వచ్చి సుబ్బారావు పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి వ్య క్తం చేశారు.



గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, సెప్టెంబరు 22: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడుపరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణఅర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరాజులు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పి.కార్తిక్ ఆలయ కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు. చినఆదినారాయణ, భక్తులు పాల్గొన్నారు. కాగా, భైరవకోనలో జలపాతం వద్ద భక్తులు ఆదివారం సందడి చేశారు. అనంతరం శ్రీ భైరవేశ్వర, త్రిముఖ దుర్గాదేవిని దర్శించుకొని భక్తులు పూజలు చేశారు.

పోలేరమ్మకు పొంగళ్లు

ముండ్లమూరు: మండలంలోని పలు గ్రామాల్లో వేంచేసి ఉన్న గ్రామ దేవత పోలే రమ్మ అమ్మవారికి భక్తులు ఆదివారం పొంగళ్ళు పెట్టి నైవేద్యాన్ని సమర్పించారు. ముండ్లమూరు, బొప్పూడి వారిపాలెం, ఈదర, పోలారం, పసుపుగల్లు, ఉమామ హేశ్వర అగ్రహారం, నూజెండ్లపల్లి గ్రామాల్లో అమ్మ వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

భక్తి శ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు నారాయణస్వామి మూలవిరాట్ విగ్రహానికి కుంకుమార్చన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులు ఆలయ గోపురం వద్ద నుంచి దేవస్థానం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వామి వారికి మహానైవేద్యం సమర్పించారు. అనంతరం గోశాలలోని గోవులను పూజలు నిర్వహించి నైవేద్యాన్ని భక్తులకు పంపిణీచేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని

వైభవంగా గణనాథుని నిమజ్జనం

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారి పాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, తాళ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. శనివారం రాత్రి వినాయకస్వామి వద్ద ప్రసాదంగా ఏర్పాటుచేసిన లడ్డూలను వేలంపాట నిర్వహించారు. ఆయా విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ ఎస్.మల్లికార్జునరావు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, గొల్లపూడి వేణుబాబు, కాలేషావలి, కె.రామయ్య వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొర్రపాటివారిపాలెంలో గణనాథుని నిమజ్జన కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్, ఎంపీపీ తాటికొండ

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం డివిజన్ అధ్యక్షుడిగా రెహమాన్

దొనకొండ, సెప్టెంబరు 22: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం మార్కాపురం, కనిగిరి డివిజన్ స్థాయి అధ్యక్షుడిగా దొనకొండకు చెందిన షేక్ రెహమాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మార్కాపురంలో జరిగిన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెరుకూరి పూర్ణచంద్రరావు, రాష్ట్ర కార్యదర్శి కె.వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి యనమల ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం, కనిగిరి డివిజన్ శాఖను ఏర్పాటుచేసి అధ్యక్షుడిగా షేక్ రెహమాన్, గౌరవాధ్యక్షుడిగా యు.బాలగురువులు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులు, కోశాధికారిగా షేక్ రహంతుల్లా, సహాధ్యక్షులుగా ఎం.ప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జూదరుల అరెస్టు

పామూరు, సెప్టెంబరు 22: పామూరు మండలంలోని కొత్తపల్లి గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న 9 మందిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం సాయంత్రం ఎస్ఐ టి.కిశోర్‌బాబు తన సిబ్బందితో దాడిచేసి వారిని అదుపులోకి తీసుకొన్నారు. వారినుంచి రూ.1,13,560 నగదును స్వాధీనం చేసుకున్నారు.







- దశావతార సన్నిధిలో స్వీకరించిన జనసేనాని
- తిరుమల లడ్డూ తయారీలో కల్తీ దుర్మార్గమైన చర్య
- హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరిక

పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత్త దీక్ష

పెదకాకాని, సెప్టెంబరు 22: కలియుగ ప్రత్యక్షదైవం వేంకటేశ్వరస్వామి సన్నిధిలో ఘోర అపచారం జరిగింది. అమృతతుల్యంగా.. పరమ పవిత్రంగా భావించే తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైంది. సనాతన ధర్మాన్ని నమ్మే ప్రతి ఒక్కరూ ఇందుకు ప్రాయశ్చిత్తం చేసుకోవాల్సిందే.. అంటూ జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం 'ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. 11 రోజులు కొనసాగే ఈ దీక్షను ఆయన గుంటూరు సమీపంలోని నాగార్జున వర్సిటీ ఎదుట నంబూరు పరిధిలోని దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వీకరించారు. దీక్ష అనంతరం తిరుమల శ్రీవారిని జనసేనాని దర్శించుకోనున్నారు. దీక్ష చేపట్టేందుకు వచ్చిన పవన్‌కల్యాణ్‌కు ఆలయ నిర్వాహకులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు పవన్ కల్యాణ్ పట్టువస్త్రాలు సమర్పించారు. తొలుత ఆలయంలో విఘ్నేశ్వరుడికి పూజ చేశారు. వేద పండితులు ప్రత్యేక పూజల అనంతరం మహాలక్ష్మీ అమ్మవారిని దర్శించు కున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వేంకటేశ్వరస్వామిని కోరుతూ ఆయన దీక్ష మాలధారణ తీసుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవారి మహాప్రసాదమైన లడ్డూను కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి హిందువు, ధర్మాన్ని పాటించే ప్రతీ వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాలన్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ సంస్కరణల పేరుతో స్వామివారి పూజా విధానాలను కూడా మార్చేసిందన్నారు. రామ తీర్థం ఆలయంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేస్తే ఆ ఘటనపై పోరాటానికి చిలకలూరిపేట నుంచి ముస్లింలు వచ్చి మద్దతు ఇచ్చారని తెలిపారు. తమది కక్ష సాధింపు ప్రభుత్వం కాదని అలాగని ఎవరైనా తప్పులు చేస్తే ఉపేక్షించే ప్రభుత్వం కూడా కాదన్నారు. తిరుమలలో జరిగిన ఘటన ఇంకెక్కడా భవిష్యత్తులో జరగకుండా చూసేలా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. తిరుమలలో స్వామివారి ప్రసాదంలో కల్తీ జరుగుతుంటే అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టమని హెచ్చరించారు. ఈ అపరాధంతో సంబంధం లేక పోయినా తాను ప్రాయశ్చిత్త దీక్ష తీసు కున్నట్లు చెప్పారు.



దశావతార సన్నిధిలో దీక్ష తీసుకుంటున్న పవన్‌కల్యాణ్

అభిమానోత్సాహం..

పవన్‌రాకతో ఆలయ ప్రాంగణం అభిమానులతో నిండి పోయింది. పెద్ద సంఖ్యలో అభిమానులు అక్కడికి చేరుకుని పవన్‌కల్యాణ్‌కు నీరజనాలు పలికారు. ఆలయంలో ప్రవేశించేటప్పుడు పవన్‌కల్యాణ్‌పై పూలవర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు లింగమనేని రమేష్, లింగమనేని పూర్ణ భాస్కరరావు దంపతులు, శాసనమండలి సభ్యులు హరిప్రసాద్, పొన్నూరు నియోజకవర్గ జనసేన నాయకురాలు పార్వతి నాయుడు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



ఎన్‌వోసీ రద్దు.. ఆగని నిర్మాణాలు

- గ్రీన్‌గ్రేస్‌పై ఏడాది క్రితమే రైల్వే నిర్ణయం
- చర్యలపై జీఎంసీకి రైల్వే సీనియర్ డీఈఎన్ లేఖ
- నోటీసులతో సరిపెట్టిన అప్పటి కమిషనర్ కీర్తి
- నాటి వైసీపీ నేతల ఆదేశాలతో తదుపరి చర్యలకు వెనకడుగు

గుంటూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర నడిబొడ్డున స్వామి థియేటర్‌కు సమీపంలో నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ ఆకాశ హర్మ్యాలకు రైల్వే శాఖ ఎన్‌వోసీని గత ఏడాదే రద్దు చేసింది. జీ+4 భవనాలకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకుని ఆ తర్వాత జీ+15 నిర్మాణాలు చేపట్టడంతో రైల్వే శాఖ అధికారులు క్షేత్రపరిశీలన చేసి అనుమతులను ఉల్లంఘించినట్లు నిర్ధారించారు. రైల్వే సరిహద్దు నుంచి కేవలం 24.38 మీటర్ల దూరంలోనే నిర్మాణాలు జరుగుతుండటంతో సెట్ బ్యాక్ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేల్చారు. రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) జేవీ అనూష నేతృత్వంలో అధికారులు పరిశీలించి ఎన్‌వోసీ రద్దు చేసినట్లుగా అప్పటి నగరపాలకసంస్థ కమిషనర్ కీర్తి చేకూరికి సమాచారం ఇచ్చారు. దీని ఆధారంగా గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ నిర్మాణాలు నిలిపేయాలని కమిషనర్ స్టాప్ ఆర్డర్ జారీ చేసినట్లు అధికారవర్గాలు తెలిపాయి. అయితే అప్పటి వైసీపీ నేతల ఒత్తిళ్లతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో నిన్నమొన్నటి వరకు నిర్మాణాలు నిరాటంకంగా కొనసాగుతూ వచ్చాయి. ఆదిత్య ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ 2015లో జూట్‌మిల్లు స్థలంలో జీ+4 అపార్టుమెంట్ భవన నిర్మాణానికి రైల్వే శాఖకు ఎన్‌వోసీ కోసం దరఖాస్తు చేయగా అప్పటి దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సీజీఈ పరిశీలించి అనుమతి ఇచ్చారు. ఎన్‌వోసీ ఆధారంగా కరెస్పాండింగ్ డ్రాయింగ్స్‌ని జారీ చేశారు. అయితే 2023లో రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ /పీవే/ గుంటూరు రైల్వే సీనియర్ డీఈఎన్ (కో-ఆర్డినేషన్) దృష్టికి జీ+4కు అనుమతి తీసుకుని జీ+15 నిర్మిస్తున్న విషయాన్ని తీసుకెళ్లారు. పేరు కూడా భజరంగ్ అర్బన్ ప్రైవేటు లిమిటెడ్‌గా మార్పు చేశారని నివేదించారు. దీనికి రైల్వే నుంచి ఎలాంటి ఎన్‌వోసీ తీసుకోలేదన్నారు. కాగా సెట్‌బ్యాక్‌కు అవసరమైన స్థలాన్ని విడిచి పెట్టడంలో ఉల్లంఘనలు ఉన్నాయని తెలిపారు. మెయిన్ బిల్డింగ్ ప్రస్తుత ఎత్తు 13 మీటర్లుగా ఉందని, ఇది అనుమతి తీసుకున్న జీ+4కి చాలా ఎక్కువని చెప్పారు. అంతేకాకుండా సెల్లార్ నిర్మాణం రైల్వే హద్దుకు సమీపంలో చాలా ప్రమాదకరంగా ఉందన్నారు. ఈ ఉల్లంఘ నలన్నింటిని పరిగణనలోకి తీసుకున్న రైల్వే సీనియర్ డీఈఎన్ ఎన్‌వోసీ నిబంధనలు ఉల్లంఘించినందున గతంలో ఇచ్చిన అనుమతి రద్దు అయినట్లే భావించాల్సిందిగా గుంటూరు నగరపాలకసంస్థ కమిషనర్‌ను అడ్రస్ చేస్తూ లేఖ పంపారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు తక్షణమే తగిన చర్యలు చేపట్టాలన్నారు. భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా ప్రైవేటు లిమిటెడ్ సంస్థకు కూడా నిర్మాణాలు నిలిపేయాలన్నారు.

అన్నివేళ్లు కార్పొరేషన్ వైపే

రైల్వే శాఖ ఎన్‌వోసీని రద్దు చేస్తూ ఏకంగా అప్పటి కమిషనర్ కీర్తి చేకూరికి లేఖ రాశారు. ఆమె సాధారణ అపార్టుమెంట్ల ప్లాన్ల విషయంలో స్వయంగా తానే పరిశీలించి అన్నింటిని చూసి సవ్యంగా ఉంటేనే ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ జారీ చేసేవారు. అలాంటిది గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్ల వైపు ఎందుకు కన్నెత్తి అయినా చూడలేదో అర్థం కాని పరిస్థితి. గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్లు నిర్మిస్తున్నది అప్పటి మంత్రి అంబటి రాంబాబు సోదరుడు మురళీకృష్ణ కావడమే ఏకైక కారణంగా కనిపిస్తున్నది. కేవలం స్టాప్ ఆర్డర్‌తో చేతులు దులుపుకున్నారు. అప్పటి నగర పాలకసంస్థ టౌన్‌ప్లానింగ్ అధికారులు, గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ నిర్మాణదారులతో చేతులు కలిపినట్లు పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆరోపిస్తున్నారు. అసలు ఇప్పటివరకు రైల్వే శాఖ జారీ చేసిన ఎన్‌వోసీ రద్దు, కార్పొరేషన్ ఇచ్చిన స్టాప్ ఆర్డర్స్‌ని ఎందుకు బహిర్గతం చేయలేదని ఆయన ప్రశ్నించారు. స్టాప్‌వర్క్ ఆర్డర్స్ ఉన్నా భజరంగ్ అర్బన్ ఇన్‌ఫ్రా సంస్థ పనులు కొనసాగించడం వల్ల పక్కనే ఉన్న చిన్నచిన్న భవనాలు పునాదులు దెబ్బ తిన్నాయన్నారు. అవి ఏ క్షణాన నేలకొరుగుతాయోనన్న భయాందోళన యజమానుల్లో నెలకొన్నదని చెప్పారు. రైల్వే శాఖ పంపిన ఎన్‌వోసీ రద్దు ఆదేశాల లేఖని కార్పొరేషన్‌లో మాయం చేసినట్లు తమకు అనుమానం కలుగుతుందన్నారు. దీనికి సంబంధించి బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

బదిలీల జాతర

- జడ్పీ సీఈవోగా జ్యోతిబసు
- జిల్లా అటవీశాఖాధికారిగా హిమశైలజ
- డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా విజయలక్ష్మి
- మైనింగ్ జిల్లా అధికారిగా శ్రీవెంకటసాయి
- ఉమ్మడి గుంటూరులో 57 మంది ఎంపీడీవోల బదిలీ

బాపట్ల(ఆంధ్రజ్యోతి), గుంటూరు సిటీ, సెప్టెంబరు 22: బదిలీల నేపథ్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో ప్రక్షాళన జరిగింది. జడ్పీ కార్యాలయంతోపాటు, 57 మండలాల్లో ఎక్కువ మంది సిబ్బందికి స్థాన చలనం కలుగుతుంది. జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా, ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు బదిలీ లపై చేపట్టిన కసరత్తు ఆదివారం అర్ధరాత్రికి కొలిక్కి వచ్చి నట్లు సమాచారం. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పరిగ ణనలోకి తీసుకుంటూనే, నిబంధనలను అమలు చేయాలన్న ఆలోచనతో బదిలీల జాబితాను రూపొందిస్తున్నట్లు తెలి సింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల్లో ఎంపీడీవోలకు స్థానచలనం జరగనుంది. ప్రస్తుతం 43 మం ది ఎంపీడీవోలు ఉండగా వారిలో 8 మంది పక్క జిల్లాలకు వెళ్లేందుకు దరఖాస్తు చేసుకున్నారు.



బదిలీల జాబితాపై ఆదివారం రాత్రి కసరత్తు చేస్తున్న ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు

ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీకి 30 మంది దరఖాస్తు చేసుకోగా ఐదుగురు దర ఖాస్తు చేసుకోలేదు. దరఖాస్తు చేసుకున్న వారి బదిలీలు లాంఛనమే అని సమాచారం. 16 మంది ఎంపీడీవోలు ఉమ్మడి గుంటూరు జిల్లాకు కొత్తగా రాగా వారికి మండలాల కేటాయింపుపై కసరత్తు చేపట్టారు. పల్నాడు జిల్లాకు చెందిన కొందరు ఎమ్మెల్యేలు ఆదివారం సాయంత్రం కూడా ఎంపీడీవోల బదిలీలపై జడ్పీ అధికారులకు ఫోన్లు చేస్తూనే ఉన్నారు. ఎమ్మెల్యేల సిఫార్సు చేయడంతో తదనుగుణంగా జాబితాను రూపొందించేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావు జిల్లాలో కొనసాగేందుకు దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఆయనకు స్థానచలనం కలగనుంది. డ్వామా పీడీ పోస్టు కోసం దరఖాస్తు చేసినా ప్రభుత్వం తీసుకున్న పాలసీ వల్ల ఆయన జిల్లా దాటి వెళ్లాల్సి వస్తుంది.

జఠిలంగా బదిలీల ప్రక్రియ

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారి జరుగుతున్న బదిలీలు కావడంతో కార్యాలయ అధికారులు, సిబ్బంది బదిలీలు జడ్పీలో జఠిలంగా మారాయి. జడ్పీ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది మార్పునకు సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం కీలక స్థానాల్లో ఉన్న వారిలో చాలా మంది వైసీపీ హయాంలో వచ్చిన వారే. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఎమ్మెల్యేలు జడ్పీలోని 9 మంది ఏవోల బదిలీపై సూచనలు చేసినట్లు తెలుస్తోంది. వారి స్థానంలో కొత్త వారి పేర్లను ప్రతిపాదించి సిఫార్సు లేఖలు జడ్పీకి పంపినట్లు సమాచారం. ఆరుగురు సీనియర్ అసిస్టెంట్లు, 11 మంది జూనియర్ అసిస్టెంట్లు, ఇద్దరు టైపిస్టుల బదిలీపై రాజకీయ ఒత్తిడి ఉన్నట్లు సమాచారం. వైసీపీ హయాంలో ఓ సామాజికవర్గం లక్ష్యంగా బదిలీలు జరిగాయన్న విమర్శలు వచ్చాయి. అప్పుడు అన్యాయం జరిగిన వారికి ఇప్పుడు ప్రాధాన్యం కల్పించే దిశగా అడుగులు పడుతున్నట్లు సమాచారం.

అధికారుల బదిలీలు ఇలా..

ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిలో కీలక విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు. జడ్పీ సీఈవోగా వీ జ్యోతిబసు, డిప్యూటీ సీఈవోగా సీహెచ్ కృష్ణ నియమితులయ్యారు. ఇక జడ్పీ ఇన్‌చార్జి సీఈవో మోహన్‌రావుని నెల్లూరుకు బదిలీ చేశారు. జిల్లా అటవీశాఖ అధికారి కే మహబూబ్‌బాషా బదిలీ కాగా ఆ స్థానంలో ఎం హిమ శైలజను నియమించారు. చాలాకాలంగా గుంటూరు గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీగా పనిచేస్తున్న వై హరిహరనాథ్‌ను మాతృ శాఖ అయిన పంచాయతీరాజ్‌కి బదిలీ చేయగా, ఆ స్థానంలో డ్వామాలో డీఎల్డీవోగా పనిచేస్తున్న టీవీ విజయలక్ష్మిని నియమించారు. జిల్లా పంచాయతీ అధికారి కే శ్రీదేవి నెల్లూరు జిల్లా కందుకూరుకు బదిలీ కాగా ఆ స్థానంలో నాగసాయి రానున్నారు. తెనాలి డీ ఎల్డీవో కే పద్మావతిని చీరాలకు బదిలీ చేసి ఆ స్థానం లో కందుకూరు డీఎల్డీవో పీ పద్మజను నయమించారు. బాపట్ల డీఎల్డీవోగా జీవీ నారాయణరెడ్డిని, రేపల్లె డీఎల్డీవోగా పీ పద్మ నియమితులయ్యారు. బాపట్ల డ్వామా, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీగా ఉన్న వై పిచ్చిరెడ్డిని గుంటూరు డీఎల్డీవోగా నియమించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జడ్ రమేష్ తెనాలి నుంచి విజయవాడకు, జీ అశోక్ పర్చూరు క్వాలిటీ కంట్రోల్‌కు, జే హరేరామకృష్ణ ఒంగోలు నుంచి బాపట్లకు, జీ ముత్యంబాబు బాపట్ల నుంచి తెనాలికి బదిలీ అయ్యారు. బాపట్ల డీపీవో రవికుమార్‌ను కాకినాడు జిల్లాకు బదిలీ చేసి ఆ స్థానంలో కేఎల్ ప్రభాకర్‌రావును నియమిస్తూ ప్రభు త్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏలూరు జిల్లా డ్వామా విజిలెన్స్ విభాగం జిల్లా అధికారిగా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని బాపట్ల జిల్లా డ్వామా పీడీగా నియమితులయ్యారు. గుంటూరు జిల్లా మైన్స్ అండ్ జియాలజీ అధికారి ఎస్‌కేవీ సత్య నారాయణని చిత్తూరుకు బదిలీ చేసి ఏపీ ఎండీసీలో విధులు నిర్వహిస్తున్న ధూళిపాళ్ల శ్రీవెంకటసాయిని ప్రభుత్వం ఇక్కడ నియమించింది.



వైసీపీకి జీ హుజూర్.. మళ్లీ పోస్టింగ్



ఐదేళ్ల ప్రకాశం జిల్లా ఇన్‌చార్జి డీపీవోగా ఉన్నతాధికారుల ఆదేశాలను కూడా లెక్క చేయకుండా వైసీపీ నేతల సేవలో తరించిన నారాయణరెడ్డికి తాజా బదిలీ ల్లో బాపట్ల డీఎల్‌డీవోగా పోస్టింగ్ దక్కింది. డీపీవోగా ఆయన పై అధికారుల అనుమతి లేకుండా నిబంధన లకు విరుద్ధంగా వైసీపీ నేతలు చెప్పినట్లుగా అప్పట్లో బదిలీలు చేపట్టారనే ఆరోపణలు కూడా ఆయనపై ఉన్నాయి. అద్దంకి, చీరాల, పర్చూరు పరిధిలో చేపట్టిన బదిలీలపై అప్పట్లో బాపట్ల జేసీ శ్రీనివాసులు నారా యణరెడ్డికి షోకాజ్ నోటీసులు కూడా జారీ చేశారు. ఆ తర్వాత ఆయన సెలవుపై వెళ్లారు. కాగా ప్రకాశం డీపీవోగా జీవీ నారాయణరెడ్డి పనిచేసిన కాలంలో జరిగిన అవక తవకలపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని తాజాగా కలెక్టర్ వెంకట మురళికి చినగంజాం మండలానికి చెందిన కూటమి నేతలు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ప్రస్తుత బదిలీల్లో ఆయ నకు బాపట్ల డీఎల్‌డీవోగా పో స్టింగ్ ఇవ్వడంపై విమ ర్శలు వ్యక్తమవు తున్నాయి.

వైసీపీతో అంటకాగినా.. అందలమే

- దేవదాయశాఖలో కొనసాగుతున్న వివాదాస్పద అధికారులు
- కూటమి ప్రభుత్వంలోనూ వారికి అదే స్థానాలపై వెల్లువెత్తుతున్న విమర్శలు

గుంటూరు(కార్పొరేషన్), సెప్టెంబరు 22: గత వైసీపీ ప్రభుత్వంలో గుంటూరు జిల్లా దేవాదాయ శాఖలో కొందరు అధికారులు బరితెగించారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించడమే కాకుండా అక్రమాలతో చెలరేగి పోయారు. అంతేగాకుండా అప్పటి ప్రతిపక్షం టీడీపీ అధినేత చంద్రబాబును నేరుగా విమర్శించడంతో పాటు సభలను కూడా అడ్డుకున్నారు. ఇలాంటి అధికారులపై కూటమి ప్రభుత్వంలో చర్యలు ఉంటాయని అందరూ అనుకున్నారు. కానీ వారు అదే స్థానాల్లో కొనసాగుతుం డటంపై దేవదాయ శాఖ లోని మిగిలిన అధికా రులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలతో ఐదేళ్లు అంటకాగి ఇప్పుడు కూడా వారి హవానే కొనసాగడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వైసీపీ ప్రభుత్వానికి అప్పట్లో అనుకూలంగా పని చేయడమే కాకుండా అడ్డగోలుగా అక్రమాలకు పాల్పడిన వారు ఇంకా అదే స్థానాల్లో కొనసాగడంపై విమర్శ లు వస్తున్నాయి.



- మంగళగిరిలో ఓ ఈవో అప్పటి వైసీపీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డితో చేతులు కలిపి పెద్ద కోనేరు తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఆయనకు ఈవోగా కొనసాగే అర్హత లేనప్పటికీ తొలుత ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టారు. 2019లో గెలుపొందిన వైసీపీ ఎమ్మెల్యేలు ఇళ్లకు వెళ్లి మంగళగిరి నరసింహస్వామి ప్రసాదాన్ని అందజేసి ఎమ్మెల్యేలను ఆ అధికారి సత్కరించారు.
- జూనియర్ అధికారిగా ఉన్న ఓ అధికారిని వైసీపీ ప్రభుత్వం గుంటూరు దేవదాయశాఖలో కీలక పోస్టింగ్‌లో నియమించింది. ఇన్‌చార్జిగా కాకుండా రెగ్యులర్ పోస్టింగ్ చేస్తూ జగన్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఇదే అవకాశంగా ఆ అధికారి పలు అంశాలకు సంబంధించి అడ్డగోలుగా ఉత్తర్వులు జారీతో పాటు నిబంధనలకు విరుద్ధంగా జీతాలు డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి.
- గతంలో గుంటూరు ఏసీగా, ఇప్పుడు కీలక స్థానంలో ఉన్న ఓ అధికారి ఉద్యోగులను డబ్బుల కోసం వేధించడమే కాకుండా, గత ప్రభుత్వానికి అనుకూలంగా ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారని సమాచారం. వడ్లమూడి సంగంలో డీవీసీ ఆస్పత్రికి చెందిన కో ఆపరేటివ్ స్థలాన్ని దేవదాయశాఖ ఆస్తి కింద రిజిస్ట్రేషన్ జరిపించిన ఘటనపై అప్పట్లో సంగం డెయిరీ చైర్మన్ నరేంద్రకుమార్ హైకోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో చంద్రబాబు బహిరంగ సభలకు దేవదాయశాఖ స్థలాలు ఇవ్వనివ్వకుండా ఆ అధికారి అడ్డుకున్నారు. పర్చూరులో జరిగిన చంద్రబాబు సభను అడ్డుకుని రైతులకు నోటీసులు ఇచ్చి వారిని భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన అప్పట్లో వివాదాస్పదమైంది.
- గత ఏడాది సెప్టెంబరు 9న చంద్రబాబు అరెస్టు అయినప్పుడు గుంటూరులోని డీసీ కార్యాలయంలో ఓ అధికారి అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిసింది. బాబు అరెస్టు అయ్యాడు.. బాధపడే వారు రండి అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అప్పట్లో పెద్ద దుమారం రేపాయి. ఇలాంటి అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలున్నాయి. అప్పుడు వైసీపీ అండతో విర్రవీగి, ఇష్టారాజ్యంగా వ్యవహరించిన అధికారులపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోగా వారిని అదే స్థానాల్లో కొనసాగించేందుకు జరుగుతున్న ప్రయత్నాలపై విమర్శలు వస్తున్నాయి.

లాభసాటి వ్యవసాయమే లక్ష్యం

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి

అద్దంకి, సెప్టెంబరు 22: రైతుల సమస్యలను పరిష్కరించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి నియోజకవర్గ వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆదివారం చిలకలూరిపేటలోని తన నివాసంలో మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ, పశు సంవర్థక, ఉద్యాన, మార్కెటింగ్ శాఖలతో పాటు శాస్త్రవేత్తలు కలిసి పంట పొలాల పరిశీలనతో పాటు గ్రామసభలు నిర్వహించి రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఉదయం 8-30 నుంచి మధ్యాహ్నం 1 వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో గ్రామంలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు, వ్యవసాయశాఖ అధికారులు వెంకటకృష్ణ, సుబ్బారెడ్డి, శ్రీనివాసరావు, ఎస్‌వీ కుమారి, పలువురు రైతులు పాల్గొన్నారు.



పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి



నిరసన తెలుపుతున్న నాయకులు

కల్తీ లడ్డూ బాధ్యులను శిక్షించాలి

చినగంజాం, సెప్టెంబరు 22 : తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డూ ప్రసాదంలో కల్తీకి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ కూటమి నాయకులు డిమాండ్ చేశారు. శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ చేసి హిందూ ధర్మానికి హాని కలిగించాలని చూసిన శిక్షించాలని కోరుతూ టీడీపీ కూటమి నాయకులు మండలంలోని కడవకుదురు గ్రామంలోని కమ్యూనిటీ భవనం వద్ద ఆదివారం రాత్రి జగన్‌రెడ్డి దిష్టిబొమ్మతో నిరసన వ్యక్తం చేసిన అనంతరం దిష్టిబొమ్మను దహనం చేశారు. లడ్డూ ప్రసాదం వ్యవహారంలో చేసిన మోసంపై జగన్‌రెడ్డిని వెంకన్న స్వామి తప్పక శిక్షస్తారని నాయకులు అన్నారు. ఇలాంటి చర్యలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు పొట్టి వెంకటశ్రీనివాసరావు, చల్లా వెంకటరావు, మదాసు ప్రసాదు, సందు శ్రీనివాసరావు, తోట అశోకచక్రవర్తి, అనంత వెంకటేశ్వరరావు, సీ.హెచ్.శ్రీనివాసరావు, శివకోటి సుబ్బారావు, అనంత యశ్వంత్, పూల అనిల్‌కుమార్, గాజుల వంశీకృష్ణ, మధు, శివనారాయణ, వెంకటరావు, తోట నాగూర్ పాల్గొన్నారు.

సింగరకొండ దేవస్థానం ఈవోగా తిమ్మనాయుడు



తిమ్మనాయుడు

అద్దంకి, సెప్టెంబరు 22 : సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఈవో, అసిస్టెంట్ కమిషనర్‌గా ఎం.తిమ్మనాయుడును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ నుంచి ఉత్తర్వులు అందాయి. ఇప్పటి వరకు ఇక్కడ ఈవోగా పనిచేసిన సుభద్రను గుంటూరులోని లాలాపేట శ్రీజగన్నాథ, ఆంజనేయ, వేంకటే శ్వర స్వామి దేవస్థానాలకు ఈవోగా బదిలీ చేశారు.

రత్తమ్మకు ఎమ్మెల్యే ఏలూరి నివాళి



రత్తమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

జాగర్లమూడి (పర్చూరు), సెప్టెంబరు 22 : తెలుగుదేశం పార్టీ పర్చూరు నియోజకవర్గ సీనియర్ నాయకుడు దూళిపల్లి వెంకటస్వామి మాతృమూర్తి దూళిపల్లి రత్తమ్మ దశదిన కర్మ ఆదివారం జాగర్లమూడిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని రత్తమ్మ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏలూరితోపాటు పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ కఠారి రమేష్ నాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యులు దాసరి ఉషారాణి, కొల్లా సుభాష్ బాబు, నాయకులు నాయుడు హనుమంతురావు, రంగయ్య చౌదరి, షేక్ షంషుద్దీన్, మక్కెన శేఖర్‌బాబు, ఫ్యాక్టరీ శ్రీనివాసరావు, పోపూరి శ్రీనివాసరావు, తాటి నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి రూ.2.60లక్షల విరాళం

పర్చూరు, సెప్టెంబరు 22: విజవాడ వరద బాధితుల సాయం కోసం సీఎం సహాయ నిధికి మండలం చెరుకూరు గ్రామస్థులు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఉషారాణి ఆధ్వర్యంలో రూ.2.5లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును కలసి అందజేశారు. అదేవిధంగా అన్నంబొట్లంవారి పాలెం గ్రామానికి చెందిన రైతు గోరంట్ల రంగారావు రూ.10,116 చెక్కును అందజేసి దాతృత్వం దాటుకున్నారు. కార్యక్రమంలో దాసరి రామకృష్ణ, పాలేరు కోటేశ్వరరావు, అప్పలనేని నరేంద్ర, చెన్నుపాటి కిషోర్, పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతపల్లిపాడు గ్రామస్థుల సాయం

యద్దనపూడి(మార్టూరు): యద్దనపూడి మండలం చింతపల్లిపాడు గ్రామస్థులు విజయవాడలోని వరద బాధితులకు తమ వంతుసాయంగా రూ.లక్షా 25వేలను విరాళంగా అందచేశారు. వారు ఈ నగదును సీఎం సహాయ నిధికి చెక్కు రూపంలో ఆదివారం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు అందచేశారు. గ్రామానికి చెందిన కర్లపూడి నారాయణస్వామి ఆధ్వర్యంలో 65 వేల చెక్కు, గోరంట్ల సాంబయ్య ఆధ్వర్యంలో రూ.60 వేల చెక్కును ఏలూరికి అందచేశారు.

రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు

» రెండేళ్లు నిండిన వారికి స్థానచలనం


ఒంగోలు (క్రైం), సెప్టెంబరు 22 : రిజిస్ట్రేషన్ శాఖలో భారీగా బదిలీలు జరిగాయి. రెండేళ్లు ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. జిల్లా రిజిస్ట్రార్‌గా నెల్లూరు నుంచి ఎ.ఆంజనేయులును నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఉపేంద్రరావును విశాఖపట్నంకు బదిలీ చేశారు. ఈనెల 20న బాధ్యతలు స్వీకరించిన ఎ.ఆంజనేయులు శనివారం ఉమ్మడి ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న అటెండర్లు, జూనియర్ అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీలు చేశారు. ఆదివారం రిజిస్ట్రేషన్ శాఖ గుంటూరు ఐజీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌లు, సబ్ రిజిస్ట్రార్‌ల బదిలీలు జరిగాయి. ఒంగోలు జాయింట్ వన్ సబ్ రిజిస్ట్రార్‌గా చిలకలూరిపేటలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు, ఒంగోలు జాయింట్-2గా కావలిలో పనిచేస్తున్న కె.రాంబాబును నియమించారు. సింగరాయకొండలో పనిచేస్తున్న సిహెచ్.శ్రీనివాసరావును సంతనూతలపాడుకు, చీమకుర్తిలో పనిచేస్తున్న ఎ.వాసుదేవరెడ్డి కనిగిరి బదిలీ చేశారు. కనిగిరిలో పనిచేస్తున్న పి.గిరిజను మార్కాపురం జాయింట్-1గా, ఒంగోలు ఆడిట్‌లో ఉన్న విజయలక్ష్మిని మార్కాపురం జాయింట్-2గా స్థానచలనం కల్పించారు.

పొదిలికి గుంటూరు జిల్లా నుంచి వి.నీరజ, చీమకుర్తికి మురళీధర్, నెల్లూరు జిల్లా నుంచి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డిని అమ్మనబ్రోలుకు బదిలీ చేశారు. అమ్మన బ్రోలులో పనిచేస్తున్న సుబ్రహ్మణ్యంను పర్చూరు, అద్దంకిలో పనిచేస్తున్న ఎంబీ శ్రీనివాసరావును దర్శికి స్థానచలనం కల్పించారు. కందుకూరు నుంచి సుభాన్‌బాషాను ఎర్రగొండపాలెం, పొదిలిలో పనిచేస్తున్న ఎన్.ప్రసాద్‌ను ఒంగోలు ఆడిట్ ఆఫీస్‌కు, మార్టూరు సబ్ రిజిస్ట్రార్ ఎం.చినరామకోట య్యను కందుకూరు, ఇంకొల్లులో పనిచేస్తున్న టి.రామలతను సింగ రాయకొండ బదిలీ చేశారు. నెల్లూరు జిల్లాలో పనిచేస్తున్న నవకుమార్‌ను అద్దంకి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. సీనియర్ అసిస్టెంట్‌ల బదిలీల ప్రక్రియ రాత్రివరకూ జరుగుతోంది.

దామచర్ల వర్సెస్ బాలినేని



దామచర్ల జనార్దన్



బాలినేని శ్రీనివాసరెడ్డి

- తూటాల్లా పేలిన మాటలు
- ఫ్లెక్సీల రగడ ముగియకముందే మరో వివాదం
- జనసేనలో చేరినా వదలం : దామచర్ల
- విచారణకు సిద్ధమని ముఖ్యమంత్రికే లేఖ రాశా: బాలినేని

ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి మధ్య మాటలు తూటాల్లా పేలాయి. వైసీపీ నుంచి కూటమి పార్టీల్లో ఒకటైన జనసేనలోకి బాలినేని చేరబోయే ముందే ఈ ఇద్దరి నాయకులు మాటలతో మంటలు రేపారు. ఒకరు వదిలే ప్రసక్తే లేదని స్పష్టం చేయగా, మరొకరు విచారించుకోమని ఎప్పుడో చెప్పానని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలు జిల్లాలో చర్చనీయాంశమయ్యాయి. శనివారం ప్రారంభమైన ఫ్లెక్సీల రగడ ముగియక ముందే ఆదివారం దామచర్ల మరోసారి బాలినేనిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అయితే బాలినేని తన సహజశైలికి విరుద్ధంగా దామచర్ల వ్యాఖ్యలపై సుతిమెత్తగా వ్యాఖ్యానాలు చేశారు. ఈ ఇద్దరి నేతల మధ్య పోరు మున్ముందు కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీల మధ్య విభేదాలకు కారణమవుతాయా? అన్న అనుమానాలు మొదలయ్యాయి.

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గంలో 2012 నుంచి దామచర్ల జనార్దన్, బాలినేని శ్రీనివాసరెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో పోటీపడుతున్నారు. నాలుగు సార్లు టీడీపీ నుంచి దామచర్ల, వైసీపీ నుంచి బాలినేని పోటీ చేయగా చెరు రెండు పర్యాయాలు గెలుపొందారు. ఈ ఇద్దరి మధ్య రాజకీయ వైరం రెండు సంవత్సరాలుగా వ్యక్తిగత వైరంగా కూడా రూపాంతరం చెందింది. ఈనేపథ్యంలో సాధారణ ఎన్నికల్లో వైసీపీ నుంచి పోటీ చేసి ఓటమి చెందిన బాలినేని శ్రీనివాసరెడ్డి ఆపార్టీకి గుడ్‌బై చెప్పారు. ఈనెల 26వ తేదీన ఆయన జనసేనలో చేరబోతున్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన పార్టీలు కూటమి ప్రభుత్వంలో ప్రధాన భాగస్వాములుగా ఉన్న విషయం విదితమే. దీంతో రానున్న రోజుల్లో జిల్లాలోనూ, ప్రధానంగా ఒంగోలులోనూ ఎలాంటి రాజకీయ పరిణామాలు చోటుచేసుకుంటాయోనన్న చర్చ ప్రజానీకంలో ఆరంభమైంది. ఈదశలో శనివారం జనసేనలో చేరబోతున్న బాలినేనికి స్వాగతం చెబుతూ కొందరు ఫ్లెక్సీలు వేశారు. అందులో జనార్దన్ ఫొటో కూడా పెట్టడంపై కొందరు తెలుగుదేశం వర్గీయులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆఫ్లెక్సీలను కార్పొరేషన్ సిబ్బంది తొలగించారు. ఆవివాదం పూర్తిగా ముగియక ముందే ఆదివారం దామచర్ల జనార్దన్ తన తాత అయిన మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో బాలినేనిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బాలినేని జనసేనలో చేరినా గతంలో చేసిన అవినీతి వ్యవహారాలను వదలబోమంటూ మండిపడ్డారు. ఆతర్వాత ఒంగోలులో బాలినేని మీడియాతో మాట్లాడుతూ తాను తగ్గేది లేదన్నట్లు వ్యాఖ్యానాలు చేశారు. దీంతో రానున్న రోజుల్లో కూటమి పార్టీల మధ్య ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనన్న ఆసక్తి ఆరంభమైంది.

తండ్రీ కొడుకుల అవినీతి వెలికితీస్తాం: దామచర్ల

అవినీతి, అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు మాజీ మంత్రి బాలినేని పార్టీలు మారుతున్నారని, ఆయన జనసేనలో చేరినా వదిలే ప్రసక్తి లేదని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ స్పష్టం చేశారు. ఆదివారం టి.నాయుడు పాలెంలో జరిగిన మాజీ మంత్రి ఆంజనేయులు వర్ధంతి సభలో దామచర్ల మాట్లాడారు. అధికారంలో ఉన్న న్ని రోజులూ అందరినీ ఇబ్బందులు పెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడి వంద రోజులు గడవకముందే పార్టీ మారుతున్నారంటూ బాలినేనికి దామచర్ల చురకలు వేశారు. 'నేను కానీ, దామచర్ల కుటుంబం కానీ ఒక కమిట్‌మెంట్‌తో ఉంటాం. ఇబ్బందులు వస్తే రాజకీయాలు మానుకుంటామే తప్ప పార్టీలు మారం. బాలినేని జిల్లాను సర్వనాశనం చేశాడు. వైసీపీని భ్రష్టు పట్టించాడు. ఆయన, ఆయన కుమారుడు అనేక అవినీతి, అక్రమ వ్యవహారాలకు పాల్పడ్డారు. ఇప్పుడు పార్టీ మారి జనసేనలో చేరతారట. ఆ పార్టీలో చేరినంత మాత్రాన తప్పులు ఒప్పులు కావు. ఆయనను వదిలే ప్రసక్తే లేదు' అని దామచర్ల స్పష్టం చేశారు. 'వైసీపీ ప్రభుత్వంలో ఆయన నాపైన 33 కేసులు పెట్టారు. టీడీపీ శ్రేణులు చాలామందిపై కేసులు పెట్టించారు. ఆయన, ఆయన కుమారుడు చేసిన అవినీతి వ్యవహారాలు చాలా ఉన్నాయి. ఇవేమీ నేను మర్చిపోను. అన్నీ బయటికి తీస్తా. ఆయనకు పవన్ కల్యాణ్ అండ ఉండొచ్చు. అంతమాత్రాన మాపార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టిన వారిని వదులుతామా?' అని జనార్దన్ అన్నారు. గత ఎన్నికల్లో నాతో కలిసి కూటమి పార్టీల విజయం కోసం పనిచేసిన జనసేన, బీజేపీ వారికి నేను అండగా ఉంటానని, కాపాడుకుంటానని జనార్దన్ ప్రకటించారు.

మీరు విచారించుకోండి: బాలినేని

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 22: తనపై వచ్చిన ఆరోపణలపై విచారణకు ఎప్పుడైనా సిద్ధమని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ఇదేవిషయమై 15 రోజుల క్రితమే సీఎం చంద్రబాబునాయుడుకు కూడా లేఖ రాశానని తెలిపారు. స్థానిక లాయర్‌పేటలోని తన నివాసంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీలో తనకు ఇబ్బందులు ఉన్నందునే పార్టీ మారుతున్నట్లు తెలిపారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు తనపై మొదటి నుంచి మంచి అభిప్రాయం ఉందన్నారు. ఆయన సమక్షంలో ఈనెల 26న జనసేనలో చేరుతున్నట్లు వెల్లడించారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. ఒంగోలులో ఫ్లెక్సీలు ఎవరు ఏర్పాటుచేశారో కూడా తనకు తెలియదన్నారు. వాటిలో టీడీపీ ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఫొటోలు ఉన్నాయని తొలగించారన్నారు. ఇకపై జనార్దన్ ఫొటోలు లేకుండా ఫ్లెక్సీలు కట్టుకోవాలని మావాళ్లకు చెప్తానని బాలినేని స్పష్టం చేశారు. వైసీపీకి రాజీనామా చేసిన అనంతరం మొదటిసారిగా ఒంగోలుకు వచ్చిన బాలినేనికి అభిమానులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో గొర్రెపాటి శ్రీనివాసరావు, గోలి తిరుపతిరావు, వర్ధు శేషయ్యతోపాటు పలువురు ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే రాక్షస పాలన నుంచి విముక్తి

- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి
- మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులుకు ఘన నివాళి



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

టంగుటూరు, సెప్టెంబరు 22: 'వందరోజుల్లో ఏమీ జరగలేదని విమర్శలు చేస్తున్నారు. పాస్‌పుస్తకాల మీద నీ బొమ్మను తొలగించి, నీరాక్షస పాలన నుంచి ప్రజలను విముక్తులను చేశాం, వెయ్యి రూపాయల పింఛన్ పెంచి ఒకటో తేదీనే ఇసున్నాం..'అధికారంలోకి రాకముందు జనంలో- అధికారంలో వచ్చాక కోటలో' బతికిన నీవా మా ప్రభుత్వం గురించి మాట్లాడేదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాజీ సీఎం జగన్‌నుఉద్దేశించి తీవ్రంగా విమర్శించారు. ఆదివారం టంగుటూరు మండలంలోని తూర్పునాయుడుపాలెంలో జరిగిన మాజీ మంత్రి దామచర్ల ఆంజనేయులు వర్ధంతి సభలో గొట్టిపాటి మాట్లాడారు. జగన్ పాలన అంతా కల్తీగానే సాగిందని, ఇప్పుడు ఆ పార్టీ నాయకులతోపాటు కార్యకర్తలు కూడా జగన్‌ను విశ్వసించడం లేదని మండిపడ్డారు. ప్రకృతి విపత్తు వస్తే నీలా మా ముఖ్యమంత్రి కోటలో కూర్చోలేదని, ప్రజలకు కష్టాల్లో తోడుగా నిలిచాడని మంత్రి అన్నారు తిరుపతి వేంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని కూడా కల్తీ చేసి చరిత్రలో కల్తీ ముఖ్యమంత్రిగా మిగిలిపోయారని గొట్టిపాటి దుయ్యబట్టారు. దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు నిబద్ధత గల నాయకుడని కొనియాడారు.

సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి మాట్లాడుతూ వంద రోజుల పాలనలో చరిత్ర సృష్టించిన ఘ నత చంద్రబాబుదన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని, అందరికీ ఆదర్శప్రాయంగా ఉంటున్నారన్నారు. తిరుపతి ప్రసాదాన్ని కూడా కమిషన్ల కోసం కక్కుర్తి పడి జగన్ నాశనం చేశాడని దుయ్యబట్టారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు గొప్ప నాయకుడన్నారు. నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు మాట్లాడుతూ దామచర్ల ఆంజనేయులు ప్రజలకు గొప్పసేవలు అందించారన్నారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ విలువలతో కూడిన రాజకీయాలు చేస్తామని, తన తాతను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లో పనిచేస్తున్నామన్నారు. కష్ట, విధిలేని పరిస్థితులు వస్తే రాజకీయాలనుంచి వైదొలుగుతామేకాని, పార్టీలు మారబోమన్నారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి దామచర్ల సత్య అధ్యక్షతన జరిగిన సభలో ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఎమ్మెల్యేలు ఏలూరి సాంబశివరావు, ముత్తుముల అశోక్‌రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు పోతుల రామారావు, దివి శివరాం, ఇన్‌చార్జిలు గొట్టిపాటి లక్ష్మి, ఎరిక్షన్‌బాబు, నూకసాని బాలాజీ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి గొట్టిపాటి మరో మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామితో కలిసి గ్రామంలో నాలుగున్నర కోట్ల రూపాయలతో మంజూరైన 11కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన, రూ. 60 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. మల్లవరప్పాడు గ్రామంలో ఏర్పాటు చేసిన దివంగత సీఎం ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాల మంత్రులు, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆవిష్కరించారు.

ఎంపీడీవోల బదిలీలు

» 16 మంది ఇక్కడకు రాక » ఇతర జిల్లాలకు 16 మంది

ఒంగోలు (కలెక్టరేట్), సెప్టెంబరు 22 : ఉద్యోగోన్నతులపై పనిచేస్తున్న ఎంపీడీవోల బదిలీలు షురూ అయ్యాయి. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న జిల్లాకు చెందిన 16 మంది ఎంపీడీవోలను ఇక్కడికి, ఇక్కడ పనిచేస్తున్న ఇతర జిల్లాలకు చెందిన 16 మందిని వారి పాత జిల్లాలకు బదిలీలు చేస్తూ పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణతేజ్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎనిమిది నెలల క్రితం అప్పటి ప్రభుత్వం ఉద్యోగోన్నతులపై ఎంపీడీవోలుగా పలువురిని ఇతర జిల్లాలకు బదిలీ చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న అధికారులను అంతర్ జిల్లాలకు స్థానచలనం కల్పించేందుకు అవకాశం కల్పించింది. జిల్లా నుంచి 16 మంది ఎంపీడీవోలు బదిలీ అయ్యారు. వారిలో గుంటూరు జిల్లాకు 11 మందిని, నెల్లూరు జిల్లాకు నలుగురిని, కృష్ణా జిల్లాకు ఒకరిని బదిలీ చేశారు. ఇతర జిల్లాల నుంచి జిల్లాకు 16 మంది బదిలీపై వస్తున్నారు. వారిలో గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ఆరుగురు చొప్పున, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, విజయనగరం, చిత్తూరు జిల్లాల నుంచి ఒక్కొక్కరు జిల్లాకు రానున్నారు.

జిల్లాకు వచ్చే ఎంపీడీవోలు వీరే

చక్రపాణి ప్రసాద్, రంగనాయకులు, టీవీరభద్రాచారి, వై.మహాలక్ష్మి, ఎం.శ్రీదేవి, పి.శివ సుబ్రహ్మణ్యం, డి.ఈశ్వరమ్మ, వి.జ్యోతి, జి.శ్రీనివాసరావు, ఎం.రాజేష్‌బాబు, బి.సింగయ్య, ఎం.రంగ సుబ్బారాయుడు, బి.శ్రీనివాసులు, జి.జ్యోతిర్మయి, ఎస్‌కే మహ్మద్ అక్బర్‌జావీద్, ఎల్.కృష్ణమూర్తి జిల్లాకు రానున్నారు. ఇక్కడి జిల్లా పరిషత్‌లో జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన తర్వాత వారికి మండలాల్లో పోస్టింగ్‌లు ఇస్తారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు, సెప్టెంబరు 22: పవిత్ర పుణ్యక్షేత్రంగా వెలుగొందుతూ భక్తుల కోర్కెలు తీరుస్తున్న సోమవరప్పాడుపరిధిలో ని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆది వారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగ మ్మ తల్లికి పొంగళ్లు పెట్టి కరుణించమని వేడుకున్నారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణఅర్చకులు ఎస్.కా మేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, బాలరా జులు అమ్మవారికి పూజలు నిర్వహించారు.

వైభవంగా గణనాథుని నిమజ్జనం

తాళ్లూరు: మండలంలోని కొర్రపాటివారిపాలెంలో టీడీపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథుని నిమజ్జన ఊరేగింపు ఆదివారం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్ సాగర్ దంపతులు, ఎంపీపీ తాటి కొండ శ్రీనివాసరావు పాల్గొని గణనాథునికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, తాళ్లూరు బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటుచేసిన విగ్రహాన్ని నిమజ్జనానికి తరలించారు. ఆయా విగ్రహ కమిటీల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణనాథులను నిమజ్జనానికి తరలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ మల్లికార్జునరావు సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, మానం రమేష్‌బాబు పాల్గొన్నారు.

అధిష్ఠానం షాక్

- టీడీపీ ఎమ్మెల్యేల మధ్య ఏకాభిప్రాయం లేని పోస్టులకు కొత్త అధికారులు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు

జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలకు అధిష్ఠానం షాకిచ్చింది. వారి మధ్య ఏకాభిప్రాయం కుదరని వివిధ ప్రభుత్వ శాఖలకు అధికారుల నియామకం విషయంలో నేరుగా నిర్ణయం తీసుకుంది. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు ఒకటికి రెండు పేర్లను సూచించిన నేపథ్యంలో ఈమేరకు నిర్ణయం తీసుకుంది. ఆదివారం సాయంత్రం విడుదలైన బదిలీల ఉత్తర్వులను పరిశీలిస్తే ఈవిషయం తేటతెల్లమవుతోంది. ఆయా శాఖల జిల్లా అధికారుల పోస్టులకు ఎవరిని నియమించాలన్న అంశంపై జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలు ఒక లేఖను తయారు చేసి అటు ముఖ్యమంత్రికి, ఇటు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు ఇచ్చారు. అయితే అందులో మూడు, నాలుగు శాఖల విషయంలో ఏకాభిప్రాయంతో ముందుకెళ్లలేకపోయారు. ఒక ఎమ్మెల్యే నాయకత్వం వహించి మంత్రి స్వామి మినహా, మిగిలిన శాసనసభ్యులు, ఇన్‌చార్జిల సంతకాలతో, డీపీవో, డ్వామా పీడీ, సీఈవో లాంటి మరో ఒకట్రెండు పోస్టులకు కొందరి అధికారుల పేర్లను సూచిస్తూ అధిష్ఠానానికి లేఖ ఇచ్చారు. మంత్రి స్వామి జిల్లా పంచాయతీ అధికారి, జడ్పీ సీఈవో, డ్వామా పీడీ మరోశాఖ అధికారి విషయంలో ప్రత్యేకంగా పేర్లను సూచించినట్లు తెలిసింది. ఎమ్మెల్యేలు ఇచ్చిన సిఫారసు లేఖల్లో మంత్రి సంతకం లేని వాటిని అధిష్ఠానం పక్కన పెట్టింది. అలాగే మంత్రి పంపిన లేఖల్లో మిగిలిన ఎమ్మెల్యేల సంతకాలు లేవు. దీంతో ఆ నాలుగైదు శాఖలకు వీరు విడివిడిగా సూచించిన వారిని కాకుండా కొత్త వారిని నియమించారు. ప్రధానంగా ఒక సీనియర్ ఎమ్మెల్యే డ్వామా పీడీ, డీపీవోల నియామకంపై అధిష్ఠానం వద్ద ఒత్తిడి చేసినట్లు తెలిసింది. అయినా పట్టించుకోకుండా విడివిడిగా వచ్చిన ప్రతిపాదనలు పక్కనపెట్టి వేరే అధికారులను ఆపోస్టులకు నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు.

డీపీవోగా గొట్టిపాటి

ఒంగోలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22 : జిల్లా పంచాయతీ అధికారిగా గొట్టిపాటి వెంకట నాయుడు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఆదివారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చారు. వెంకటనాయుడు ప్రస్తుతం అనంతపురం డ్వామా ఎఫ్‌ఎంగా పనిచేస్తున్నారు. బాపట్ల ఈటీసీలో పనిచేస్తున్న శ్రీనివాసరెడ్డిని కనిగిరి డీఎల్‌డీవోగా నియమించారు.

జడ్పీ సీఈవోగా చిరంజీవి

జిల్లా పరిషత్ సీఈవోగా చిరంజీవి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం నెల్లూరు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. ఇక్కడికి డిప్యూటీ సీఈవోగా పావులూరి బాలమ్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆస్థానంలో ఇక్కడ పనిచేస్తున్న హనుమంతరావును కమిషనరేట్‌లో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు. మార్కాపురం డీఎల్‌డీవోగా పనిచేస్తున్న నాగసాయికుమార్‌ను గుంటూరు జిల్లా డీపీవోగా నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు.

డ్వామా పీడీగా జోసఫ్‌కుమార్

జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా జి.జోసఫ్‌కుమార్‌ను నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన ప్రస్తుతం గుంటూరు జడ్పీ డిప్యూటీ సీఈవోగా పనిచేస్తున్నారు. ఏలూరులో డ్వామా డీవీవోగా పనిచేస్తున్న విజయలక్ష్మి అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఇక్కడి రానున్నారు.

డీఎఫ్‌వోగా రాజశేఖర్‌రావు

జిల్లా ఫారెస్ట్ అధికారిగా కె.రాజశేఖరరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఆయన కృష్ణా జిల్లాలో పనిచేస్తున్నారు. ఇప్పటి వరకూ ఇక్కడ డీఎఫ్‌వోగా ఉన్న పి.సునీతను కృష్ణా జిల్లాకు బదిలీ చేశారు. గిద్దలూరు ఫారెస్టు డిప్యూటీ డైరెక్టర్ వైవీ నరసింహారావు చింతపల్లి డీఎఫ్‌వోగా నియమితులయ్యారు.

డీఆర్‌డీఏ పీడీ బదిలీ

డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.వసుంధర బదిలీ అయ్యారు. ఆమెను నెల్లూరు డీఎల్‌డీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఎన్నికల సమయంలో పంచాయతీరాజ్ కమిషనరేట్‌కు బదిలీపై వెళ్లిన జిల్లాకు చెందిన ఇరువురు అధికారులకు పోస్టింగ్‌లు లభించాయి. ఇక్కడ డీపీవోగా పనిచేసిన జీవీ నారాయణరెడ్డి బాపట్ల డీఎల్‌డీవోగా, జడ్పీ సీఈవోగా పనిచేసిన జాలిరెడ్డి సూళ్లూరుపేట డీఎల్‌డీవోగా నియమితులయ్యారు.

డ్వామాలో అవినీతిపై విజి'లెన్స్'

- పలు అంశాలపై వివరణ కోరుతూ పీడీకి నోటీసు
- గతంలో ప్రభుత్వానికి ఫిర్యాదు చేసిన ఈదర మోహన్

ఒంగోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)లో భారీ అవినీతి చోటుచేసుకున్నదన్న ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు దృష్టి సారించారు. జిల్లాలో 2019-24 మధ్య కాలంలో డ్వామాలో జరిగిన పలు కీలక పనులు, నియామకాలు, నిధుల వినియోగం తదితర అంశాలపై వివరణ కోరుతూ ప్రస్తుత డ్వామా పీడీకి ఒంగోలులోని విజిలెన్స్ విభాగం ఉన్నతాధికారైన అడిషనల్ ఎస్పీ కులశేఖర్ నోటీసు ఇచ్చారు. జిల్లాలో ఆ కాలంలో నాలుగున్నరేళ్లపాటు పీడీగా శీనారెడ్డి పనిచేశారు. ఆ సమయంలో పెద్దఎత్తున అవినీతి , అక్రమాలు, అధికార దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పటి వైసీపీ పెద్దల అండతో శీనారెడ్డి అక్రమాలకు పాల్పడ్డారన్న ప్రచారం సాగింది. ఇదేవిషయాన్ని గత నెలలో పలువురు ప్రభుత్వ పెద్దల దృష్టికి పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ ఈదర మోహన్ తీసుకెళ్లి విచారణ చేయాలని కోరారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ, విజిలెన్స్ ఉన్నతాధికా రులతోపాటు రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు పంపించారు. జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి తదితరులకు నిర్దిష్ట ఆరోపణలతో మోహన్ ఫిర్యాదు చేశారు. ఆ ఐదేళ్ల కాలంలో డ్వామాలో సుమారు రూ.3,383 కోట్ల మేర నిధులు ఖర్చు చేయగా దాదాపు రూ.500 కోట్లు దుర్వినియోగమైనట్లు ఆయన ఆరోపించారు. అందుకు అప్పటి పీడీ శీనారెడ్డి బాధ్యుడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రధానంగా జగనన్న కాలనీల్లో అభివృద్ధి పనులు, ఉద్యోగుల నియామకాలు, సోషల్ ఆడిట్ ఫిర్యాదుల పరిష్కారం, వ్యక్తిగతంగా వాహనాలకు అక్రమంగా బిల్లులు డ్రా చేయడం తదితర దాదాపు 20 అంశాలను ఆయన పేర్కొన్నారు. ఆ సంస్థలో పనిచేసిన మరో ఇద్దరు ముగ్గురు ఉద్యోగులు కూడా అలాగే ప్ర భుత్వ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

కాగా మోహన్ తొలుత పురందీశ్వరికి ఇచ్చిన ఫిర్యాదు ఆపార్టీ తరఫున పరిశీలన కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు పంపారు. మంత్రి స్వామి తన దృష్టికి వచ్చిన ఫిర్యాదుపై సమగ్ర విచారణ, చర్యలు కోరుతూ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్ కల్యాణ్‌కు లేఖ రాయడమేకాక స్వయంగా దాన్ని ఆయనకు ఇచ్చారు. ఎమ్మెల్యే జనార్దన్ కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు తనకు మోహన్ ఇచ్చిన ఫిర్యాదు కాపీని అందజేసి విచారణ కోరారు. ఈ నేపథ్యంలో విజిలెన్స్ విభాగం ఈ అంశంపై దృష్టి సారించింది. జిల్లాలో డ్వామా పరిధిలో 2019-24 మధ్య నిధుల వినియోగం, చేసిన ప్రధాన పనులు, చెల్లింపులు, సిబ్బంది నియామకాలు తదితర అంశాల పరిశీలనకు నిర్ణయించుకున్న విజిలెన్స్‌శాఖ సంబంధిత వివరాలను అందజేయాలని ప్రస్తుత డ్వామా పీడీని కోరారు.



డ్వామాలో అవినీతిపై విచారణ కోరుతూ మంత్రి డాక్టర్ స్వామికి ఫిర్యాదు చేస్తున్న మోహన్(ఫైల్)

శిథిలావస్థలో శింగరకొండపాలెం ఎత్తిపోతల

- గత టీడీపీ ప్రభుత్వంలో రూ.70లక్షలతో మరమ్మతులు
- వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం
- మళ్లీ మూలనపడ్డ పథకం
- 3వేల ఎకరాల ఆయకట్టుకు అందని సాగు నీరు



మూలనపడ్డ శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం

అద్దంకి, సెప్టెంబరు 22 : భవనాసి చెరువులో పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నా... టీడీపీ ప్రభుత్వ హయాంలో 70లక్షల రూపాయలతో మరమ్మతులు చేసినా వైసీపీ హయంలో నిర్వహణపై దృష్టి పెట్టకపోవడంతో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం పూర్తిగా మూలనపడి నిరుపయోగంగా మారింది. సుమారు 4 దశాబ్దాల కిందట టీడీపీ అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఎత్తిపోతల పథకాల నిర్మాణం జరిగిన సమయంలో అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం సమీపంలో భవనాసి చెరువు నీరు ఆధారంగా శింగరకొండపాలెం ఎత్తిపోతల నిర్మాణం జరిగింది. అద్దంకి మండలంలోని శింగరకొండపాలెం, కలవకూరు, బొమ్మనంపాడు, గోపాలపురం, అద్దంకి రైతులకు చెందిన సుమారు 3229 ఎకరాల ఆయకట్టుకు నీటి సరఫరా జరిగే విధంగా ఎత్తిపోతల పథకం నిర్మాణం జరిగింది. అద్దంకి మేజర్ కాలువ చివర భూములకు నీటి తడుల కోసం ఎత్తిపోతలను రూపొందించారు. దీని నుంచి అద్దంకి మేజర్ కాలువ వరకు భూమిలో పైప్‌లైన్‌లు వేశారు. పలు సందర్భాలలో ఎత్తిపోతల మోటార్‌లు మరమ్మతులకు గురికావడం, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు చోరీకి గురికావడంతో కొంత కాలం మూలన పడింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సుమారు 70లక్షల రూపాయలు వెచ్చించి మోటార్‌ల మరమ్మతులు, ఎక్కువ కెపాసిటీతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేశారు. రెండు సంవత్సరాలు నీటి సరఫరా జరిగింది. అనంతరం జగన్‌రెడ్డి పాలనలో దీని నిర్వహణపై పూర్తి నిర్లక్ష్యం వహించడంతో మూలన పడింది. దీంతో గత నాలుగైదు సంవత్సరాలుగా నీటి విడుదల జరగకుండా నిరుపయోగంగా మారింది. ఎత్తిపోతల పథకం ప్రాంతం మొత్తం చిట్టడవిని తలపించేలా మారింది. పైప్‌లైన్‌లు కూడా దెబ్బతిని ఉండడంతో నీటి సరఫరా కూడా అం తంతమాత్రంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రకటించడంతో శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకం ఆయకట్టు రైతులలో ఆశలు చిగురించాయి. భవనాసి చెరువు రిజర్వాయర్‌గా మారే క్రమంలో ఎత్తిపోతల పథకం మోటార్‌లు ముంపునకు గురయ్యే అవకాశం ఉండడంతో పునఃనిర్మాణ చేపట్టేందుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. రవికుమార్ మంత్రిగా ఉండడంతో ప్రత్యేక దృష్టి సారించి శింగరకొండపాలెం ఎత్తిపోతల పథకాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకు రావాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



దట్టంగా పెరిగిన చెట్లు



చెట్ల మధ్య ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు



మాట్లాడుతున్న అర్చకులు

ప్రసాదంలో కల్తీ అపచారం

బాపట్ల అర్చక సంక్షేమ సంఘం

చీరాలటౌన్, సెప్టెంబరు 22 : స్వామి వారి నిత్య ప్రసాదంలో కల్తీకి పాల్పడి ఘోర అపచారానికి పాల్పడ్డారని బాపట్ల జిల్లా సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం చీరాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో అర్చకులు మాట్లాడారు. పరమ పవిత్రమైన తిరుమల క్షేత్రంలో స్వామి వారి లడ్డూ ప్రసాదంలో కమీషన్‌లకు కక్కుర్తిపడి జంతు వ్యర్థాలతో కల్తీకి దారి తీశారన్నారు. ఘటనతో తీవ్రంగా వారి మనోభావాలు దెబ్బతిన్నట్లు వివరించారు. కారకులెవరైనా సరే కఠిన శిక్షలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కోశాధికారి వేదాంతం కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి దిట్టకవి వాసుదేవ సంపత్ కుమార్, మూలంరాజు రాజ్‌కుమార్, నారాయణం శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

సుందరరామిరెడ్డి సేవలు ప్రశంసనీయం

చీరాల, సెప్టెంబరు 22 : వ్యాయామ ఉపాధ్యాయుడిగా సుందరరామిరెడ్డి సేవలు ప్రశంసనీయమని ఆంధ్రప్రదేశ్ హాకీ ఫెడరేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.నిరంజనరెడ్డి అన్నారు. పేరాల గోలి సదాశివరావు కల్యాణ మండపంలో ఆదివారం వ్యాయామ ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ చేసిన సుందరరామిరెడ్డిని, పద్మావతి దంపతులను ఘనంగా సన్మానించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ హాకీ క్రీడకు వివిధ దశల్లో సుందరరామిరెడ్డి నైపుణ్యత కలిగిన క్రీడాకారులను అందించడంలో ప్రత్యేకత చాటుకున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీకామాక్షి కేర్ హాస్పటల్ ఎండీ డాక్టర్ తాడివలస దేవరాజ్, వెంకటేశ్వరరావు, కుర్రా రామారావు, కృష్ణమోహన్, వెలుగొండ రెడ్డి, వీరాంజనేయులు, ఏడుకొండలు, పవని భానుచంద్రమూర్తి, ధన, ప్రకాష్ పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిలిపిన వాహనాలు

ప్రాంగణమే పార్కింగ్

- తహసీల్దార్ కార్యాలయం ముందు యథేచ్ఛగా వాహనాల నిలిపివేత
- ఉద్యోగులు, సిబ్బందికి ఇబ్బందులు

చీరాల, సెప్టెంబరు 22 : తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం పార్కింగ్ స్థలంగా మారింది. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీడీవో కార్యాలయం, ఎన్‌ఆర్‌ఈజీఎస్, సబ్ ట్రెజరీ, మీసేవా కేంద్రాలు ఉన్నాయి. రోజు ఆయా కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చే వారి సంఖ్య గణనీయంగా ఉంటుంది. వాహనాలపై వచ్చే వారి సంఖ్య ఎక్కువ. అయితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చే వారిలో ఎక్కువ మంది తమ కార్లు, ద్విచక్ర వాహనాలను తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్క్ చేస్తున్నారు. దీంతో కార్యాలయ ఉద్యోగులు, కార్యాలయాలకు వివిధ పనులపై వచ్చేవారు తమ వాహనాలను పార్క్ చేసుకునేందుకు కొన్ని సందర్భాల్లో ఖాళీ జాగా లేక ఇబ్బంది పడుతున్నారు. ఆయా కార్యాలయ అటెండర్లు వారు చూచినపుడు ఇతర వాహనాలను తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నిలపకుండా వారిస్తున్నారు. అయినప్పటికీ వారి లేని సమయంలో వెలుపల వ్యక్తుల వాహనాలను నిలపడంతో కొన్ని సందర్భాల్లో కార్యాలయ పనులపై వచ్చే వారు తమ వాహనాలు నిలుపే ్ర లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు, కార్యాలయాలకు పనులపై వచ్చే వారి కాకుండా , ఇతర వ్యక్తులు అక్కడ వాహనాలు నిలపకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రవీంద్ర



అద్దంకి, సెప్టెంబరు 22 : అద్దంకి మున్సిపాలిటీ మున్సిపల్ కమిషనర్‌గా డి.రవీంద్రను నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అద్దంకి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న సత్యనారాయణను ఏలేశ్వరం మున్సిపాలిటీ కమిషనర్‌గా బదిలీ చేశారు. అద్దంకి మున్సిపాలిటీలో సుదీర్ఘకాలం నుంచి శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఎం.శ్రీనివాస రెడ్డిని మైదుకూరు మున్సిపల్ కమిషనర్‌గా బదిలీ చేశారు. కొత్తగా వస్తున్న కమిషనర్ రవీంద్ర ఒంగోలు కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశారు.

కారుపైకి దూసుకెళ్లిన బైకు

- ఎగిరి కిందపడిన వెనుక కూర్చున్న విద్యార్థి
- ఇద్దరికి తీవ్ర గాయాలు, ఒకరు గుంటూరు తరలింపు



అపస్మారక స్థితిలో ఫిలిప్



గాయాలతో ఉన్న మహేష్

చీరాలటౌన్, సెప్టెంబరు 22 : ఆదివారం మధ్యాహ్నం ఇద్దరు మైనర్‌ల ద్విచక్ర వాహనం కారుపైకి దూసుకెళ్లింది. వివరాల్లోకి వెళితే చీరాల పరిధిలోని రోశయ్య కాలనీకు చెందిన వేటగిరి మహేష్ కొత్తపేట ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదవుతున్నాడు. అలాగే అదే ప్రాంతానికి చెందిన ఎండేటి ఫిలిప్ కూడా అదే పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదవుతున్నాడు. వీరు ఇంటినుంచి చీరాలకు వెళ్లేందుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరారు. మహేష్ హెల్మెట్ ధరించి బండి నడుపుతుండగా ఫిలిప్ వెనుక కూర్చున్నాడు. వీరి ఇంటి సమీపంలో మట్టి రోడ్డు నుంచి ప్రధాన రహదారిలోకి వస్తూ రామాపురం నుంచి చీరాల వైపు వస్తున్న గోపీరాజు కారును సైడ్ నుంచి వేగంగా ఢీ కొట్టారు. ప్రమాదంలో వెనుక కూర్చున్న ఫిలిప్ ఎగిరి కారు అద్దంపై పడ్డాడు. మహేష్ హెల్మెట్ సైతం ఎగిరి పడగా ఇద్దరు తీవ్ర రక్త గాయాలపాలయ్యారు. దీంతో కారు డ్రైవర్ గోపీరాజు వీరిని స్థానికుల సహకారంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఫిలిప్‌ను గుంటూరుకు తరలించగా, మహేష్ చీరాల ఏరియా హాస్పిటల్లోనే చికిత్స పొందుతున్నాడు. దీంతో సమాచారం అందుకున్న టూటౌన్ ఎస్సై శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

బల్లికురవ, సెప్టెంబరు 22 : ఎరువులను ఎవరైనా బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఏవో కుమారి హెచ్చరించారు. ఆదివారం మండలంలోని కొమ్మినేనివారిపాలెం, కొప్పెరపాడు, గొర్రెపాడు, కూకట్లపల్లి గ్రామాలలో ఉన్న ఎరువుల దుకాణాలను ఏవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎరువుల స్టాక్, రికార్డులను ఆమె తనిఖీ చేశారు. ఎమ్మార్పీ ధరకే ఎరువులను విక్రయించాలన్నారు. రైతులు కొన్న ప్రతి దానికీ బిల్లును తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. లైసెన్స్‌లు లేకుండా అమ్మితే కేసులు తప్పవన్నారు. యూరియా రూ.266, డీఏపీ రూ.1350 ధరకు విక్రయించాలని ఏవో కుమారి సూచించారు.

మోపెడ్ ఢీకొని ముగ్గురికి గాయాలు

ఇంకొల్లు, సెప్టెంబరు 22 : మద్యం సేవించి స్కూటీ నడుపుతూ నడిచివెళ్తున్న వారిని ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం వేకువజామున పావులూరు రోడ్డులో జరిగింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మురుకొండ సింగయ్య, గోరంట్ల నాగేశ్వరరావు, భద్రయ్య ముగ్గురు పావులూరు రోడ్డులో వాకింగ్ చేస్తున్నారు. వీరిపైకి ఒక్కసారిగా స్కూటీ వచ్చి ఢీకొట్టింది. ప్రమాదంలో సింగయ్య తలకు గాయాలు కాగా, మిగిలిన ఇద్దరు స్వల్పంగా గాయపడ్డారు. స్కూటీ నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని అక్కడే విడిచి పరారయ్యారు. పోలీసు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పావులూరులో నేత్రదానం

ఇంకొల్లు, సెప్టెంబరు 22 : మండలంలోని పావులూరులో నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన మరెళ్ల కోటిరెడ్డి (95) మృతి చెందగా, ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ వారి ఆధ్వర్యంలో గుంటూరు శంకర కంటి ఆసుపత్రి వైద్యులు నేత్రాలను సేకరించారు. ఇందుకు సహకరించిన కుటుంబ సభ్యులను కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి స్వామి, రోటరీ అధ్యక్షుడు రఫి అభినందించారు.

భర్త, అత్త వేధింపులపై కేసు

అద్దంకి, సెప్టెంబరు 22 : అదనపు కట్నం కోసం భర్త, అత్త వేధింపులకు గురి చేస్తున్నారని గోపిశెట్టి అనూష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ప్రవీణ తెలిపారు. అద్దంకి పట్టణంలోని రామ్‌నగర్‌కు చెందిన అనూషకు 11 సంవత్సరాల కిందట ఒంగోలు పట్టణంలోని పేర్నమిట్టకు చెందిన గోపిశెట్టి అనిల్‌కుమార్‌తో వివాహం జరిగింది. ఒక పాప కూడా ఉంది. భర్త అనిల్ కుమార్ మద్యం సేవించి వచ్చి అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని, కొడుతున్నారని, అత్త రమణమ్మకు చెప్పినా సూటిపోటి మాటలతో చిత్రహింసలకు గురిచేస్తుందని అనూష ఆదివారం అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి ఘటనపై కేసు

ఈపూరుపాలెం(చీరాలటౌన్), సెప్టెంబర్ 22 : ఇంటర్ విద్యార్థిపై దాడికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై ఈపూరుపాలెం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామంలోని కుమ్మరి వారి వీధికి చెందిన కొడాలి చంద్రశేఖర్ గత శనివారం రాత్రి సమయంలో అదే గ్రామంలోని మార్కెట్ సమీపంలో పానీపూరీ తింటున్నాడు. ఈక్రమంలో ముగ్గురు యువకులు మద్యం మత్తులో అక్కడికి వచ్చారు. చంద్రశేఖర్‌తో గొడవ పడ్డారు. వెంటనే రాయితో తలపై, శరీరంపై దాడి చేశారు. దీంతో చంద్రశేఖర్ తలకు తీవ్ర గాయమైంది. బాధితుడు చీరాల ఏరియా వైద్యశాలలో చేరి చికిత్స పొందాడు. ఈ ఘటనపై ఈపూరుపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



భారీ ఊరేగింపుగా నిమజ్జనానికి తరలివెళ్తున్న గణనాథుడు

ముగిసిన వినాయక నిమజ్జన వేడుకలు

పర్చూరు, సెప్టెంబరు 22 : వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రతిమలను మూడు, ఐదు, తొమ్మిది రోజుల సందర్భంగా నిమజ్జనాలు చేశారు. మిగిలి ఉన్న విగ్రహాలను ఆదివారం వైభవంగా నిమజ్జనాలు చేశారు. పర్చూరులోని టీనగర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాన్ని భారీ ఊరేగింపు నడుమ డీజే, బాణసంచా కాల్చుతూ భక్తులు నిమజ్జనానికి చీరాల వాడరేవుకు తరలించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో పర్చూరు బొమ్మల సెంటర్ కిటకిటలాడింది. పండుగ వాతావరణం కన్పించింది. ఎలాంటి వివాదాలకు తావులేకుండా పోలీసుల పర్యవేక్షణలో నిమజ్జన ఊరేగింపు కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది.

సాహిత్య ప్రతిభామూర్తులకు పురస్కారాలు



సత్కారం అందుకున్న సాహితీ వేత్తలు

చీరాలటౌన్, సెప్టెంబరు 22 : ఆధునీకీకరణలో కూడా సాహితీ, సాంస్కృతిక రంగాల్లో నిరంతరంగా అంకితమవుతున్న ప్రతిభామూర్తులను సత్కరించుకోవడం ఆనందదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం రోటరీ క్లబ్‌లో సహజ సాహితీ చీరాల వారి ఆధ్వర్యంలో పురస్కారాల ప్రదానోత్సవం నిర్వహించారు. సభాధ్యక్షులుగా కోడూరి ఏకాంబరేశ్వరబాబు వ్యవహరించగా ముఖ్య అతిథులుగా బండారుపల్లి హేమంత్‌కుమార్, పోలుదాసు రామకృష్ణ హాజరయి ఉపన్యసించారు. ప్రతినిధులు బత్తుల బ్రహ్మారెడ్డి, నూనె అంకమ్మరావు, గాడేపల్లి దివాకరదత్, అన్నపురెడ్డి వీరారెడ్డి, రాజేంద్రప్రసాద్, భాగి కృష్ణమూర్తి, అక్కిరెడ్డి, వెంకట రమణారెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో వడలి రాధాకృష్ణ, వెంకటేశ్వరరావు, సీతారామాంజనేయ శర్మ, దయాకరరెడ్డి, పవని భానుచంద్రమూర్తి, నాగమాంబ హాజరయ్యారు.

జ్వరాలు తగ్గాలని గ్రామదేవతకు పొంగళ్లు



గ్రామోత్సవంగా వెళ్తున్న భక్తులు

బల్లికురవ, సెప్టెంబరు 22 : మూడు నెలలుగా ముక్తేశ్వరం గ్రామాన్ని విష జ్వరాలు వణికిస్తున్నాయి. ప్రతి ఇంటిలోనూ కుటుంబ సభ్యులు జ్వరాలతో మంచంపట్టారు. జ్వరాలు తగ్గినట్టే తగ్గి మళ్లీమళ్లీ విజృంభిస్తున్నాయి. దీంతో గ్రామానికి చెందిన ప్రజలు సమిష్టిగా దేవుడే తమకు దిక్కు అని గ్రామ దేవత పోలేరమ్మకు ఆదివారం ప్రజలు పొంగళ్లు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి పొంగలి, చద్ది చేసుకొని భక్తులు గ్రామోత్సవంగా పోలేరమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకొన్నారు. తమను కాపాడాలని వేడుకొన్నారు. విష జ్వరాలబారిన పడి తాము పడుతున్న ఇబ్బందులు తీర్చాలని మొక్కుకున్నారు. అనంతరం బొడ్డురాయికి బిందెలతో నీటిని పోశారు. గతంలో ఎన్నో ఏళ్ల కిందట కూడా ఇలాగే పూజలు నిర్వహించామని గుర్తు చేశారు. గ్రామంలో సీజనల్ వ్యాధులు పెరినందువల్లే అమ్మవారికి పొంగళ్లు పెట్టామని గ్రామ పెద్దలు తెలిపారు. అనంతరం గ్రామస్థులు కుటుంబాలవారీగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మహిళ భక్తులు అమ్మవారికి కుంకుమ పూజ నిర్వహించారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి సాయం

మార్టూరు, సెప్టెంబరు 22 : మండలంలోని చిమ్మిరిబండ గ్రామానికి చెందిన బొంతా సురేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. దాంతో అతని వైద్య ఖర్చులు నిమిత్తం చారిటీ బాక్స్ సంస్థ అధ్యక్షుడు లక్కోజి నూకరాజు రూ.10వేల సాయాన్ని అందజేశారు. అలాగే సంస్థ ప్రతినిధులు గ్రామస్థుల నుంచి సేకరించిన రూ.55వేలను బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు రావినూతల యోహాను, శ్రీధర్, రవి, సింగారావు పాల్గొన్నారు.

లక్ష మందికి కంటి ఆపరేషన్‌లే లక్ష్యం

- రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు
- ఎమ్మెల్యే ఏలూరి
- వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఏలూరి

పర్చూరు, సెప్టెంబరు 22 : చూపును కోల్పోయి పేదరికంలో ఉన్న రోగులకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు నిర్వహించి వారి జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. ఆదివారం వైఆర్ హైస్కూల్ ప్రాంగణంలో ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, సేవ అగ్రిటెక్ సౌజన్యంతో శంకర్ కంటి వైద్యశాల బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. తొలుత స్వర్గీయ నందమూరి తారక రామారావు, కీర్తిశేషులు ఏలూరి నాగేశ్వరరావు చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవే లక్ష్యంగా తన తండ్రి నాగేశ్వరరావు జ్ఞాపకార్థం ఏలూరి ట్రస్ట్ ద్వారా 13 ఏళ్లుగా ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే 200లకు పైగా క్యాంపుల ద్వారా వేలాది మందికి శస్త్ర చికిత్సలు చేయించామన్నారు. రాజకీయాలకు అతీతంగా లక్ష మందికి కంటి చూపును ఇవ్వడమే తన లక్ష్యమని ఏలూరి స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో సేవా కార్యక్రమాలను కూడా రాజకీయం చేసిందని, కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేందుకు అనుమతులను నిరాకరించిందని ఏలూరి గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా సేవే పరమావధిగా ముందుకు సాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల పార్లమెంట్ తెలుదేశం పార్టీ అధ్యక్షుడు సలగల రాజశేఖర్‌బాబు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెదపూడి విజయ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు దాసరి ఉషారాణి, కారుమూరి కృష్ణ ప్రజా కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు

600 మందికి వైద్య పరీక్షలు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఆయా గ్రామాల నుంచి 600లకు పైగా రోగులు పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. పెద్ద ఎత్తున రోగులు తరలి రావడంతో ప్రాంగణం కిక్కిరిసింది. రోగులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. వైద్య పరీక్షలు అనంతరం రోగులకు భోజన వసతిని కూడా కల్పించారు. వైద్య పరీక్షలకు హాజరైన రోగులను ఏలూరి ఆప్యాయంగా పలుకరించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ముఖ మండపానికి రూ.లక్ష విరాళం

అద్దంకి, సెప్టెంబరు22: శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం రాతి ముఖ మండపం నిర్మాణానికి నెల్లూరు జిల్లా కలిగిరి మండలం లక్ష్మీపురానికి చెందిన చుండూరి వీరయ్య జ్ఞాపకార్థం భార్య సుబ్బాయమ్మ, కుమారుడు సుబ్బారావు రూ.లక్షను ఆదివారం దేవాలయ సిబ్బంది శ్రీనివాసరావు కు అందజేశారు.

రేపటి నుంచి పొలంపిలుస్తోంది

అద్దంకి, సెప్టెంబరు 22 : పొలం పిలుస్తోంది కార్యక్రమాలు మంగళవారం నుండి ప్రారంభమవుతాయని మండల వ్యవసాయాధికారి కొర్రపాటి వెంకట కృష్ణ తెలిపారు. మంగళవారం ఉదయం ధర్మవరం, సాయంత్రం శంఖవరప్పాడు, బుధవారం ఉదయం కలవకూరు, సాయంత్రం శింగరకొండపాలెం లో జరుగుతాయని తెలిపారు.

వాగు గండ్లు పూడ్చివేత

- రైతుల విన్నపానికి స్పందించిన ఎమ్మెల్యే
- ఏలూరి సూచనలతో పనులు ప్రారంభం



ఎక్స్‌కవేటర్‌తో గండ్లు పూడుస్తున్న సిబ్బంది

పర్చూరు, సెప్టెంబరు 22 : గతంలో తుఫాన్ కారణంగా కారంచేడు మండల పరిధిలోని రామానాయుడు వారధి సమీపంలోని వాగుకు గండ్లు పడ్డాయి. అప్పటి నుంచి గండ్లు పూడ్చలేదు. దీంతో రైతులు గండ్లు పూడ్చకపోతే పొలాలకు ముంపు తప్పదని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఏలూరి వారధి సమీపంలోని జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌కు మరమత్తులు చేయాలని సూచించారు. వారు గండ్లను పూడ్చివేసే పనులు చేపట్టారు. టీడీపీ నేతలు పోతిన ఉదయ్, రావూరి సుబ్బారావు తదతరులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి



మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంగరాజు

చీరాల, సెప్టెంబరు 22 : ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొడుగుల గంగరాజు అన్నారు. మండల పరిధిలోని సాల్మన్ సెంటర్ పంచాయతీ పరిధిలో ఆదివారం జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గంగరాజు మాట్లాడుతూ 100 రోజుల పాలనలో ప్రజలకు చేకూరిన ప్రయోజనాలు, జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రజల కోసం పనిచేసేదన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.


రాజుపాలెంలో

రెండు సీసీ రోడ్లకు శంకుస్థాపన

మార్టూరు : మండలంలోని రాజుపాలెం గ్రామంలో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రూ.10లక్షల వ్యయంతో నిర్మించనున్న రెండు సిమెంట్ రోడ్లకు ఎంపీడీవో జీ నితిన్ శంకుస్థాపన చేశారు. అంతకుముందు గ్రామంలో కూటమి ప్రభుత్వం వంద రోజులలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ అధికారులు, టీడీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు. తరువాత గ్రామసభను నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ జాష్టి వెంకటనారాయణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అడుసుమల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గర్నెపూడి కోటమ్మ, ఆళ్ల సాంబయ్య పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నాగరాజుపల్లిలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మురళి కృష్ణ, మిన్నెకంటి రవికుమార్, పోతురాజు, సాంబశివరావు, సర్పంచ్ దాసరి నరేంద్రబాబు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ఎంపీడీవో నితిన్, నాయకులు



జిల్లాలో భారీగా బదిలీలు

- ముగిసిన గడువు.. పలువురు అధికారులకు స్థానచలనం

నెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ఆదివారంతో ముగిసింది. చివరి రోజున భారీగా బదిలీలు జరిగాయి. సెలవు రోజు అయినా ప్రధానమైన శాఖల నుంచి బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆగస్టు నెలాఖరుతోనే బదిలీలకు గడువు ముగిసినా విజయవాడ వరదల నేపథ్యంలో గడువును సెప్టెంబరు 22వ తేదీ వరకు పొడిగించారు. ఐదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని తప్పనిసరిగా బదిలీ చేయగా, మిగిలిన వారిని రిక్వెస్ట్ పద్ధతిలో బదిలీ చేశారు. కీలకమైన జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీఏ పీడీ వంటి పోస్టుల్లోని అధికారులకు స్థానచలనం కలిగింది. మరికొన్ని శాఖలకు సంబంధించి జిల్లా స్థాయిలో బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. కీలకమైన ఇరిగేషన్ శాఖలో జీవో వెలువడినా జాబితాను విడుదల చేయలేదు. ఒకటి, రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. సోమవారం దాదాపుగా బదిలీలు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జడ్పీ సీఈవోగా ఖాదర్‌బాషా

నెల్లూరు (జడ్పీ) : జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో చిరంజీవులు బదిలీ అయ్యారు. సీఈవో కన్నమనాయుడిని కృష్ణాజిల్లా సీఈవోగా నియమించగా, ఆయన స్థానంలో డ్వామా ఏపీడీగా ఉన్న ఖాదర్‌బాషాను జడ్పీ సీఈవోగా నియమించారు. డిప్యూటీ సీఈవో చిరంజీవిని, ఒంగోలు సీఈవోగా బదిలీ చేశారు. డీపీవో సుస్మితారెడ్డిని శ్రీకాళహస్తి డీఎల్‌డీవోగా బదిలీచేశారు. వెయిటింగ్‌లో ఉన్న శ్రీధర్‌రెడ్డిని డీపీవోగా నియమించారు. అలాగే డ్వామా పీడీ వెంకట్రావును బదిలీచేసి, ఆయన స్థానంలో చిత్తూరు పీడీ గంగాభవానీని నియమించారు.

విద్యుత్‌శాఖలో..

జిల్లాలో విద్యుత్‌శాఖలో ఏఈలు, జూనియర్ ఇంజనీర్లు, జూనియర్ అకౌంట్ అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను బదిలీచేస్తూ ఎస్ఈ విజయన్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. 38మంది ఏఈలు, 12మంది జూనియర్ ఇంజనీర్లు, నలుగురు జూనియర్ అకౌంట్ అధికారులు, 12మంది సీనియర్ అసిస్టెంట్లు, 26మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు.

డీఆర్‌డీఏ పీడీగా నాగరాజకుమారి

నెల్లూరు(హరనాథపురం) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ)గా నాగరాజకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం డీడబ్ల్యూఎంఏలో ఫైనాన్సు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పీడీగా పనిచేస్తున్న కేవీ సాంబశివారెడ్డిని మాతృశాఖ అయిన పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌లో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన మూడేళ్ల ఎనిమిది నెలలపాటు పీడీగా పనిచేశారు. డీఆర్‌డీఏలో ఎక్కువ కాలం పనిచేసిన విజయకుమార్ తరువాత రెండో పీడీగా సాంబశివారెడ్డి గుర్తింపు పొందారు.

రెవెన్యూ శాఖలో...

తహసీల్దార్లు ఆరుగురు, డిప్యూటీ తహసీల్దార్లు 55 మంది, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు 17 మంది, సీనియర్ అసిస్టెంట్లు 70 మంది, జూనియర్ అసిస్టెంట్లు 27 మంది బదిలీ అయ్యారు.

అటవీశాఖలో ఇద్దరు డీఎఫ్‌వోల బదిలీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం): జిల్లా అటవీశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్‌ను అనంతపురం జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా తిరుపతి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జీ.ధర్మరాజును నియమించారు. నెల్లూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఆర్.శ్రీనివాసరెడ్డిని లక్కవరం సబ్ డీఎఫ్‌వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కడప సామాజిక వన విభాగం డీఎఫ్‌వో ఉన్న ఎం.నాగార్జునరెడ్డిని నియమించారు. అయితే డీఎఫ్‌వోగా ఐఎఫ్ఎస్ అధికారి నియమించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఉదయగిరి రేంజర్‌గా ఉన్న ఉమమహేశ్వరరెడ్డిని ప్రకాశం జిల్లా కనిగిరి రేంజ్‌కి బదిలీ చేశారు. ఆయన స్థానంలో గిద్దలూరు టైగర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న బీఎస్ కుమార్‌రాజాను నియమించారు. కొంతకాలంగా ఖాళీగా ఉన్న కావలి రేంజ్‌కు ప్రకాశం జిల్లా కనిగిరి రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న రామిరెడ్డిని బదిలీ చేశారు. అలాగే నెల్లూరు అటవీశాఖ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా పని చేస్తున్న దుర్గాప్రసాద్‌ను, గుంటూరు సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు కార్యాలయంలో విధుల్లో ఉన్న బీ కృష్ణనాయక్‌ను నియమించారు. నెల్లూరు టెరిటోరియల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న పుష్పవతిని చిత్తూరు సోషల్ ఫారెస్ట్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మార్కాపురం డివిజన్‌లో పని చేస్తున్న వెంకటకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

దుస్తులు రంగు వెలశాయా.. షూ సరిపోలేదా ?

- వాటి నాణ్యత ఎలా ఉంది...
- స్టూడెంట్స్ కిట్లపై విద్యాశాఖ అభిప్రాయ సేకరణ
- నాణ్యతతో కూడిన వస్తువులు ఇచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు

నెల్లూరు (విద్య): జిల్లాలో పంపిణీ చేస్తున్న స్టూడెంట్స్ కిట్స్ ఎలా ఉన్నాయి..? వాటి నాణ్యత ఏమిటన్న అంశాలపై విద్యాశాఖ అభిప్రాయ సేకరణ చేపడుతోంది. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖ వాట్సాప్‌ల ద్వారా ఫార్మాట్‌ను నింపాలని ఆదేశించింది. స్టూడెంట్స్ కిట్స్-5 ఫీడ్‌బ్యాక్ ఫామ్ పేరుతో ఇంటర్నెట్ ద్వారా సర్వే చేపట్టింది. ఆయా లింక్‌లను అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు పంపించి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.

నాణ్యత గురించి చెప్పనవసరం లేదు..




గత వైసీపీ ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరుతో ఇచ్చిన స్టూడెంట్స్ కిట్స్ నాణ్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని ఉపాధ్యాయు లు అంటున్నారు. ప్రతి ఏడాది వారు ఇచ్చిన ఏకరూప దుస్తులు రంగులు వెలిసిపోవడం, నెలవ్య వధిలోనే చినిగిపోవడంతో వాటిని ధరించడంలేదు. బ్యాగులైతే ఇచ్చిన రెండు నెలలకే మూలకు చేరడం, షూలు ఏమాత్రం సరిపోకపోవడం, సైజుల్లో తేడాలు రావడం, వాటిని సరిదిద్దమని వెనక్కు పంపితే ఏడాది పొడవునా రాకపోవడం లాంటి పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఏ మాత్రం నాణ్యత లేని స్టూడెంట్స్ కిట్స్‌పై కూటమి ప్రభుత్వం దృష్టి సారిం చింది. అందరి అభిప్రాయ సేకరణ పూర్తి చేసి దుస్తుల రంగులు మార్చడంతోపాటు బ్యాగుల పరిణామం, నాణ్యత కలిగిన షూలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

అస్తవ్యస్తంగా కిట్స్

కొలతలు ప్రకారం పంపాల్సిన ఏకరూప దుస్తులను అరకొరగా అందించడంతో మూడు జతలు ఇవ్వాల్సిన వస్త్రం దుస్తులు కుట్టేసరికి రెండు జతలకే సరిపోతున్నది. బూట్ల కోసం ఉపాధ్యాయులు శ్రమించి స్కేలుతో విద్యార్థుల వారీగా కచ్చితమైన కొలతలు ఇచ్చినా కూడా ఒక్క ఏడాది కూడా సరిపడా సైజులు ఇచ్చిన సందర్భాలు లేవు. ఈ సమస్యలను అధిగమించి నాణ్యతతో కూడిన కిట్లను అందించడానికి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సర్వే ప్రారంభించింది. ప్రధానోపాధ్యాయులంతా ఫీడ్ బ్యాక్ సర్వే పత్రాలు అందుకున్న వెంటనే వారి అభిప్రాయాలతో అంతర్జాలంలో వెంటనే తిరిగి సమర్పిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

టీడీపీలోకి బుచ్చి చైర్‌పర్సన్

- ఆమెతోపాటు ఆరుగురు కౌన్సిలర్లు కూడా..
- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు
- 'దేశం'వశమైన నగర పంచాయతీ



నెల్లూరులో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, అబ్దుల్ అజీజ్ సమక్షంలో టీడీపీలో చేరిన చైర్‌పర్సన్ సుప్రజ, కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 22 : బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతోపాటు ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు ఆదివారం సైకిలెక్కారు. సుప్రజ, మురళి దంపతులతోపాటు కౌన్సిలర్లు కత్తి నాగరాజు, పఠాన్ నస్రీన్, రాచూరి సత్యం, చీర్ల ప్రసాద్‌యాదవ్, రహమత్, శ్రీదేవిలకు మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ వీపీఆర్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ వీరి చేరికతో బుచ్చి నగర పంచాయతీ టీడీపీ వశమైందన్నారు. చైర్‌పర్సన్ సుప్రజ మాట్లాడుతూ నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని నగర పంచాయతీని రానున్న ఐదేళ్లలో మంత్రి నారాయణ సహకారంతో ప్రగతిపథంలో దూసుకెళ్తుందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై కన్ను

- భూముల పంపిణీపై విచారణకు ప్రభుత్వం ఆదేశం
- ఫ్రీహోల్డ్ భూములపై లోతుగా ఎంక్వైరీ
- నేరుగా రంగంలోకి జేసీ, ఆర్డీవోలు
- గతంలో గ్రామసభలు లేకుండానే జాబితా సిద్ధం
- పేదల మాటున వైసీపీ నేతలకు దోచిపెట్టిన వైనం



భూపంపిణీలో అవకతవకలపై పొదలకూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరుపుతున్న జేసీ కార్తీక్ (ఫైల్)

నెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఅక్రమాల డొంక కదులుతోంది. నాడు అధికారమే పరమావధిగా ప్రభుత్వ భూములను దోచిపెట్టారు. భూములున్న వ్యక్తులకు కూడా పేదల మాటున ధారాదత్తం చేశారు. చెరువు, కాలువ, కొండ పోరంబోకు భూములను కూడా కట్టబెట్టారు. ఫ్రీహోల్డ్ పేరుతో వేల ఎకరాల ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా 22-ఏ నుంచి భూములను తొలగించి వైసీపీ నేతలకు కట్టబెట్టినట్లు మొదటి నుంచీ ఆరోపణలున్నాయి. అసలు గ్రామసభలు లేకుండానే భూపంపిణీ, ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరింది. అప్పట్లోనే ఈ అక్రమాలపై అనేక ఫిర్యాదులు అందినా నాటి మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో ఉన్నతాధికారులు మిన్నకుండిపోయారు.

కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడంతో భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇప్పటికే ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసిన ప్రభుత్వం, తాజాగా అసలు నిబంధనల ప్రకారం ఈ భూములకు ఫ్రీహోల్డ్ కల్పించారా..? అన్నది విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించింది. అదే సమయంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఎమ్మెల్యేల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించింది.

విచారణ ప్రారంభం

గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించి 22-ఏ జాబితా నుంచి తొలగించిన భూములపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాక రిజిస్ట్రేషన్లు జరిగిన భూములను తొలుత పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన డేటాను జిల్లా ఉన్నతాధికారులు తెప్పించారు. జేసీ కార్తీక్‌తో పాటు ఆర్డీవోలు ప్రత్యక్షంగా ఈ విచారణలో పాల్గొంటున్నారు. విచారణకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను భూపరిపాలన విభాగం జిల్లా అధికారులకు పంపింది. కాగా అసైన్‌మెంట్ భూముల పంపిణీలో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యేల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. చెరువు, కొండ కాలువ పోరంబోకు భూములను కూడా అసైన్‌మెంట్ పేరుతో కట్టబెట్టినట్లు ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫ్రీహోల్డ్ భూములతో పాటు అసైన్‌మెంట్ భూములను కూడా ఏక కాలంలో విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

పేదల మాటున దోచిపెట్టారు

అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ గతేడాది నవంబ రులో జరిగింది. అంతకు ఆరునెలల ముందు నుంచే అర్హుల జాబితా సిద్ధం చేయడం మొదలైంది. మూడు వర్గాల వారికి పట్టాలు పంపిణీ చేశారు. భూమి లేని నిరు పేదలు ఎవరైతే ప్రభుత్వ భూములను సాగు చేసు కుంటున్నారో వారితో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయడం మొదటిది కాగా, ఇనాం భూములను సాగు చేసుకుంటున్న కులవృత్తుల వారికి పట్టాలు అందించడం రెండోది. ఇక ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది ఇరవైఏళ్లు పూర్తి చేసుకున్నారో వారికి ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పిస్తూ నిషేధిత జాబితా(22-ఏ) నుంచి తొలగించడం మూడోది. ఇలా జిల్లాలో ఈ మూడు విభాగాల్లో సుమారు 40 వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో దాదాపు ఎనిమిది వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అసైన్‌మెంట్ కింద పేదలకు పంపిణీ చేశారు.

> **విచారణ జరుపుతున్నాం**
>
> సీసీఎల్ఏ ఆదేశాల ప్రకారం ఫ్రీహోల్డ్ జరిగి నిషేధిత జాబితాలో నుంచి తొలగించిన భూములపై విచారణ జరుపుతున్నాం. నిబంధనల ప్రకారం అర్హులకు ఫ్రీహోల్డ్ కల్పించారా..లేదా..? అన్నది పరిశీలిస్తున్నాం. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరిగిపోయిన భూములపై తొలుత విచారణ చేస్తున్నాం. అసైన్‌మెంట్ భూముల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఎమ్మెల్యేల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. వాటిపై కూడా విచారణ చేయిస్తున్నాం.
>
> **- కే కార్తీక్, జాయింట్ కలెక్టర్**

గ్రామసభలు లేకుండానే..

నిబంధనల ప్రకారం భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలంటే ముందుగా గ్రామసభలు పెట్టాల్సి ఉంది. ఆ గ్రామంలోని భూమిని తొలుత ఆ గ్రామంలోని భూమి లేని వారికి పంపిణీ చేయాలి. వారికిపోను మిగిలితేనే ఇతర ప్రాంతాల వారికి ఇవ్వాల్సి ఉంది. అలానే భూమి ఉన్న వారికి కొత్తగా భూమి ఇవ్వకూడదు. అయితే చాలా చోట్ల ఇతర ప్రాంతాల వారికి, భూమి ఉన్న వారికి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. భూస్వాములకు కూడా పేదల కింద చూపించి భూములు ధారాదత్తం చేసినట్లు ఎమ్మెల్యేలే ఫిర్యాదులు చేస్తున్నారు. వీరిలో అత్యధికులు వైసీపీ నాయకులే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా అసైన్‌మెంట్ కమిటీలో అర్హుల జాబితాను ఆమోదించినట్లు చెబుతున్నా నాడు అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు ఎక్కడా కూడా ప్రత్యక్షంగా జరగకపోవడం గమనార్హం.

ఫ్రీహోల్డ్ మాటున..

వైసీపీ ప్రభుత్వం గ్రామ సభలు లేకుండానే అసైన్‌మెంట్ పట్టాల పంపిణీతో పాటు ఫ్రీహోల్డ్ హక్కులను కల్పించింది. చుక్కల భూముల మాటున ప్రభుత్వ భూములను కూడా ఆ జాబితా నుంచి తొలగించి భారీ భూకుంభకోణాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఒక వ్యక్తికి అసైన్‌మెంట్ పట్టా ఇస్తున్నా లేక 20 ఏళ్లు దాటిన వారికి ఫ్రీహోల్డ్ హక్కు కల్పిస్తున్నా ముందుగా గ్రామసభ నిర్వహించాల్సి ఉంది. అప్పుడే నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుంది. కానీ అలా కాకుండా గోప్యంగా ఈ ప్రక్రియలు గత ప్రభుత్వంలో జరిగాయి. 20 ఏళ్లపాటు ఒరిజినల్ అసైనీదారులు సాగు చేయకపోయినా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. అసైనీదారుల పేరు కలిగిన మరో వ్యక్తిని తీసుకొచ్చి ఆ వ్యక్తినే ఒరిజినల్ అసైనీదారులుగా చూపించి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన సంఘటనలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఫ్రీహోల్డ్ కల్పించి నిషేధిత జాబితా నుంచి తొలగించగానే వెంటనే ఆ భూములను రిజిస్ట్రేషన్లు కూడా చేసినట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో వందల ఎకరాల భూములు రిజిస్ట్రేషన్ జరిగిపోయినట్లు తెలుస్తోంది. అసలు ఏ గ్రామంలో ఎవరికి భూపంపిణీ చేశారు..? ఎవరికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు..? అన్నది ఆయా గ్రామస్థులకు కూడా తెలియదు. అనేక ఫిర్యాదులు రావడంతో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది.

నాణ్యతకు నామం

ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతపై చర్చ సాగుతున్నది. లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్ రోజురోజుకు పెరుగుతున్నది. మరోవైపు సంప్రోక్షణ లేక శుద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆగమశాస్త్ర పండితులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆలయాల్లో అందిస్తున్న ప్రసాదాలపై భక్తులు చర్చకు తెరలేపారు. ఇంతకుముందు ప్రసాదాల నాణ్యత ఎలా ఉండేది ? ఇప్పుడు ఎలా ఉందంటూ బేరీజు వేసుకుంటూ స్థానిక ఆలయాల్లో కూడా ప్రక్షాళన జరగాలని కోరుతున్నారు. ప్రసాదాల నాణ్యతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆశిస్తున్నారు.



- ప్రసాదాలపై పర్యవేక్షణ కరువు
- జిల్లాలో 4 ఆలయాల్లోనే లడ్డూ విక్రయం
- మిగతాచోట్ల పులిహోర పొట్లాల అమ్మకం
- అవి కూడా నాసిరకమే..
- రుచిలేదంటున్న భక్తులు
- ఈవోల ఇష్టారాజ్యంగా తయారీ



నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 22: దేవుడంటే భక్తులకు ఎంత భక్తి ఉందో.. ఆయా ఆలయాల్లో విక్రయించే ప్రసాదాలపై కూడా అంతే భక్తి ఉంటుంది. దైవదర్శనం తరువాత దేవాలయాల్లో లడ్డూ, పులిహోర, చక్కెర పొంగళి, కట్టి పొం గళి, దద్దోజనం, గుగ్గిళ్లు వంటి ప్రసాదాల కోసం భక్తులు బారులుతీరు తారు. అలా అందుకున్న ప్రసాదాన్ని కుటుంబసభ్యులు, బంధు మిత్రులకు పంచిపెట్టి ఆత్మానం దం పొందుతారు. అయితే జిల్లాలోని వందలాది ఆలయాల్లో కేవలం నాలుగు ఆలయాల్లోనే లడ్డూ ప్రసాదం విక్రయిస్తున్నారు. అది కూడా నాసిరకమేనని భక్తులు పెదవి విరుస్తున్నారు. పులిహోర ప్రత్యేక సందర్భాల్లో అందుబాటులో ఉంటుంది. మిగతా ప్రసాదాలు పండుగ, ఇతర పర్వదినాల్లోనే మాత్రమే పంపిణీ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఆలయ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడరు.

నాసిరకమే దిక్కు

ఆగమశాస్త్రాల ప్రకారం ప్రతి ఆలయంలో నిత్య కైంకర్యాలతో పాటు ప్రసాదాల తయారీకి దేవదాయ, ధర్మాదాయ శాఖ నిర్ధిష్ట విధానం రూపొందించింది. దీన్ని దిట్టం అని పిలుస్తారు. ప్రతి ఆలయంలో దేవుళ్ల నైవేద్యానికి , భక్తుల ప్రసా దం కోసం ఈ దిట్టంను ఏర్పాటు చేశారు. అలాగే లడ్డూ ప్రసాదానికి, ఇతర ప్రసాదాలకు దిట్టంలు వేర్వేరుగా ఉన్నాయి.అయితే నేడు ఎక్కువమంది ప్రజాప్రతినిధులకు, ధర్మకర్తలకు, దేవదాయ శాఖ అధికారులకు దేవుడన్నా, భక్తులన్నా చులకన భావం ఉండటంతో ఆలయాలు ప్రతిష్టను కోల్పోతున్నాయి. భక్తులకు నాసిరకం ప్రసాదాలే దిక్కవుతున్నాయి. దేవుళ్లకు రోజూ నైవేద్యానికి ఇచ్చే దిట్టంలో కూడా ఆలయ ఈవోలు కోత పెట్టుతున్నారని అర్చకులు ఉన్న తాధికారులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. కానీ యథాతథంగా దిట్టంలో కోత విధిస్తూనే ఉన్నారు. ఈ విషయంలో ఆయా ఆలయాల ఈవోల చేతివాటానికి అడ్డూ ఆపూ లేకుండా ఉందనే విమర్శలు ఉన్నాయి. గతంలో దేవదాయశాఖ మంత్రిగా దండు శివ రామ రాజు ఉన్నప్పుడు ఈ శాఖలో సంస్కరణలు, ఆలయ భూముల పరిరక్షణ, దేవుళ్ల నైవేద్యాలకు ఇచ్చే దిట్టం, ఇతర ప్రసాదాల దిట్టంపై సమీక్షలు జరిగాయి. వీటిని చాలాచోట్ల పక్కాగా అమలు చేశారు. ఆ తర్వాత వచ్చిన మంత్రులు కానీ, దేవదాయ శాఖ కమిషనర్లు కానీ వాటిని పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వంలో అధికారులతో పాటు పాలక మండళ్లు కూడా ఆలయాల ప్రతిష్టను కాపాడలేదు. ఆధ్యాత్మిక విలువలకు, ఆస్తులకు గత పాల కులు పంగనామాలు పెట్టారు. రాజకీయ నిరుద్యోగులకు ఆలయాల పదవులను అప్పగించారు.

వేణుగోపాలుడి ప్రసాదం ప్రసిద్ధి

కాగా నెల్లూరు మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రసాదాలు అంటే జిల్లా వ్యాప్తంగా భక్తులు తలచుకునేవారు. ఆ రుచిని గురించి ప్రత్యేకంగా చెప్పుకునేవారు. ప్రస్తుతం ఆ ఆలయం ప్రసాదాల్లో కూడా రుచి ఉండడంలేదు. నేడు జిల్లాలో చెప్పుకోదగిన స్థాయిలో ఏ ఆలయంలో కూడా ప్రసాదాలు ఉండటం లేదు. దీనికి కారణాలు అనేకం.

నాణ్యతను పట్టించుకునేవారేరి ?

జిల్లాలో ప్రస్తుతం లడ్డూ ప్రసాద విక్రయం పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, జొన్నవాడ కామాక్షితాయి, నర్రవాడ వెంగమాంబ పేరంటాల ఆలయాల్లో మాత్రమే వారానికి రెండు మూడు రోజులు జరుగుతుంది. మిగతా ఆలయాల్లో పులిహోర పొట్లాలు మాత్రమే విక్రయిస్తారు. అయితే వీటి నాణ్యత, పరిమాణాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

నిబంధనలకు తిలోదకాలు

నిబంధనల ప్రకారం ఆలయాల ఆధ్వర్యంలో లడ్డూ, ఇతర ప్రసాదాలు తయారు చేయాలి. చాలా దేవాలయాల్లో ఈవోలు బయటి వ్యక్తులకు కాంట్రాక్టు ద్వారా ప్రసాదాలను తయారు చేయిస్తున్నారు. దీంతో నాణ్యత డొల్లగా ఉంది.

హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని ఉరితీయాలి

- జగన్, వైపీ దిష్టిబొమ్మలను దహనం చేసిన టీడీపీ నాయకులు



నెల్లూరురూరల్ : ఆ దేవదేవుని లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీ ప్రభుత్వం తీరుపై లోతైన దర్యాప్తు జరిపి, అందుకు కారకులను ఉరితీయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని రెండో డివిజన్ పరిధి సిరిగార్డెన్స్ వద్ద మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీసుబ్బారెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపినట్లు పరిశోధనల్లో బహిర్గతం కావడంతో యావత్ హిందుసమాజం ఆందోళన చెందుతుందన్నారు. జరిగిన అపచారంపై దర్యాప్తు చేసి, కారకులను న్యాయస్థానంలో నిలబెట్టి ఉరిశిక్ష పడేలా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలూరు సురేంద్ర, వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అయ్యో.. దేవుడా..!

- పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వస్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ముగ్గురి మృతి
- ఏడుగురికి గాయాలు
- మృతులు, క్షతగాత్రులు కాకుపల్లి, వనంతోపు వాసులే..

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ కుటుంబం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మరో అరగంటలో గమ్యం చేరనున్న క్రమంలో చిల్లకూరు వద్ద అదుపు తప్పిన వీరి కారు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరుకు చెందిన ముగ్గురు మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు, నెల్లూరురూరల్ మండలం కాకుపల్లికి చెందిన గోనెల బాబు(50), అతడి భార్య లక్ష్మమ్మ చిన్నపాటి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి కిషోర్‌బాబు, కళ్యాణి, మాధవి పిల్లలు. వీరిలో కళ్యాణి నెల్లూరులోని వనంతోపులో ఉండగా, ఆమెకు వెన్నెల మేఘన(8), జశ్వంత్ పిల్లలు. ఈ కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువు రాధాకుమారి, నెల్లూరుకే చెందిన బాబు కుటుంబ స్నేహితులైన సునీల్‌కుమార్, జగదీశ్వర్(45) కలిసి ఈనెల 18న పుణ్యక్షేత్రాల సందర్శనకు సునీల్‌కుమార్ కారులో వెళ్లారు. కాణిపాకం, కంచి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం వేకువన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చే సమయానికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనరు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తాత, మనవరాలైన బాబు, వెన్నెల మేఘన, జగదీశ్వర్ మృతిచెందారు. లక్ష్మమ్మ, మాధవి, కళ్యాణి, కిషోర్‌బాబు, రాధాకుమారి, సునీల్‌కుమార్, జశ్వంత్‌లకు గాయాలయ్యాయి. వీరికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని తిరుపతి సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్ పరిశీలించారు. ఈ మేరకు ఎస్ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన బాబు, జగదీశ్వర్

మృతిచెందిన వెన్నెల మేఘన



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

విషాద ఛాయలు

నెల్లూరు(క్రైం) : తిరుపతి జిల్లా చిల్లకూరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరులోని వనంతోపు, కాకుపల్లి ప్రాంతాలకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

ఏవీ.. సర్వీస్ రోడ్లు, స్పీడ్‌బ్రేకర్లు ?

వలేటివారిపాలెం, సెప్టెంబరు 22: స్థానిక నేషనల్‌హైవే నుంచి లింగపాలెంనకు వెళ్లే క్రాస్‌రోడ్డులో ఇరువైపులా స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటుతో పాటు సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు దాటే సమయంలో ఇప్పటికే ఐదారు రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. కొందరు కాళ్లు, చేతులు విరిగిపోయి మంచాలకే పరిమితం అయినట్లు చెప్పారు. ప్రకాశం జిల్లా శింగరాయికొండ నుండి పామూరు వరకు 47కిలోమీటర్లు నేషనల్‌హైవేలోని అన్నిగ్రామాల్లో క్రాస్ రోడ్డు వద్ద స్పీడు బ్రేకర్లు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. చిన్న గ్రామాల్లో సైతం ఇవి కన్పిస్తున్నాయని, మండల కేంద్రంలో ఎందుకు ఏర్పాటు చేయరో తెలియడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. లింగపాలెం క్రాస్ రోడ్డు ప్రక్కన పెట్రోలు బంకు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే వాహనాలు రద్దీ పెరిగి ప్రమాదాలు పెరిగే అవకాశాలు ఉందని చెబుతున్నారు.


వలేటివారిపాలెంలో ఏర్పాటు చేయని సర్వీసు రోడ్డు

ప్రజల కోసం పరితపించే వ్యక్తి సీఎం చంద్రబాబు

● కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

కావలి, సెప్టెంబరు 22: ప్రజల కోసం నిరంతరం పరితపించే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక 38వ వార్డులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి వందరోజుల పనుల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అమృత్‌ఫైలాన్ కూల్చిన చోటనే ఐలవ్ కావలి ఐకాన్‌ను ఏర్పాటు చేశామన్నారు. అమృత్‌పథకం పనులు త్వరలో పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలో ప్రారంభోత్సవం చేసి 7,500ఇళ్లకు తాగునీరు అందజేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న వైకుంఠపురం ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను త్వరలోనే చేపడతామన్నారు. అన్నపుగుంట మురుగునీటి బావుల నీరు బోర్లలోకి ఇంకుండా డ్రైనేజి ద్వారా బయటకు పంపుతామన్నారు. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పనిచేసే వారికే పట్టం కట్టాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్, నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, బోజవాడ రవీంద్ర, సమ్మను వెంకటసుబ్బయ్య, రుషికేష్, బ్రహ్మానందం పాల్గొన్నారు.


కావలి: కరపత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి


కందుకూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు: ప్రజలకు మంచి చేయటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రణాళికలు రచిస్తున్నాడని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పోతురాజుమిట్ట ప్రాంతంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి వందరోజుల్లో అమలు చేసిన సంక్షేమ కార్య క్రమాలను వివరిస్తూ కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజాదర్బారు కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. పట్టణంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు నివాస స్థలాలుగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. డంపింగ్‌యార్డు సమస్యను 6నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, తహసీల్దార్ ఇక్బాల్, నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, మంగపాటి శ్రీనివాసరావు, వడ్డెళ్ల రవిచంద్ర, బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం మం డలంలోని తెడ్డుపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో బా గంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను తెలియచేసి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ పురవీ దుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వికాస్ హరికృష్ణ, మండల టీడీపీ కన్వీ నర్ పేలపూడి వెంకటరత్నం, సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, తహసీ ల్దారు నాగరాజు, ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, కూటమి నాయకులు శ్రీకుర్తి రవీంద్ర బాబు, కాకర్ల మధు, దయానందం, చీదర్ల మల్లికార్జున, చుండి హరిగోపా ల్‌రెడ్డి,



ఉదయగిరి రూరల్: తెడ్డుపాడులో నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

రవి తదితరులు పాల్గొన్నారు.

● వింజమూరులో..

నందిగుంటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆ నిర్వహించారు. ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, గంగ పట్ల రంగయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

ఏఎస్ పేట: హసనపురంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేశారు. ఎన్ డిసిసి బ్యాంక్ జిల్లా మాజీ చెర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, నంది వివేకానందరెడ్డి, మాల్యాద్రినాయుడు, షేక్ జిలానీబాషా, అల్లంపాటి కృష్ణారెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

పొడపాటి శివకుమార్ బీజేపీలో చేరిక

కందుకూరు, సెప్టెంబరు 22: జై భారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన పొడపాటి శివకుమార్ (చక్రి) ఆదివారం బీజేపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి వెంకయ్యనా యుడు సమక్షంలో ఆయన పార్టీ సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, చుండి మురళీధర్, బుర్రా కోటేశ్వరరావు, మాల్యాద్రి నాయుడు, వైకుంఠం, శ్రీధర్, మువ్వల భూషయ్య పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉత్తమ డెలిగేట్
నల్లూరి సుబ్బారావుకు అభినందనలు

కందుకూరు, సెప్టెంబరు 22: ఏపీఎస్ఆర్టీసీ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) ద్వారా కార్మికులకు సేవలందించి రాష్ట్రస్థాయి ఉత్తమ డెలిగేట్‌గా ఎంపికైయ్యాడు కందుకూరు డిపో నల్లూరి సుబ్బారావు. విజయవాడలో జరిగిన ఆర్టీసీ సీసీఎస్ 69వ వార్షికోత్సవంలో ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ముఖ్యఅతిథిగా పాల్గొని సుబ్బారావుకు ప్రశంసాపత్రం, నగదు బహుమతిని అందజేశారు. ఆదివారం కందుకూరు డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు ప్రసాదు, ఈయూ నాయకులు రాజు, మహేష్, శివ, కొండలు, రహంతుల్లా, స్వామి ఆయన్ను అభినందించారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


రిటైర్డ్ టీచర్లను సన్మానించిన యూటీఎఫ్ నేతలు

కావలి, సెప్టెంబరు 22: ఉద్యమాలతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి సాధ్యపడుతోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిలారి వెంకటేశ్వర్లు, జీవీ చలపతిశర్మ తెలిపారు. ఆదివారం స్థానిక సాయి డిగ్రీకళాశాల ఆడిటోరియంలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రసాద్, లక్ష్మీ, మాధవ, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా సత్యనారాయణ, అధ్యక్షుడిగా ముజీబ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా చెన్నక్రిష్ణయ్య ఉన్నారు.

నార్తుమోపూరులో ఉచిత వైద్యశిబిరం

అల్లూరు, సెప్టెంబరు 22: ఆశా లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్తుమోపూరులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందుమీనన్ పాల్గొని స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు నిరంజన్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు, ఎల్లు సాల్మన్‌రాజు, ఆశీర్వాదం, బాపన విజయకుమార్, నార్తు మోపూరు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 22:నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం కల్పిస్తామని, పట్టణంలో ఆర్యవైశ్యులు ప్రశాంత వాతావరణంలో వ్యాపారం చేసుకునేందుకు అన్నివిధాలా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్దబజారు వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయ కళ్యాణ మండపంలో పోలీసుశాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీ వల జరిగిన శ్రీగాయత్రీ గోల్డ్‌షాప్ దొంగతనం రికవరీని ప్రస్తావించారు. ఇకముందు కూడా పట్టణంలో దొంగతనం జరిగినా వెంటనే గుర్తించేందుకు వీలుగా అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తా మన్నారు. 24గంటలు గడవకముందే దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేసిన సీఐ వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయించటం గొప్ప విషయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్లే బంగారం షాపులో దొంగలను పట్టుకోగలిగామని తెలిపారు. ఈ సందర్భంగా బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సాంబశివయ్య, ఆర్యవైశ్య ప్రముఖులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, కొత్తూరి సుధాకరరావు, కోటా కిషోర్, చక్కా కేశవ, కోట నరసింహ్మం, ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, తుమ్మపూడి సురేష్, మురారి శెట్టి వెంకటసుబ్బారావు, బొగ్గవరపు సత్యం, చీదెళ్ల పిచ్చయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

కావలి, సెప్టెంబరు 22: స్థానిక ట్రంకు రోడ్డులోని దుకాణాల ఎదుట వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తూ ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పోల్స్ నాటించారు. పోల్స్ అవతల మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలన్నారు.

రేపటి నుంచి పొలం పిలుస్తోంది

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 22: ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో ఉదయం ఒక గ్రామం, సాయంత్రం మరో గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పాల్గొని పొలాలను సందర్శించి రైతులకు వ్యవసాయంలో సాంకేతిక సలహాలు అందచేస్తారని, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో తాతామనవడు మృతి

వలేటివారిపాలెం, సెప్టెంబరు 22: అయ్యవారిపల్లె టీడీపీ సీనియర్ నాయకుడు ఉప్పుటూరి పెదకొండపనాయుడు (73) ఆయన మనవడు ఉప్పుటూరి దినేష్ (10) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటన శనివారం రాత్రి 7గంటల సమయంలో విజయవాడ సిటీలో జరిగింది. దినేష్ అక్కడికక్కడే మృతి చెందగా, పెదకొండపనాయుడు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం 7గంటల సమయంలో తుదిశ్వాస విడిచాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకొండపనాయుడు, దినేష్‌ను ట్యూషన్ నుండి మోటారుబైకుపై ఇంటికి తీసుకెళ్తుండగా రోడ్డు దాటే సమయంలో వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. పెద్దకొండపనాయుడు కొడుకు, కోడలు, వారి పిల్లలు, కూతురు, అల్లుడు వారి పిల్లలు గత కొన్నేళ్లుగా వ్యాపార నిమిత్తం విజయవాడలోనే ఉంటున్నారు. రెండు మృతదేహాలకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాలను అయ్యవారిపల్లెకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువులు రోదన స్థానికు లను కదలించాయి.

మాలో ఎలాంటి గ్రూపులు లేవు

● మాలేపాటి సుబ్బానాయుడు

కావలి, సెప్టెంబరు 22: కావలి టీడీపీలో గ్రూపులు లేవని పార్టీ నాయకులంతా ఒక్కటేనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును చూసే ప్రజలు ఓట్లు వేశారన్నారు. వైసీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాజిక ఫింఛన్లు, ఉద్యోగుల జీతాలు పెంచి ఒకటో తేదీనే జీతాలు చెల్లించటం సమర్ధవంతమైన పాలనకు నిదర్శనమన్నారు. టీడీపీ పాలనలో కావలి-తుమ్మలపెంట, దగదర్తి-బుచ్చి రోడ్లకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కృషితో నిధులు మంజూరైతే వైసీపీ ప్రభుత్వం పనులు చేయకుండా వదిలేసిందన్నారు. తుమ్మలపెంట రోడ్డులోని గుంటలకు మట్టి పోస్తే నాపై కేసులు పెట్టారని మాలేపాటి గుర్తుచేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నాని మరణించే వరకు టీడీపీతోనే ప్రయాణిస్తానన్నారు.

పార్టీ నాయకులను కలిస్తే తప్పా : మన్నవ

తాను టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ పార్టీ ప్రధాన కార్యాలయాలకు వెళ్లి ముఖ్యులను కలుస్తుంటానని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర తెలిపారు. అందులో భాగంగా ఇటీవల అమరావతి వెళ్లి మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కిలారి రాజేశ్వరరావును కలిస్తే తనపై విమర్శలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ నేతలు విజయకుమార్‌రెడ్డి, మణి పాల్గొన్నారు.

వర్షం వస్తే ఇదీ పరిస్థితి !



స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో బస్సుల రాకపోకలకు అనువుగా కాంక్రీట్ నిర్మాణం చేపట్టారు. అయితే వర్షం వస్తే నీరు వెళ్లేందుకు అనువుగా సైడ్ కాలువ నిర్మాణం చేపట్టకలేదు. ఈ సమస్యతో ఆదివారం కురిసిన వర్షంతో బస్టాండ్ ఆవరణం నుంచి గ్యారేజీలోకి వెళ్లే మార్గంలోని బస్టాండ్ ఆవరణంలో వర్షపు నీరు నిలిచి పోయింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - కావలి

అల్లుకున్న తీగలు తొలగించరా ?

వలేటివారిపాలెం నుండి చుండికి వెళ్లే రోడ్డులో రైతు కాకుమాను మాల్యాద్రి పొలంలో విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. కరెంట్ సరఫరా కాకపోతే రైతులు ఇక్కడి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు పనులు చేయించాల్సి ఉంటుంది. అల్లుకున్న తీగలతో స్తంభం ఎక్కేందుకు కరెంట్ మెకానిక్‌లు, రైతులు జంకుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. -వలేటివారిపాలెం



పేరు మారలేదు..



అంకభూపాలపురం రైతుసేవా కేంద్రం ఇది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రంగానే పేరు ఉంది. కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాల పేర్లు మార్చాలని జీవో విడుదల చేసి నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకుల ఆదేశాలు వీరు మరిచారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. -వలేటివారిపాలెం

ఏచూరి ఆశయాలను కొనసాగించాలి


నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

కందుకూరు, సెప్టెంబరు 22: లౌకికవాది, పోరాటయోధుడు సీతారాం ఏచూరి ఆశయాలను కొనసా గించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్కే. సల్మా, మోహనరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

మాతా పరమేశ్వరి సన్నిధిలో మెట్టుకూరు



సంగం, సెప్టెంబరు 22: స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో ఉన్న మాతాపరమేశ్వరి అమ్మవారిని ఎన్‌డీసీసీబీ మాజీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఏయస్‌పేట మండలం హసనాపురంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరై తిరిగి నెల్లూరు వెళ్తుండగా టీడీపీ నేత మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక చెక్‌పోస్టు కాలనీవాసులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మాతాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

మెరుగు పేరుతో మోసం

● బిహార్ యువకుల నిర్వాహకం

● 24గ్రాముల దండలో 11 గ్రాములు కరిగించిన వైనం


మోసపోయిన దొరసానమ్మ

లింగసముద్రం, సెప్టెంబరు 22: బంగారు దండకు మెరుగు పట్టిస్తామని బిహార్‌కు చెందిన ఇద్దరు యువకులు ఆదివారం మధ్యాహ్నం 1గంట సమయంలో లింగసముద్రంలో ఓ మహిళను మోసం చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని సుబ్బయ్య సామిల్లు వీధిలోకి ఉంటున్న సోమరపాటి దొరసానమ్మను బీహార్ యువకులు కలిశారు. విషయం చెప్పడంతో ఆమె ఇంట్లోని తన 24గ్రాముల (3సవర్లు) దండ తెచ్చి వారి చేతికి ఇచ్చింది. వారిలో ఓయువకుడు ఆ దండకు మెరుగు పట్టినట్టు నటించి ద్రావకంలో ఆ దండను కరిగించి, పసుపు పూసి ఇచ్చి వెళ్లి పోయారు. అయితే ఆమె దండను ఇంట్లోకి తీసుకెళ్లి కడి గి చూడటంతో బరువు తగ్గినట్టు అనుమానం వచ్చింది. వెంటనే కుమారుడు, కోడలికి చెప్పింది. వారు చుట్టుపక్కల వారికి జరిగిన విషయం చెప్పారు. గ్రామంలో గాలింపు చర్యలు చేపట్టారు. దండకు మెరుగు పట్టిన యువకుడు పరారు కాగా మరో యువకుడు బస్టాండ్ వద్ద గ్రామస్థుల చేతికి చిక్కాడు. అతన్ని పోలీసులకు అప్పగించారు. అయితే బంగారం దండను తూకం వేయగా 24గ్రాముల్లో 11గ్రాములు తగ్గినట్టు గుర్తించారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఒక్కరోజు ఉపయోగిస్తే ఒట్టు..!

● పనికిరాకుండా పోయిన చెత్త సేకరణ వాహనాలు

కలువాయి : పంచాయతీలో చెత్త సేకరణకు ప్రభుత్వం అందించిన మూడుచక్రాల రిక్షాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం లక్షలు వెచ్చించి మూడుచక్రాల రిక్షాలు, మినీ లారీ ఇచ్చింది. వీటిని తీసుకొచ్చి పంచాయతీ కార్యాలయంలో మూలపడేశారు. వీటిని ఒక్కరోజు కూడా చెత్త సేకరణకు ఉపయోగించలేదు. ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపట్టి పోతున్నాయి. వీటిని చూసిన వారంతా లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందంటున్నారు.



వరుణుడి కోసం మిర్చి రైతు ఎదురుచూపు

● అదును దాటుతోందని రైతుల ఆందోళన

వలేటివారిపాలెం, సెప్టెంబరు 22: ఆరుగాలం కష్టించే రైతన్నలు వరుణదేవుడి కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఖరీఫ్ ఆరంభమై మూడునెలలు దాటినా మండలంలో వర్షం జాడలేదు. అడపాదడపా కురిసిన జల్లులకు రైతులు దుక్కులు దున్నుకున్నారు. బోర్లు, బావుల కింద మిర్చి, పొగాకు నారుమడులు సిద్ధం చేశారు. మిర్చినారు ఏతకు వచ్చిందని, మండలంలో వర్షం జాడ లేదు, ప్రతి రోజూ మబ్బులు పట్టి ఊరించి ఉసూరుమనిపించడం తప్ప భూమీద చినుకు పడటం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో కూడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదు.


మిర్చి నాట్లు వేసేందుకు దుక్కి చేసిన పొలం


వలేటివారిపాలెంలో నాట్లకు సిద్ధంగా ఉన్న మిరప నారు

జోరుగా వర్షాలు కురిసి ముసురు పట్టాల్సిన సెప్టెంబరు నెలలో వడగాల్పులు వీస్తున్నాయి. మిర్చి పంట సాగు చేసేందుకు అదును దాటిపోతుందని ఆందోళన చెందుతున్నారు. మిర్చి నాట్లు వేసేందుకు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. అదునులో వర్షం కురిసి మిర్చి నాట్లు వేయకపోతే తెగుళ్ల బెడద, దిగుబడులు తగ్గి నష్టాలు వస్తాయని చెబుతున్నారు. పది రోజుల్లో వర్షం పడకపోతే అదును దాటిపోతుంది తరువాత మిర్చి సాగు చేసినా ఫలితం ఉండదంటున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు


కలువాయి, సెప్టెంబరు 22: స్థానిక విశ్వం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, బాలాయపల్లి, సైదాపురం మండలాల పరిధిలోని 11 పాఠశాలలకు చెందిన 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ శ్రీధర్, జిల్లా కోశాధికారి కృష్ణారావు, ఈసీ మెంబర్ శివకుమార్, రాపూరు అధ్యక్షుడు మునిందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు పుల్లయ్య, కరస్పాండెంట్లు, టీచర్లు పాల్గొన్నారు.

నేడు కొండాపురంలో ఎమ్మెల్యే పర్యటన

కొండాపురం, సెప్టెంబరు 22: ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కలిగిరి నుండి వల్లేటివారిపాలెం వరకు మంజూరైన రెండు లైన్ల రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గుడవళ్లూరులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన పనుల కరపత్రాలను అందజేస్తారని చెప్పారు. ఈ పర్యటనలో కూటమి నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, చాగంటి క్రిష్ణ, నరేంద్ర, కె.రాఘవేంద్ర, తిప్పినేని రమేష్ పాల్గొన్నారు.

నీటి వృథా.. రేపటి వ్యథ..!

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 22: ఉదయగిరి పట్టణంలో నీటి విడుదల సమయంలో ట్యాపులు లేకపోవడం, పైపుల లీకేజీలు, పగుళ్లకారణంగా నిత్యం నీటి వృథా అవుతోంది. మరోవైపు వీధుల్లో ఏర్పాటుచేసిన ట్యాంకులకు నీటిని సరఫరా చేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అవి నిండి పొంగిపొర్లుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.


సింథటిక్ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు